# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 10 జూలై 2023 వెల : రూ.15

బీజేపీ పాలనలో దేశం అధోగతి

డేంజరుగా డబుల్ ఇంజన్ సర్కార్

మణిపూర్ మారణకాండకు ఎవరు బాధ్యులు?

మరో వెయ్యేళ్ళకైనా చెయ్యాల్సిన యుద్ధం ఒకటే

ఏకరూప పౌరస్మృతిని హిందువులందరూ అంగీకరిస్తారా ?

సింగోల్ : రాజ్యాంగం మీద సర్జికల్ స్ట్రైక్!

రెండు వేల నోట్ల ఉపసంహరణ దేనికి సంకేతం?

ఖైదీల హక్కులు హరిస్తున్న జైళ్ళు

ఏకాకి గొంతును రికార్డ్ చేయనివ్వండి

మీరు వాడే వంట నూనెలో మూడో వంతు అదానీ కంపెనీలదే

పూనకాల అంటు వ్యాధి

ప్రగతి అవరోధకము.. మూఢ నమ్మకము

ఇక విజ్ఞాన శాస్త్రాల పుస్తకాల మార్పే మిగిలింది!

పీడితుల పక్షాన ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

నిరవధిక రాత్రి

అసమర్థతకు ఆనవాలు మోదీ

మహాభారతం వెల్లువలో ఒక అనుభూతి

అస్తిత్వం - చైతన్యం - కార్మికవర్గం

కమ్యూనిస్టు మానిఫెస్టో శైలి

నమస్తే తెలంగాణ

# దేశం అధోగతి

**బీజేపీ పాలనలో..**

## జీడీపీ వృద్ధిరేటు, తలసరి ఆదాయం, ఎగుమతులు, తయారీరంగం, ఉపాధి అవకాశాల్లో నేలచూపులు


**ఏదైనా ఓ దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెట్టాలంటే.. ఆ దేశ జీడీపీ వృద్ధిరేటు గణనీయంగా పెరగాలి. ప్రజల తలసరి ఆదాయం ఎగబాకాలి. ఎగుమతుల్లో వృద్ధి నమోదవ్వాలి. తయారీరంగం ఊపందుకోవాలి. నిరుద్యోగం తగ్గాలి. అప్పుడే ఆ దేశం సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది. అయితే, గడిచిన పదేండ్లలో భారత్ ఈ అంశాల్లో ఏ కొశానా వృద్ధి నమోదు చేయలేదు. ఆసియాలోని ప్రధాన దేశాలకు ఏ రకంగానూ పోటీనివ్వలేదు. తొమ్మిదేండ్లలో బీజేపీ సర్కారు సాధించిన ఘనత ఇది.**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): 'అచ్చే దిన్' తీసుకొస్తామంటూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. దేశాన్ని అధోగతిపాల్జేసి ప్రజలకు సచ్చే దినాలను చూపిస్తున్నది. దేశ ప్రగతికి సూచికలుగా భావించే ఐదు కీలక అంశాలైన జీడీపీ వృద్ధిరేటు, తలసరి ఆదాయం, ఎగుమతులు, జీడీపీలో తయారీరంగం వాటా, నిరుద్యోగిత రేటులో మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే, భారత్ అట్టడుగు స్థానాల్లో నిలిచింది. ఈ మేరకు గడిచిన పదేండ్ల గణాంకాలను విశ్లేషిస్తే అర్థమవుతున్నది. జనాభా విషయంలో భారత్‌లో 14వ వంతు కూడా లేని చిన్న దేశం వియత్నాం.. జీడీపీ వృద్ధిరేటులో మనకంటే ఎంతో ముందున్నది. చైనా బెదిరింపులతో నిత్యం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న తైవాన్ తలసరి ఆదాయంలో భారత్‌కు అందనంత ఎత్తులో ఉన్నది. కరోనా సంక్షోభం, లాక్‌డౌన్ ప్రభావం చూపిన ప్పటికీ ఎగుమతుల్లో చైనా చూపించిన దూకుడును భారత్ అందుకోలేకపోయింది. ఇక, భారత జీడీపీలో తయారీ రంగం వాటా ఏకంగా 1.3 శాతం పడిపోయింది. నిరుద్యోగం పెచ్చరిల్లుతున్న ఆసియా దేశాల జాబితాలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. థాయిలాండ్‌తో పోలిస్తే, భారత్‌లో నిరుద్యోగం 8 రెట్లు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది.

### దశాబ్దకాలంలో డీలాపడిన ఎగుమతులు




ఎగుమతులు ఎక్కువగా ఉన్న దేశం ఆర్థికంగా పుష్టిగా ఉంటుందంటారు. ఎగుమతులకు సంబంధించి 9 ఆసియా దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానానికి పరిమితమైంది. తొలి ఐదేండ్లతో పోలిస్తే, మలి ఐదేండ్లలో భారత్ ఎగుమతుల్లో తగ్గుదల నమోదైంది. వియత్నాం ఈ క్యాటగిరిలో తొలిస్థానంలో ఉండగా, మలేషియా, చైనా, తైవాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

### దశాబ్దకాలంలో జీడీపీలో తయారీరంగం వాటా తగ్గిందిలా..

(శాతంలో)

| | 2021లో | 2012-21వరకు |
|---|---|---|
| వియత్నాం | 24.6 | 3.9 |
| మలేషియా | 23.5 | 0.6 |
| థాయిలాండ్ | 27 | -0.6 |
| ఇండియా | 14 | -1.3 |
| ఇండొనేషియా | 19.3 | -1.8 |
| దక్షిణ కొరియా | 25.5 | -2.3 |
| ఫిలిప్పీన్స్ | 17.6 | -2.8 |
| చైనా | 27.4 | -3.2 |

'మేకిన్ ఇండియా' పేరిట ప్రచారానికే పరిమితమైన బీజేపీ సర్కారు తయారీరంగాన్ని పట్టించుకోలేదు. దీంతో ఎన్నో పరిశ్రమలు మూతబడ్డాయి. ఫలితంగా 2012లో జీడీపీలో 15.8 శాతం వాటా కలిగిన తయారీరంగం.. 2022 నాటికి 14 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో తయారీరంగంలో వియత్నాం, మలేషియా వంటి చిన్న దేశాలు దూసుకుపోతున్నాయి.


### 2022లో భారత్ తలసరి ఆదాయం (డాలర్లలో)

| | |
|---|---|
| తైవాన్ | 32,643 |
| దక్షిణ కొరియా | 32,250 |
| చైనా | 12,814 |
| మలేషియా | 12,364 |
| థాయిలాండ్ | 7,651 |
| ఇండొనేషియా | 4,798 |
| వియత్నాం | 4087 |
| ఫిలిప్పీన్స్ | 3,623 |
| ఇండియా | 2,379 |

ఒక వ్యక్తి ఏడాదిలో సంపాదించే మొత్తాన్ని తలసరి ఆదాయంగా చెబుతారు. 2.3 కోట్ల జనాభా ఉన్న చిన్న దేశం తైవాన్ తలసరి ఆదాయం రూ. 27 లక్షలుగా ఉంటే, భారత్‌లో ఒక్కొక్కరి ఆదాయం రూ. 2 లక్షలకే పరిమితమైంది. తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న తొమ్మిది ఆసియా దేశాల జాబితాలో భారత్ చిట్టచివరి స్థానంలో నిలిచింది.

### జీడీపీలో వియత్నాం, చైనాకంటే భారత్ వెనుకంజ

పనిచేయగలిగే శ్రామికశక్తికి తగిన అవకాశాలు లభిస్తే ఉత్పాదకత పెరుగుతుంది. అది జీడీపీ వృద్ధిరేటుకు బాటలు వేస్తుంది. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ జనాభా కలిగిన భారత్ వంటి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ జీడీపీ వృద్ధి రేటుతో పోలిస్తే చిన్న దేశం వియత్నాం వృద్ధిరేటు ఎంతో ఎక్కువగా ఉన్నది. వియత్నాంతో పోలిస్తే, భారత్‌లో శ్రామికశక్తి 17 రెట్లు ఎక్కువ. అయినప్పటికీ జీడీపీ వృద్ధిరేటులో భారత్ కంటే వియత్నాం ఎంతో మెరుగ్గా ఉన్నది. దాదాపు మన దేశంతో సమానమైన జనాభా కలిగిన చైనా జీడీపీ వృద్ధిరేటు కూడా భారత్ కంటే ఎక్కువే.





### గరిష్ఠస్థాయిలోనే భారత్‌లో నిరుద్యోగం

నిరుద్యోగిత రేటు (శాతంలో)

| | 2013-2017 | 2018-2022 |
|---|---|---|
| ఇండియా | 7.9 | 7.88 |
| చైనా | 4.58 | 4.66 |
| ఇండొనేషియా | 4.2 | 3.92 |
| మలేషియా | 3.2 | 3.78 |
| దక్షిణ కొరియా | 3.34 | 3.59 |
| ఫిలిప్పీన్స్ | 3.08 | 2.39 |
| వియత్నాం | 1.63 | 1.85 |
| థాయిలాండ్ | 0.59 | 0.89 |



దేశంలో ఇప్పటికిప్పుడు ఉద్యోగం కావాల్సినవారు 22 కోట్ల మంది ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయి. దీన్ని ధ్రువపరుస్తూ.. తొమ్మిది ఆసియా దేశాల్లో నిరుద్యోగిత రేటులో భారత్ టాప్ ప్లేస్‌లో ఉన్నది. దేశంలో నిరుద్యోగిత రేటు 7.9 శాతంగా ఉంటే, థాయిలాండ్‌లో ఇది కేవలం 0.9 శాతమే.



# డేంజరుగా డబుల్ ఇంజన్ సర్కార్

మోదీ ఒక మాటల మాంత్రికుడు. ఒకనాడు కేంద్రం రాష్ట్రాల మధ్య సఖ్యత అవసరం అన్నారు. రాజకీయాలు వేరైనా కలిసి నడవాలన్నారు. పైగా దీనికి టీం ఇండియా అని పేరు పెట్టారు. గత ప్రభుత్వాలు రాష్ట్రాలను పట్టించుకోవడం లేదన్నారు. తన ప్రభుత్వ నీతి అయోగ్‌ను ఏర్పాటు చేసిందని అది కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య వారధిగా ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా ముఖ్యమంత్రుల సమావేశాలు జరుగుతాయని, దేశం కోసం కలిసి ప్రయాణం సాగిస్తామన్నారు. ఇవన్నీ దేశ ప్రజల కోసం చెప్పిన మాటలు. కాని ఆయన 'మన్ కీ బాత్' దీనికి విరుద్ధమైంది.

దేశానికి ఒకే పన్ను అన్నారు. రాష్ట్రాల పన్ను హక్కుని లాగేసుకున్నారు. ప్రతి వస్తువు మీద జీఎస్టీ వేసి ధరలను అందనంత పైకి నెట్టారు. వ్యవసాయం రాష్ట్రానికి చెందిన హక్కు. దానిని మూడు వ్యవసాయ చట్టాల పేరుతో తన అధీనంలోకి తెచ్చుకుని కార్పొరేట్లకు లబ్ధి చేకూరే ప్రయత్నం చేశారు. రైతుల ప్రతిఘటనతో అది తాత్కాలికంగా ఆగింది. విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. కొత్త విద్యా విధానం పేరుతో దానిని కబ్జా చేసి విద్వేష పూరిత మత రాజకీయాలకు, చరిత్ర వక్రీకరణలకు బాటలు వేసుకుంది. ఒకేదేశం, ఒకే భాష పేరుతో, ఒకే సంస్కృతి పేరుతో దేశంలో వున్న భాషా, ప్రాంతీయ పరమైన భిన్నత్వంపై దాడిని ప్రారంభించింది. ఇలా సహకార సమాఖ్య నినాదం రాష్ట్రాలకు గొడ్డలి పెట్టుగా మారుతున్నది.

ఇక రాజకీయంగా చూస్తే మొదట కాంగ్రెస్ విముక్త భారత్ అని ప్రధాన ప్రతిపక్షం మీద దాడి ప్రారంభించింది. దీనిని కేవలం ప్రత్యర్థి ప్రధాన పార్టీ మీద రాజకీయ ప్రచారంగా భావింపజేశారు. తర్వాత డబుల్ ఇంజన్ సర్కార్ నినాదం తెచ్చి అన్ని ప్రాంతీయ పార్టీల మీద రాజకీయ దాడి ప్రారంభించారు. ఇప్పుడు సహకార సమాఖ్య నినాదాన్ని ఈ డబుల్ ఇంజన్ సర్కార్ నినాదం ఆక్రమించింది. మత విద్వేష రాజకీయం, భిన్నత్వం మీద దాడి చేసే రాజకీయం ఎల్లకాలం చెల్లదని, డబుల్ ఇంజన్ సర్కార్లు దానిని కాపాడలేవని వరుస ఎన్నికలు రుజువు చేస్తున్నాయి.

హిమాచల్‌ప్రదేశ్, కర్నాటకలో డబుల్ ఇంజన్ సర్కార్లు కూలిపోయాయి. మణిపూర్ మరో డబుల్ ఇంజన్ సర్కార్. ఇప్పుడా రాష్ట్రం భగ్గున మండిపోతున్నది. మెజారిటీ, మైనారిటీ తెగల మధ్య, మతపరమైన చిచ్చు రగిలించారు. నెల రోజులుగా అక్కడ మారణకాండ, దహనకాండ సాగుతున్నది. ఈ దాడులలో వందకు పైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. రక్షించండి మహా ప్రభో అని వేడుకుంటున్నా మోదీ నోరు విప్పలేదు. అక్కడ కేంద్ర బలగాలున్నాయి. రాష్ట్ర పోలీసులు ఉన్నారు. అయినా విధ్వంసకాండ సాగిపోతున్నది. ఇలా విద్వేష రాజకీయం, విభజన రాజకీయం పెనవేసుకున్న మణిపూర్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఆ రాష్ట్రానికే డేంజర్‌గా మారింది.

- డీవీవీఎస్ వర్మ
సంపాదకులు, 85006 78977

జూలై - 2023

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 10

డీవీవీఎస్ వర్మ

\- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణ మూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. బీజేపీ పాలనలో దేశం అధోగతి 2

2. డేంజరుగా డబుల్ ఇంజన్ సర్కార్ - సంపాదకీయం 3

3. మణిపూర్ మారణకాండకు ఎవరు బాధ్యులు?- ఎ.కృష్ణారావు 5

4.మరో వెయ్యేళ్ళకైనా చెయ్యాల్సిన యుద్ధం ఒకటే - డా. ప్రసాదమూర్తి 7

5. ఏకరూప పౌరస్మృతిని హిందువులందరూ అంగీకరిస్తారా ? - ఎం.కోటేశ్వరరావు 9

6. సింగోల్ : రాజ్యాంగం మీద సర్జికల్ స్ట్రైక్! - దేవరాజు మహారాజు 12

7. రెండువేల నోట్ల ఉపసంహరణ దేనికి సంకేతం? - కేశవ్ 14

8. ఖైదీల హక్కులు హరిస్తున్న జైళ్ళు - ఆకార్ పటేల్ 16

9. ఏకాకి గొంతును రికార్డ్ చేయనివ్వండి - తులసి చందు 18

10. మీరు వాడే వంటనూనెలో మూడో వంతు అదానీ కంపెనీలదే 20

11. పూనకాల వ్యాధి - డాక్టర్ నంబూరి చంద్రశేఖర్, డాక్టర్ విరించి విరివింటి 22

12. ప్రగతి అవరోధకము.. మూఢ నమ్మకము - డాక్టర్ సి.వి.సర్వేశ్వరశర్మ 24

13. ఇక విజ్ఞానశాస్త్రాల పుస్తకాల మార్పే మిగిలింది! - సంపత్ 27

14. పీడితుల పక్షాన ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి -ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి 28

15. నిరవధిక రాత్రి - కె.శ్రీనివాస్ 30

16. అసమర్థతకు ఆనవాలు మోదీ - ఆర్వీ రామారావు 32

17.మహాభారతం వెల్లువలో ఒక అనుభూతి - కృష్ణుడు 34

18. అస్తిత్వం - చైతన్యం - కార్మికవర్గం - గౌరవ్ 36

18. కమ్యూనిస్టు మానిఫెస్టో శైలి - కొండూరి వీరయ్య 38

19. మోలీ ట్రిక్స్.. కార్టూన్స్ 41




కార్టూన్ : సతీష్ ఆచార్య

దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి


**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

# మణిపూర్ మారణకాండకు ఎవరు బాధ్యులు?



- ఎ.కృష్ణారావు

**మణిపూర్‌లో కుకీలు, మెయితీల మధ్య చారిత్రకంగా ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్నప్పటికీ ఎందుకు కేంద్ర, రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండలేదు? హింసాకాండ గురించి వారికి ఎందుకు ముందస్తు సమాచారం అందలేదు? ఆదివాసీలను అక్రమంగా వారి ప్రాంతాల నుంచి తొలగించడం, మెయితీల రిజర్వేషన్‌పై హైకోర్టు సానుకూలంగా స్పందించడం మొదలైన వాటి పర్యవసానాలను మోదీ సర్కార్ ముందుగా ఊహించలేదా?**



ఈ దేశంలో ఎన్ని ఉత్పాతాలు సంభవించినప్పటికీ రాజకీయాలు మాత్రం ఆగవు. ఉత్తర భారతంలో వడగాడ్పుల ధాటికి తట్టుకోలేక అనేక మంది పిట్టల్లా నేల రాలిపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభాగ్య జీవులకు స్థలం చాలడం లేదు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోని బలియాలోనే ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం 68 మంది మరణించారు. ఆసుపత్రుల్లో కరెంట్ కూడా లేకపోవడంతో వృద్ధులు అక్కడికక్కడే విగత జీవులవుతున్నారు. ఉత్తర భారతావని అంతటా పాఠశాలల వేసవి సెలవులను పొడిగించారు. ప్రతి ఏడాదీ ఈ వేడి గాలులకులోనై వేలాది మంది మరణించటం సాధారణమైంది. అయినా కేంద్రం, రాష్ట్రాలలోని డబుల్ ఇంజన్ సర్కార్లు కలిసికట్టుగా కార్యాచరణకు పూను కోవడం లేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు చర్యలు తీసుకుంటాయి. ఇంతటి చిన్న సమస్యనే పరిష్కరించలేని వారు మణిపూర్‌లాంటి అతి తీవ్ర సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తారు? గత 50 రోజులుగా మణిపూర్ నెత్తుటి ధారలతో మండిపోతు న్నది. 150 మందికిపైగా ప్రజలను హతమార్చారు. ఈ హింసాకాండ మామూలుది కాదు. ఒళ్లు జలదరింపచేసే హింసాకాండ. తలలో బుల్లెట్ తగిలిన ఒక బాలుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకుపోతుంటే ఒక అల్లరి మూక దానిని అడ్డుకుని దగ్ధం చేసింది. అందులో ఆ బాలుడితోపాటు అతడి తల్లి, బంధువు బూడిదయ్యారు. ఒక గ్రామాన్ని పూర్తిగా దగ్ధం చేసి అనేకమందిని మంటలకు ఆహుతి చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులంతా పలాయనం చిత్తగించి పర్వత ప్రాంతాల్లో దాచుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. వేలాది ప్రజలు శిబిరాల్లో తలదాచుకున్నారు. 60 వేల మంది తమ ఇళ్లను విడిచి పారిపోయారు. 4300 విధ్వంస ఘటనలు సంభవించాయి. వీటిలో భాగంగా 3500 ఇళ్లు, 275 గ్రామాలు ధ్వంసం అయ్యాయి. మణిపూర్‌లో ఇప్పుడు పోలీసులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అంటూ ఎవరూ లేరు. ఉన్నదల్లా రెండు వర్గాలే. ఆ రెండు వర్గాలు ఒక దాన్ని మరొకటి నిర్మూలించుకునే పరిస్థితిలో ఉన్నాయి. మణిపూర్‌లో ఎల్లెడలా సైన్యం విస్తరించినా, హింసాత్మక మూకలు అత్యాధునిక ఆయుధాలతో ఊచకోతలు చేస్తున్నాయి. వారి చేతుల్లోకి ఈ ఆయుధాలు ఎలా వచ్చాయి? కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా మణిపూర్‌కు వెళ్లి నాలుగు రోజులు బస చేసివచ్చారు. అయినా హింస ఆగలేదు. సుప్రీంకోర్టు కూడా శాంతి భద్రతల పరిస్థితి తమ చేతుల్లో లేదని నిస్సహాయత ప్రకటించింది.

పైపెచ్చు మణిపూర్‌లో ఆరేళ్లుగా బీజేపీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ సర్కారే కొనసాగుతోంది. మరి ఈ డబుల్ ఇంజన్ సర్కార్ ఏమి చేసినట్లు? లిబియా, లెబనాన్, నైజీరియా, సిరియా లాంటి దేశాల్లో కనపడే ఇలాంటి బీభత్స బర్బర హింసాకాండ మన దేశంలోని ఒక రాష్ట్రంలో నెల రోజులకు పైగా జరుగు తున్నా మోదీ ప్రభుత్వం ఎందుకు అరికట్టలేకపోతోంది? ప్రజలను శాంతింపచేసి తమ మాట వినేలా ఎందుకు చేయలేక పోతోంది? అసలు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతున్నా కేంద్రం దాన్ని రద్దు చేసి పరిస్థితిని తన చేతుల్లోకి ఎందుకు తీసుకోవడం లేదు? మణిపూర్‌లో కుకీలు, మెయితీల మధ్య చారిత్రకంగా ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్నప్పటికీ ఎందుకు కేంద్ర, రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండలేదు? హింసాకాండ గురించి వారికి ఎందుకు ముందస్తు సమాచారం అందలేదు? ఆదివాసీలను అక్రమంగా వారి ప్రాంతాల నుంచి తొలగించడం, మెయితీల రిజర్వేషన్‌పై హైకోర్టు సానుకూలంగా స్పందించడం

మొదలైన వాటి పర్యవసానాలను మోదీ సర్కార్ ముందుగా ఊహించలేదా? ఆదివాసీలంతా ఏకమై ఒక మోర్చాను ఏర్పర్చి ర్యాలీ తీసిన విషయమై వారికి సమాచారం లేదా? లేక మెజా రిటీ ప్రజాప్రతినిధులు ఒకే వర్గానికి చెందిన వారున్నందు వల్ల తమ రాజకీయాల కోసం మౌనం పాటించారా? లేక దేశంలో ఇతర రాజకీయాలు చేస్తూ మణిపూర్‌ను విస్మరించారా? విచిత్రమేమంటే మణిపూర్‌ను అమిత్ షా సందర్శించిన తర్వాతే ఆ ఈశాన్య రాష్ట్రంలో హింసాకాండ మరింత తీవ్రతరమైంది. ఆయనకు అనేక బాధ్యతలు. దేశంలో శాంతి భద్రతల పరిస్థితిని అరికట్టడం అనేది ఆయనకు అందులో ఒక బాధ్యత మాత్రమే. దేశంలో రాజ కీయాలు చేయడం, భారతీయ జనతా పార్టీని వివిధ రాష్ట్రాల్లో గెలిపించడం. ప్రతిపక్ష నేతలను బలహీనపరచడం మొదలైన అనేక బాధ్యతలు ఉన్నాయి. మణిపూర్‌లో హింసాకాండ జరుగు తున్న సమయంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా కర్ణాటక ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్నారు. కర్ణాటకలో డబుల్ ఇంజన్ సర్కార్ ఎంత ముఖ్యమో చెబుతూ వీధి వీధి వారు తిరిగారు. ఆ ఎన్నికల ఘట్టం పూర్తయిన తర్వాత కాని అమిత్ షా మణిపూర్ సందర్శించలేదు.

ఇక ప్రధానమంత్రి నరేంద్రమోదీ అయితే మణిపూర్ గురించి ఇంత వరకూ పెదవి విప్పలేదు. కనీసం శాంతియుతంగా ఉండాలని ప్రజలకు పిలుపు కూడా ఇవ్వడం లేదు. దమన కాండ, దారుణాలు జరిగినప్పుడు మౌనంగా ఉండడం, అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడు ఉపన్యాసాలు చేయడం ఆయన నైజంగా కనపడుతుంది. గుజరాత్‌తోపాటు తన హయాంలో ఎక్కడ అల్లర్లు జరిగినా ఆయన మాట్లాడలేదు. మహిళా మల్లయోధులు తమపై లైంగిక అత్యాచారాలు జరిగాయని రెండు నెలలుగా ఘోషిస్తున్నా ఆయన స్పందించలేదు. ఇలాంటి ఘటనలపై ఆయన 'మన్ కీ బాత్' మనకు వినపడదు. గత ఆదివారం తన 'మన్ కీ బాత్' ప్రసంగంలో మణిపూర్ గురించి ప్రస్తావించనందుకు అక్కడి ప్రజలు ఆగ్రహోదగ్రులై రేడియో లను విధ్వంసం చేశారు. 'మణిపూర్ కీ బాత్' వినాలని వారు డిమాండ్ చేశారు. మణిపూర్ తగులబడుతుండగానే ప్రధానమం త్రి తన అమెరికా పర్యటనకు బయలుదేరిపోయారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలున్న రీత్యా మోదీకి అమెరికా మద్దతు ఎంతో అవసరం. ఎప్పటి మాదిరే ప్రవాస భారతీయులు మోదీకి ఘన స్వాగతం చెప్పేందుకు తగిన సన్నాహాలు జరిగాయి. అమెరికా విదేశాంగ ప్రయోజనాలను కాపాడడంతోపాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, సీఈవోలను ఆయన ఎంత సంతృప్తిపరు స్తారన్న అంశంపైనే ఆయన పర్యటన విజయవంతం కావడం ఆధారపడి ఉంటుంది. ఈశాన్య భారత రాష్ట్రాల గురించి సాధారణంగా జాతీయ మీడి యాలో చర్చ జరగదు. అక్కడ ప్రజల ఈతి బాధలగురించి ఎవరూ పెద్దగా ప్రస్తావించరు. ఈశాన్యాన్ని ప్రధాన స్రవంతిలోకి తెచ్చామని బీజెపి చెప్పిన కబుర్లు ఎంత బూటకమైనవో మణిపూర్ హింసాకాండను బట్టి అర్థం చేసుకోవచ్చు. మణిపూర్‌లో హింసాకాండ పెచ్చరిల్లిన తర్వాతే ఆ రాష్ట్రం గురించి దేశ వ్యాప్తంగా అందరికీ తెలిసింది. దేశంలో అన్ని సమస్యలూ మెజారిటీ వాదం ద్వారా పరిష్కారం కావు. మెజారిటీ వర్గాల రాజకీయాన్ని మణిపూర్‌లో అవలం బించాలనుకుంటే భీకర దుష్పరిణామాలు ఉంటాయి. దేశంలో వివిధ వర్గాలను రాజకీయాలకు ఉపయోగించుకున్నట్లే, కుకీలు, మెయిటీలను కూడా రాజకీయాలకు ఉపయోగించుకుని పబ్బం గడుపుకోవాలని బీజేపీ నేతలు ప్రయత్నించినందుకే ఈ సమస్య తీవ్రతరమైంది. నిజానికి ఇంతటి భీకరసమస్య వచ్చినప్పుడు ప్రతిపక్షాలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం ప్రభుత్వ కనీస బాధ్యత. కనీసం హోం శాఖకు చెందిన స్థాయీ సంఘా నికి ఈ పరిస్థితిని నివేదించాలి. కాని ప్రభుత్వానికి అలాంటి స్పృహే ఉన్నట్లు లేదు. మణిపూర్‌లో విచ్ఛిన్నకర రాజకీయాలు మానుకో వాలని, ప్రధానమంత్రి తన మౌనం వీడాలని దాదాపు 550 పౌర సమాజ బృందాలు, ప్రజా ప్రతినిధులు, రచయితలు సంయుక్త ప్రకటన చేశారు. ఆదివాసీలు తమ నివాసాలకు సురక్షితంగా తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 'బల మైన రాజకీయ మనోస్థైర్యం ఉంటే కాని మణిపూర్ సమస్యకు పరిష్కారం లభించదు. ప్రధాని మోదీయే ఈ అంశంపై మాట్లాడి పరిష్కారం సూచించాలి' అని ప్రముఖ రంగ స్థల కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత రతన్ థియామ్ అన్నారు. కేంద్ర హోం మంత్రి నియమించిన శాంతి కమిటీలో ఉండేందుకు ఆయన నిరాకరించారు. ప్రధాని మోదీ అమెరికా వెళ్లిన రోజే కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అమెరికా నుంచి దేశానికి తిరిగి వచ్చారు. మోదీ అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాతే దేశంలో అనేక రాజకీయ పరిణామాలు ఉంటాయని, కేంద్ర మంత్రి వర్గ విస్తర ణతోపాటు వివిధ రాజకీయ శక్తుల పునరేకీరణ జరుగుతుందని అంటున్నారు. అమెరికా పర్యటన ఇచ్చిన ఆత్మస్థైర్యంతో మోదీ తీసుకునే విస్తృత చర్యలే బీజేపీ రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించనున్నాయనడంలో సందేహం లేదు. మరోవైపు రాహు ల్‌గాంధీ రాకతో కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు ప్రారంభం కానున్నాయి. పలువురు నేతల చేరికతోపాటు ప్రతిపక్ష నేతల సమావేశాలు ముమ్మరం కానున్నాయి. జూన్ 23న పాట్నాలో జనతాదళ్(యు) నేత నితీశ్‌కుమార్ నేతృత్వం లో జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశం దేశంలో బలమైన ప్రతిపక్ష కూటమి ఏర్పాటు కు రంగం సిద్ధం చేయనుంది. రానున్న ఎన్నికలు దేశంలో రెండు కూటములకు జీవన్మరణ సమస్య అనడంలో సందేహం లేదు. కాని ఈ భీకర రాజకీయ పోరులో మణిపూర్ లాంటి ప్రాంతాల్లో దిక్కుతోచని అభాగ్య జీవుల గోడును వినేదెవరు? పరిష్కరించేదెవరు? ❑

# మరో వెయ్యేళ్ళకైనా చెయ్యాల్సిన యుద్ధం ఒకటే



- డా. ప్రసాదమూర్తి

**ఒక వ్యక్తి తప్ప ఎవరికీ ఏమీ కనపడకూడదు.**

**ఒక వ్యక్తి కంఠం తప్ప ఎవరికీ ఏమీ వినపడకూడదు. మోదీ భాష. మోదీ మీడియా భాష.. వేద మంత్రాల ఘోష.. దేశం ఆపాద మస్తకాన్ని ఆక్రమించాలి. ఈ వ్యూహం ఫలించింది. పాలకుల ఆశ నెరవేరింది. సామాన్యులు పిచ్చిమాలోకాలు. అన్నీ మర్చిపోవాలి. నోట్ల రద్దయినా, కరోనా కల్లోలమైనా, హిండెన్ బర్గయినా, బీబీసీ డాక్యుమెంటరీ అయినా, నిరుద్యోగమైనా, అభివృద్ధి శూన్యమైనా, విద్వేష రాజకీయాలైనా, ఏదైనా ఏదైనా ఈ ధూపదీప నైవేద్య వాద్యాల హెూరులో మర్చిపోవాలి. కేవలం ఒకే ఒక వ్యక్తి మైకంలో రెచ్చిపోవాలి.**

దేశమంతా ఒకే ఒక్క భాషా ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నట్టుంది. ఆ భాషకు లిపి లేదు. మనం ఏ భాషలో చదివితే ఆ భాషలోనే అది కనపడుతుంది. ఏ భాషలో వింటే అది ఆ భాషలోనే వినపడుతుంది. ఒక వ్యక్తి భాష దేశం భాషగా, ఒక పార్టీ భాష దేశం భాషగా, ఒక మతం భాష దేశం భాషగా తర్జుమా అవుతున్న సందర్భం గురించి మాట్లాడుతు న్నాను. దీనికి పరమోదాహరణగా నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవ సంరంభ భాషను చూపించవచ్చు. ఒక దేశంలో ఒక సమయంలో ఒకే ఘటన జరుగుతుందా? అంటే అదెలా అని మనం విస్తుపోతాం. కాని అదలాగే అని సమాధానం చెబుతుంది ఆ ప్రారంభోత్సవం. నూతన భవన ప్రారంభానికి తళతళల ధవళ వస్త్రధారి ప్రధాని మోదీ ఒకే ఒక్కడుగా నడుస్తూ వస్తుంటారు. ఆయన ముందూ వెనకా ఎవరూ ఉండరు. టీవీల్లో లైవ్ షో అక్కడ ప్రారంభమవుతుంది. కెమెరాలు అన్ని మూలల నుంచి అన్ని యాంగిల్స్‌లో ఆయనను కవర్ చేస్తుంటాయి. రాజాధిరాజ రాజమార్తాండ తేజ విచ్చేస్తున్నారహెూ అని దేశంలోని టీవీలన్నీ వందిమాగధుల్లా ఒకేసారి అనేక భాషల్లో అత్యంత ఆకర్షణీయమైన పదాల్లో వర్ణిస్తుంటాయి. భాషలు వేరైనా అందరికీ అర్థమవుతున్న భాష ఒకటే. అదే మోదీ. ఏక్ అకేలా సబ్ పర్ భారీ అని ఒక ఛానల్ ఫ్లాష్ క్యాప్షన్ ప్లే చేసింది. అలాగే సకల మీడియా సమస్త హంగులతో పొంగిపోయింది. అంటే ఒకే ఒక్కడు మోదీ అనేది దేశానికి వినిపించిన భాష. అక్కడ ప్రారంభమవుతుంది ఈ భాషా చతురత. దేశంలో అదే సమయంలో ఎన్నో జరిగాయి. అన్నీ కాదు కాని, అదే కొత్త పార్లమెంటు భవనం వైపుగా శాంతియుతంగా నడచి వచ్చి తమ ఆందోళన ఏలిన వారికి తెలియజేయాలని కొందరు యువతులు ప్రయత్నించారు. వారిని భద్రతా బలగాలు ఈడ్చి పారేశాయి. వారెవరో కాదు. రెజ్లర్లు. తమను ఒక పార్లమెంటు సభ్యుడు, భారత రెజ్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ లైంగికంగా వేధిస్తున్నాడు మహాప్రభో అని వారు గోడు గోడున విలపిస్తు న్నారు. అతని మీద చర్య తీసుకోమని వారి దీనాలాపన విజ్ఞాపన. నెల రోజుల పైగా వారు ఆందోళన చేస్తున్నారు. దేశానికి వీరి హృదయావేదన భాష వినిపించలేదు. ఆడపిల్లల్ని రెక్కలు విరిచి లాక్కుపోతున్న దృశ్యాలు కనిపించ లేదు. వేదంలా ఘోషించే ఏలిన వారి భాషా మోహ పారవశ్యంలో మునిగిపోయిన దేశానికి ఇక ఏమీ వినిపించడానికి, కనిపించడానికి వీల్లేదు. అదే మోదీ ప్లస్ మీడియా సృష్టించిన కొత్త భాష. భాషంటే భాష కాదు. కష్టాలూ కన్నీళ్ళూ లోపాలూ పాపాలూ సమస్తం మర్చిపోయి దేశమంతా ఒక్కటై ఊగిపోయే ఒక సమ్మోహ భాష. వింత వింత వినూత్న విశేషణాలు, ఉపమా రూపక విన్యాసాలు, అద్భుత సమాస సమాహారాలు, గంగా తరంగ ఉరవళ్ళ పరవళ్ళ భాష.

ప్రధాని మోదీ కొత్త భవనం వైపు సాగిన తీరు మొదలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నూతన పార్లమెంటులోకి అడుగు పెట్టి, రాజదండానికి సాష్టాంగపడి, సంత్, సాధు పుంగవుల ఆశీస్సులు పొందిన దశ తర్వాత 40 నిమిషాల పాటు ఆయన చేసిన ప్రసంగం దాకా ఆ వైభవోపేత దృశ్యాన్ని దేశమంతా తనివి తీరా తిలకించింది. ప్రధాని తన ప్రసంగమం తా నవ్య భవ్య దివ్య వంటి అద్భుత పదాడంబరంతో నింపేస్తే, మీడియా దానికి వెయ్యి రెట్లు అధికోత్సాహంతో భాషార్భాటాన్ని ప్రదర్శించింది.

ఉదాహరణకు ఒక ఛానల్ లైవ్ షోలో వేసిన హెడ్ లైన్స్ చూడండి. "న్యూ ఇండియా కీ నయా సంసద్. ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్. సంతోంకా సమాగమ్, మంత్రోచ్చార్ సే ఉద్ఘాటన్, నయా సంసద్ ఆన్ బాన్ షాన్, స్వదేశీ పహచాన్, నయా సంసద్ నయా పహచాన్.. బదల్తా హిందుస్తాన్". ఇలాంటి మాటలు కేవలం ఒక ఛానల్‌లోనే కాదు, సుమారు అన్ని భాషల్లోనూ అన్ని ఛానల్స్, పత్రికల్లోనూ కనుల వీనుల విందుగా కనిపించి వినిపించి మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి.

భాషలు వేరైనా భావం ఒకటే. అయితే ఇక్కడ ఒకే భావం అనేక భాషల్ని ఒకే భాషగా మార్చడమే అతి గొప్ప మార్మికత. 140 కోట్ల భారతీయుల ఆశలకు, కలలకు చిహ్నంగా ఈ భవనాన్ని అభివర్ణించిన భాష. దేశం మరో పాతికేళ్ళలో వంద వసంతాల స్వాతంత్ర్య మహోత్సవాన్ని జరుపుకుంటుంది. ఈ కొత్త పార్లమెంటు భవనం దేశాన్ని మరో పాతిక సంవత్సరాలు నూత్న పథంలో నడుపుతుందని, అప్పటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని భరోసా ఇచ్చిన భాష. వీనుల విందుగా ఉన్నాయి ఈ మాటలు. పార్లమెంటు భవనాన్ని ప్రజా తంత్ర దేవాలయంగా కీర్తించిన భాష. ప్రపంచానికి భారతదేశ నిబద్ధతను ఈ భవనం తెలియజేస్తుందని వక్కాణించిన భాష. ఆత్మనిర్భర భారత ఆవిర్భావానికి ఈ భవనం సాక్షీభూతం అని కాలరెగరేసిన భాష. ఇది ప్రాచీనత ఆధునికతల మేలు కలయిక అని భళి భళీ అనిపించుకున్న భాష. ఇలా మోదీ ప్రసంగం నిండా అమోఘమైన పద చాతుర్యం మనల్ని సమ్మోహితుల్ని చేస్తుంది. స్వాతంత్ర్యం రావడానికి ఇంకా పాతికేళ్ళున్నప్పటి స్థితి ని రానున్న పాతికేళ్ళతో పోల్చడం మోదీ ప్రతిభాపాటవాలకు తార్కాణం అని చెప్పాలి. సరే ఆ పాతికా ఈ పాతికా తీసేస్తే మధ్యలో 75 ఏళ్లూ వృథా కాలమేనా? వజ్రోత్సవాలూ స్వర్ణోత్స వాలూ పక్కన పెడితే మోడీ పరిపాలించిన తొమ్మిదేళ్ళ కాలం సంగతేంటి? దాని ప్రస్తావన ఎక్కడ? అది కూడా అకాలమేనా?

భాష మనల్ని మాయ చేస్తుంది. భాష మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. ఉద్వేగపరుస్తుంది. ఉత్సాహానికి, ఉన్మత్త స్థితికి కూడా చేరుస్తుంది. పూర్వం రాజులు కవుల్ని యుద్ధ క్షేత్రాలకు తీసకువెళ్ళేవారు. సైనికుల రక్తంలో వారి పద విన్యాసాలు కదం తొక్కేవి. కదన రంగంలో విజయమో వీర మరణమో వారికెలా గూ రాసిపెట్టే వుంటుంది. ఒక దేశాన్నో, లేదా అనేక దేశాలనో తన గుప్పిట బంధించాలనుకునే రాజ్య మోహితులు అలాగే అద్భుతమైన భాషా నైపుణ్యాన్ని ప్రదర్శించేవారని చరిత్ర చెప్తోంది. సాగించిన పరిపాలనలో సాధించిన ప్రగతిని మచ్చుకైనా చెప్పకుండా వాడిన పదాలనే వాడుతూ ప్రధాని చేసిన చమత్కారం అనన్యసామాన్యం. మనం ఎంతో గొప్ప ప్రజాస్వామ్యంలో ఉన్నామని, రానున్నదంతా స్వర్ణయుగమే అని, మరో పాతికేళ్ళు మోదీ చేతుల్లో దేశాన్ని పెట్టి, మనం ముఖాల మీద అతి శీతల వస్త్రాన్ని కప్పుకుని పడుకోవచ్చని ఆయన మాటలు మనకు భరోసా ఇస్తున్నాయి.

పోతే రాజుల యుద్ధాలలో కవుల పాత్ర ఇప్పుడు మీడియా పోషించిందని మనకు అర్థమైపోయింది. ఏ ఛానల్, ఏ పత్రిక ఏ భాషను వాడిందో కొంచెం తీరుబడిగా పరిశీలించి తొనలు తొన లుగా తీస్తే పూసలు పూసలుగా అసలు విషయం అర్థమవుతుం ది. ఒకే ఒక్కడు మోదీ, మిగిలిందంతా అంధకారమే అన్నట్టు సాగుతుంది ఆ వర్ణనామయ వైభోగం. జర్నలిస్టులూ కవులూ కలగలిసిన యుగళ సాహితీ సౌందర్యం ఇక్కడే చూస్తాం. విశ్లేషణలు, చర్చలు, చర్చల్లో సాధువులు స్వామీజీల సమ్మేళనాలు, వార్తల్లో వందిమాగధ పాత్రోచితాడంబరాలు అన్నీ ఒకే వ్యక్తి చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఎవరికైనా అనుమానం రావచ్చు. ఇది ప్రజాస్వామ్య పట్టాభిషేకమా? మోదీ రాజ్యాభిషేక మా? పార్లమెంటు మోదీ సొంత భవనమా.. దేశ భవనమా? మరి పార్లమెంటు భవనం పాలించడానికా.. ఆర్భాటంగా ప్రారంభించడమే పాలించడం అని చెప్పడానికా ? ఇలాంటి అనుమానం వచ్చిందంటే నీ మీద పైన చెప్పిన భాషా మాయ పనిచేయనట్టే లెక్క. అది దేశద్రోహం నేరం కింద రావచ్చు.

ఒక వ్యక్తి తప్ప ఎవరికీ ఏమీ కనపడకూడదు. ఒక వ్యక్తి కంఠం తప్ప ఎవరికీ ఏమీ వినపడకూడదు. మోదీ భాష. మోదీ మీడియా భాష.. వేద మంత్రాల ఘోష.. దేశం ఆపాద మస్తకాన్ని ఆక్రమించాలి. ఈ వ్యూహం ఫలించింది. పాలకుల ఆశ నెరవేరింది. సామాన్యులు పిచ్చిమాలోకాలు. అన్నీ మర్చిపోవాలి. నోట్ల రద్దయినా, కరోనా కల్లోలమైనా, హిండెన్ బర్గయినా, బీబీసీ డాక్యుమెంటరీ అయినా, నిరుద్యోగ మైనా, అభివృద్ధి శూన్యమైనా, విద్వేషరాజకీయాలైనా, ఏదైనా ఏదైనా ఈ ధూపదీప నైవేద్య వాద్యాల హోరులో మర్చిపోవాలి. కేవలం ఒకే ఒక వ్యక్తి మైకంలో రెచ్చిపోవాలి. కానీ ఎంత మర్చిపోవాల నుకున్నా ఆందోళన చేస్తున్న రెజ్లర్ అమ్మాయిలే గుర్తు కొస్తున్నారు. ఆ ఘటన వెంటాడుతూనే వుంది. ప్రజాస్వామ్య దేవాలయంగా పార్లమెంటును ప్రధాని తన వాక్ప టిమతో కొనియాడుతున్న తరుణంలోనే దేశ రాజధాని నడిబొడ్డున రెజ్లర్ల మీద సాగిన దమన కాండను ఏ రాజదండం బోధించిన రాజనీతిగా భావించాలి? ఆ పిల్లల కన్నీటి కంఠశోష అధినాయకుల భాషాపటాటోపార్ణవ ఘోషలో కలిసిపోయింది. ప్రపంచ పోటీల్లో పతకాలు సాధించి దేశానికి గర్వకారణమైన మహిళా మల్లయోధులు న్యాయం కోసం ప్రజాస్వామ్య పరిరక్షకు లమని చెప్పుకునే వారితోనే కుస్తీ పట్టాల్సిన విషాదం ఇది.

మిత్రులారా.. దేశం ఎలాంటి భాషా మాయలో పడిపోతోందో తెలుస్తూనే వుంది కదా. ఇప్పుడు మేలుకొనకపోతే ఒకనాటికి అందరం ఆ భాషా భజనలో సంలీనమయ్యే ప్రమాదం లేకపో లేదు. ఇప్పుడు పార్లమెంటు భవనం. రేపు అయోధ్య రాముని సరికొత్త ఆలయం. పసిపాప నుంచి పండు ముసలి వరకూ ఒకే మంత్రం జపించే భాషా తంత్రం అమల్లో ఉంది. ఎన్నికలలో కొన్నిచోట్ల విజయాలు సాధించవచ్చు. లేదా అన్నిచోట్లా విజయం సాధించ వచ్చు. కానీ మతం పేరు మీద దేశంలో సాగే స్వార్థ రాజకీయాల మీద విజయమే చివరి విజయం. ఆ అంతిమ విజయం కోసం సాగించాల్సింది సాంస్కృతిక సమరమే. ఇప్పుడు కాకుంటే మరో వెయ్యేళ్ళకైనా చెయ్యాల్సిన యుద్ధం అదే. ❑

# ఏకరూప పౌరస్మృతిని హిందువులందరూ అంగీకరిస్తారా ?



- ఎం.కోటేశ్వరరావు

**ఏకరూప పౌరస్మృతిని బీజేపీ బలవంతంగా రుద్దాలని అనుకుంటే ప్రస్తుతం దానికి అడ్డులేదు. పార్లమెంటులో దానికి గుడ్డిగా మద్దతు ఇచ్చే పార్టీలు ఉన్నందున అదేమీ పెద్ద అంశం కాదు. దాన్ని ఒక ఎన్నికల ప్రచార అస్త్రంగా, ముస్లింల మీద విద్వేషాలు, వ్యతిరేకతను రెచ్చగొట్టి మెజారిటీ ఓటు బ్యాంకు సృష్టికి, సంతుష్టీకరణకు పూనుకుంది. దీనికి ఇస్లాం లేదా దేశంలోని ముస్లింలు వ్యతిరేకమనే ప్రచారం చేస్తున్నారు. దీనిలో వాస్తవం-వక్రీకరణ రెండూ ఉన్నాయి.**

ఏకరూప పౌర స్మృతి గురించి ఆసక్తి ఉన్న వారు నోటిఫికేషన్ జారీచేసిన జూన్ 14వ తేదీ నుంచి నెల రోజుల్లోగా తమ అభిప్రాయాలను తెలపాలంటూ 22వ లా కమిషన్ ఒక ప్రకటన చేసింది. అది లేకపోతే దేశం ఇంకేమాత్రం ముందుకు పోదు, తీవ్ర ఆటంకంగా ఉందన్నట్లు కొందరు గుండెలు బాదుకుంటు న్నారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నదే కదా, దాన్ని అమలు చేస్తామంటుంటే ఎందుకు లేనిపోని దురుద్దేశాలు అంటగడుతున్నారు అంటూ అమాయకత్వాన్ని నటిస్తున్నారు. అదే వాస్తవమైతే నరేంద్రమోడీ తొమ్మిదేళ్లుగా ఏం చేస్తున్నట్లు ? చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. మరి లా కమిషన్ సరిగ్గా ఇప్పుడే దానిని ఎందుకు ముందుకు తీసుకు వచ్చిందన్నది ప్రశ్న. దీని గురించి దాన్ని ఎవరూ సవాలు చేయటం లేదు. విభేదించడమూ లేదు. ఎన్నో తర్జనభర్జనల తరువాత మన దేశంలోని సంక్లిష్ట పరిస్థితుల కారణంగా ఏకాభిప్రాయ సాధనతో సాధించాల్సిన అంశంగా పరిగణించి అర్టికల్ 44లో ఇతర ఆదేశిక సూత్రాలలో దాన్ని చేర్చారు. వాటిని కోర్టులు అమలు జరపలేవని రాజ్యాంగంలో ఉంది. వాటిలో పని హక్కు, నిరుద్యోగ భృతి వంటి వివాదం లేని వాటిని అమలు జరపడం మీద శ్రద్ధ లేని బీజేపీ వివాదాస్పద ఏకరూప పౌరస్మృతి మీద కేంద్రీకరిస్తున్నది. మతోన్మాదాన్ని, విద్వేషాన్ని రెచ్చగొట్టే మెజారిటీ-మైనారిటీ మతశక్తులు రెచ్చి పోతున్న తరుణంలో అనేక అపోహలు ఉన్న ఈ అంశం ఇప్పుడు తక్షణ అవసరం అంటూ బీజేపీ ముందుకు తెస్తున్నది. మహిళల ఉద్ధరణ అని చెబుతున్నది. నిజానికి దానికి అంత శ్రద్ధ ఉంటే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ ఎందుకు కల్పించలేదు ? ఒక ముసాయిదాను రూపొందించి జనం ముందు ఎందుకు పెట్టలేదు ? త్వరలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, తరువాత లోక్‌సభ ఎన్నికలు జరగనున్న తరుణంలో 22వ లా కమిషన్ ద్వారా ఒక ప్రచార అస్త్రంగా తన అజెండా ను ముందుకు తెచ్చింది.

ఏకరూప పౌరస్మృతి ఈ దశలో అవసరమూ కాదు, వాంఛనీ యమూ కాదని 2018 ఆగస్టులో 21వ లా కమిషన్ విడుదల చేసిన సంప్రదింపుల పత్రంలో స్పష్టంగా పేర్కొన్నది. ఆ పత్రం విడుదల చేసి మూడేళ్లు దాటినందున నాటి నోటిఫికేషన్ గడువు ముగిసిందని, వివిధ కోర్టుల ఉత్తర్వులు దీని మీద ఉన్నందున ఈ అంశం మీద కొత్తగా అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నది. అభిప్రాయాలు తప్ప కోర్టు ఉత్తర్వులు ఏమీ లేవు. తాజా సేకరణతో ఏం చేస్తారో చెప్పలేదు. గత కమిషన్ 2016 జూన్ 17న నోటిఫికేషన్ ద్వారా అభిప్రాయాలను సేకరించింది. వాటిని క్రోడీకరించి కుటుంబ చట్ట సంస్కరణల పేరుతో 185 పేజీల పత్రాన్ని విడుదలచేసింది. ఏకరూప దేశం అంటే సమ రూపత ఉండనవసరం లేదు. మానవ హక్కుల అంశంలో ప్రపంచమంతటా ఉన్న వివాదాలు లేని తర్కాలతో మన భిన్న త్వాన్ని సమ్మతింప చేసేందుకు ప్రయత్నాలు చేయాల్సి ఉందని ఆ పత్రం పేర్కొన్నది. వివిధ మతాలకు సంబంధించి పర్సనల్ చట్టాల్లో ఉన్న వివక్ష, అసమానతలను ఎదుర్కొనేందుకు ఇప్పు డున్న కుటుంబ చట్టాలను అవసరమైన మేరకు క్రోడీకరించి, సవరించవచ్చని పేర్కొన్నది. సుప్రీంకోర్టు తన ముందుకు వచ్చిన వివిధ కేసుల విచారణ సందర్భంగా ఏకరూప పౌర స్మృతి అవసరమని అభిప్రాయపడింది. తాజాగా మార్చి 23న వివిధ పిటీషన్ల మీద తీర్పు చెబుతూ ఇలాంటి పిటీషన్లను ఆమోదించి, విచారించటం అంటే అలాంటి చట్టాన్ని తీసుకురావాలని పార్ల మెంటును ఆదేశించటమేనని, తాము ఆ పని చేయకూడదని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాస నం స్పష్టం చేసింది. దీని గురించి తాజాగా ఆలోచించాలని, ఏ చర్యలు తీసుకున్నది కోర్టుకు తెలపాలని ప్రభుత్వాన్ని కోరింది. 2022 అక్టోబరులో సుప్రీంకోర్టులో దాఖలైన పిటీషన్లపై ప్రభుత్వం స్పందిస్తూ మత ప్రాతిపదికన ఉన్న వ్యక్తిగత చట్టాలు దేశ ఐక్యతకు భంగం కలిగిస్తున్నట్లు, ఏకరూప పౌర స్మృతిని తీసుకు వస్తామని పేర్కొన్నది.

దేశ ఐక్యతకు, సామాజిక సమతుల్యతకు ముప్పు తెస్తున్న అంశాలలో విద్వేష పూరిత ప్రసంగాలు, ఇతర వివాదాస్పద అంశాలు, చట్టాన్ని కొందరు చేతుల్లోకి తీసుకోవటం, వ్యవస్థల దుర్వినియోగం వంటివి నేడు ప్రధానంగా ముందుకు వచ్చాయి. అలాంటి వారి మీద ఫిర్యాదు లేకున్నా కేసులు నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఒకటికి రెండుసార్లు చెప్పాల్సి వచ్చింది. దీన్ని మరో విధంగా చెప్పాలంటే అలాంటి ప్రసంగాలు చేసిన వారి మీద కేసు నమోదు చేసిన వారికి భద్రత లేదన్నది స్పష్టం. ఆదేశిక సూత్రాల్లోని పని, విద్య, నిరుద్యోగ భృతి వంటి హక్కులను అమల్లోకి తెస్తే కరోనాలో వలస కార్మికులు దిక్కులేని చావులకు, ఇబ్బందులకు గురయ్యేవారు కాదు. వలస కూలీలు తమ ఉపాధిని దెబ్బ తీస్తున్నారని స్థానికులు దాడులకు దిగేవారూ కాదు. రిజర్వేషన్ల కోసం తన్నుకు చచ్చేవారూ కాదు. తాజాగా మణిపూర్ మంటలూ ఉండేవి కాదు, ప్రధాని మోడీ కనిపించటం లేదనే పోస్టర్లూ వెలువడేవి కాదు.

ఏకరూప పౌర స్మృతి అంటే ఎలా ఉంటుందో కేంద్ర ప్రభుత్వం ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించి ఎలాంటి మార్పులు చేసేదీ జనంలో చర్చకు పెడితే దాని గురించి ఉన్న అనేక అపోహలు తొలుగుతాయి. ఏమైనా సరే వెంటనే అమలు జరపాలని కోరుతున్న మోడీ సర్కార్ తొమ్మిదేళ్లుగా అలాంటిదేమీ తీసుకురాలేదు. రూపు రేఖలు లేని ఒక ప్రతిపాదన మీద అభిప్రాయాలు చెప్పమంటే ఏమి చెబుతారు ? గతంలో చెప్పిన అభిప్రాయాలకు కాలదోషం పట్టిందని వర్తమాన లా కమిషన్ ఏ ప్రాతిపదికన నిర్ధారించింది. అసలది ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంస్థ తప్ప రాజ్యాంగబద్దమైనది కాదు. ప్రభుత్వం దాని ద్వారా అభిప్రాయసేకరణ జరపమని కోరింది గాని రాజ్యాంగ ఆదేశం లేదు. ఏకరూప పౌర స్మృతిని ముస్లింలు లేదా ఏ మతం వారైనా ఎలాంటి హేతుబద్దత లేకుండా గుడ్డిగా తిరస్కరించనవసరం లేదు. భిన్న అభిప్రాయం వెల్లడించవచ్చు. ముసాయిదాను ముందు పెడితే వివరణలు కోరవచ్చు.

ఆదేశిక సూత్రాల్లో అనేక అంశాలు ఉన్నప్పటికీ మిగతా వాటిని అమలు జరపకుండా ఏకరూప పౌర స్మృతి మీద బీజేపీ కేంద్రీకరణ అన్నది ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నారని ఆ మతానికి చెందిన వారితోపాటు ఇతర మతాల వారే కాదు.. మతం, కుల పట్టింపులు లేని వారూ బలంగా నమ్ముతున్నారు. దాన్ని ఏకాభిప్రాయంతో సాధించాల్సి ఉందని అంబేద్కర్‌తో సహా మెజారిటీ భావించిన కారణంగానే ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు పదేళ్లు చాలని నాడు భావించారు. ఆ లక్ష్యం నెరవేరలేదు గనుక పొడిగిస్తూ వస్తున్నారు. తరువాత ఓబీసీలకూ వర్తింపజేశారు. పౌర స్మృతి మీద ఇప్పటికీ ఏకాభిప్రాయ పరిస్థితి ఉందా అంటే లేదు. అసలు హిందువులందరూ దానితో ఏకీభవిస్తారా అన్నది ప్రశ్న. కర్ణాటకలో ఎక్కువగా వున్న లింగాయత్‌లు తమను ప్రత్యేక మతానికి చెందిన వారిగా పరిగణించాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. శైవులు, వైష్ణవులు వారిలో కులాల వారీ భిన్న ఆచారాలు, ఇలా ఎన్నో విభిన్నతలు ఉన్నాయి. వాటన్నింటిలో బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వం వేలు పెట్టాలని, ఫలానా పద్ధతి పాటించాలని ఆదేశించాలని చూస్తున్నదా ? అందుకే ముసాయిదా చట్టాన్ని ముందుపెడితే ఇలాంటి అనుమానాలకు తెరపడుతుంది లేదా కొత్త అంశాలు ముందుకు రావచ్చు.

**ఆర్టికల్ 370ని రద్దు చేస్తే అదేదో ముస్లింలకు సంబంధించిందని అనేకమంది భావించి మద్దతు ఇచ్చారు. రాముడి గుడి కడతామంటే సరే అన్నారు. వ్యక్తిగత అంశాల్లో తమ దాకా వస్తే అలాగే ఉంటారా ? ఒక కులానికి చెందిన వారు మరో కులం, మతానికి చెందిన వారిని వివాహం చేసుకోకూడదని తీర్మానాలు చేస్తున్న పంచాయత్‌లు సాగుతూనే ఉన్నాయి. ఎవరికి వారు తమ కులాన్ని, మతాన్ని పవిత్రంగా మార్చాలని చూస్తున్నారు. అలాంటి స్థితిలో అందరూ సమానమే, ఒకటే అనే భావనను అంగీకరిస్తాయా ?**

గోవాలో ఏకరూప పౌరస్మృతి అమలు జరుపుతున్నపుడు ఇతరచోట్ల ఎందుకు అమలు జరపకూడదని కొందరు వాదిస్తున్నారు. పోర్చుగీసు పాలనలో ఉన్న గోవా 1961లో దేశంలో విలీనమైంది. అప్పటి వరకు అక్కడ అమల్లో ఉన్న పౌర స్మృతిని మార్చి కొత్త విధానాన్ని వర్తింపచేయాల్సిన అగత్యం తలెత్తలేదు. దాన్నే వర్తింపచేసేందుకు నాడు కేంద్రం అంగీకరిం చింది. దీనిని ఎవరూ అభ్యంతర పెట్టలేదు. అలాంటి చట్టాన్ని మిగతా దేశంలో అమలు జరపవద్దని ఎవరూ అనటం లేదు. బలవంతంగా రుద్దటం గాక అనుమానాలను తీర్చి అమలు జరపాలని చెబుతున్నారు. అందుకు అనువైన వాతావరణం లేదు గనుక తొందరపడవద్దంటున్నారు. మిగిలిన ఆదేశిక సూత్రాలు అమలు జరిపిన తరువాత దీన్ని కూడా చేపట్టవచ్చు.

గోవాలో ఉన్న చట్టం ప్రకారం వివాహమైన వెంటనే ఏ మతం వారికైనా భర్త ఆస్తిలో భార్యకు సగం వాటా మీద హక్కు దఖలు పడుతుంది. దేశంలో దాన్ని అమలు చేస్తే ఇప్పుడున్న హిందూ అవిభక్త కుటుంబం, దానితోపాటే ఆ పేరుతో పొందుతున్న పన్ను రాయితీ రద్దవుతుంది. దీన్ని దేశంలోని

హిందువులందరూ సమ్మతిస్తారా ? ఉత్తరాదిన సప్తపది హోమం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేస్తేనే వివాహం జరిగినట్లు, దక్షిణాదిన అదే హిందువుల్లో ఎవరైనా పాటించవచ్చు తప్ప.. విధి కాదు, లేదు. ఇలాంటి అనేక తేడాలు ఉన్నప్పుడు ఏక రూప చట్టం ఎలా ఉంటుందో ఎవరిని ఎలా ప్రభావితం చేస్తుందో, ఎలా స్పందిస్తారో తెలియదు.

పంజాబ్‌లో వారసత్వ హక్కులు హిందువులకు ఒక విధంగా, సిక్కులకు మరొక విధంగా ఉన్నాయి. ముస్లిం పర్సనల్ లా ప్రకారం ఆ మతానికి చెందిన పురుషులు నలుగురిని వివాహం చేసుకోవచ్చు. అయితే ఆ మేరకు వివాహాలు చేసుకుంటూ హిందువులు మెజారిటీగా ఉన్న దేశాన్ని ముస్లిం మెజారిటీగా మార్చేందుకు కుట్ర పన్నుతున్నారంటూ కాషాయదళాలు నిరంతరం చేస్తున్న గోబెల్స్ ప్రచారం తెలిసిందే.

నిషేధం ఉన్నప్పటికీ ముస్లింలలోకంటే హిందువులు, ఇతరుల్లోనే ఎక్కువగా బహుభార్యాత్వం ఉందని గతంలో జరిపిన విశ్లేషణల్లో తేలింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2005-06 ప్రకారం హిందువుల్లో 1.9, ముస్లింలలో 2.9, ఇతరుల్లో 2.9 శాతం ఒకరికంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉన్నారు. 2019-20 సర్వే ప్రకారం 1.3, 1.9, 1.6 శాతాలకు తగ్గారు. తగ్గుదల అందరిలోనూ ఉంది. అందువల్ల ముస్లింలు పనిగట్టుకొని ఎక్కువ మందిని వివాహమాడి పిల్లలను కని దేశాన్ని ఆక్రమిస్తున్నారనే ప్రచారం వాస్తవం కాదు. విద్య లేని వారు, పేదలు, చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకున్న వారిలో ఈ దురాచారం ఎక్కువగా ఉన్నట్లు అధికారిక సర్వే వెల్లడించింది. కులాల వారీ చూసినపుడు తాజా సర్వే ప్రకారం గిరిజనుల్లో 2.4, ఎస్‌సి 1.5, ఓబీసీ 1.3, ఇతరుల్లో 1.2శాతం చొప్పున, మతాల వారీ హిందూ 1.3, ముస్లిం 1.9, క్రైస్తవులు 2.1, బౌద్ధులు 1.3, సిక్కులు 0.5, ఇతరులు 2.5 శాతం మంది ఉన్నారు. ముస్లింలకు మినహా ఇతరుల్లో ఒకరికంటే ఎక్కువ మందిని కలిగి ఉండటం నిషేధం. దేశంలో జరిపిన నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం ఓబీసీలు 40.94, దళితులు 19.59, గిరిజనులు 8.63 శాతం ఉన్నారు. వీరిలో అనేక కులాలు, ఉపకులాలు ఆచారాలు, సంప్రదాయాలన్నీ ఒకటే కాదు. వీరందరూ హిందువులే. ఎంతో భిన్నత్వం కలిగిన వారందరికీ ఒకే పౌరస్మృతిని అమలు జరిపే ముందు వీరిలో ఉన్న అనుమానాలను తొలగించాలా ? లేదా ? దానికి మార్గం నమూనా చట్టం జనం ముందు పెట్టటమే.

ప్రస్తుతం వివిధ మతాల వ్యక్తిగత చట్టాల ప్రకారం ఒకే అంశంపై ఏకీభావం లేదు. ఎవరి భాష్యాలు వారు చెబుతున్నారు. జనంలో అనేక అనుమానాలు, గందరగోళం ఉంది. ఏకరూప పౌరస్మృతిని బీజేపీ బలవంతంగా రుద్దాలనుకుంటే ప్రస్తుతం దానికి అడ్డులేదు. పార్లమెంటులో దానికి గుడ్డిగా మద్దతు ఇచ్చే పార్టీలు ఉన్నందున అదేమీ పెద్ద అంశం కాదు. దాన్ని ఒక ఎన్నికల ప్రచార అస్త్రంగా, ముస్లింల మీద విద్వేషాలు, వ్యతిరేకతను రెచ్చగొట్టి మెజారిటీ ఓటు బ్యాంకు సృష్టికి, సంతుష్టీకరణకు పూనుకుంది. దీనికి ఇస్లాం లేదా దేశంలోని ముస్లింలు వ్యతిరేకమనే ప్రచారం చేస్తున్నారు. దీనిలో వాస్తవం-వక్రీకరణ రెండూ ఉన్నాయి. ముస్లిం మతశక్తులు గుడ్డిగా సంస్క రణలను వ్యతిరేకిస్తున్నాయి తప్ప సామాన్య ముస్లింలందరూ అలా లేరు. హిందూత్వ పేరుతో వీరంగం వేస్తున్న వారు ముస్లిం లపై గుడ్డి ద్వేషాన్ని వెళ్లగక్కుతుంటే మొత్తం హిందువులందరూ అలాలేరు. ఏ మతమైనా వర్తమానానికి అనుగుణంగా మారక పోతే మౌఢ్యం పెరుగుతుంది. ఉన్న మతాల్లో హిందూ అని చెబుతున్న అనేక సౌమ్యాలున్న శైవ, వైష్ణవ ఇతర వివిధ మతాలు వేల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నందున అనేక సంస్కరణలు చోటు చేసుకున్నాయి. లేకపోతే జనం మతాలను పక్కన పెట్టేస్తారు. అమెరికా వెళ్లి హిందూమత గొప్పతనం గురించి ప్రసంగించిన స్వామి వివేకానందుడి గురించి గొప్పగా చెబుతారు. సముద్రయానం చేశాడనే కారణంగా తిరిగి వచ్చిన తరువాత అదే హిందూమతం వివేకానందకు దేవాలయ ప్రవేశాన్ని అడ్డుకుంది. ఇటీవలి కాలంలో ఆ మూఢనమ్మకాన్ని సవరించుకొని పరిహారంగా కొన్ని క్రతువులు చేస్తే చాలని సరిపుచ్చుతున్నారు. ఎందుకంటే అనేకమంది స్వామీజీలు విదేశాల సందర్శన సరదాను అణుచుకోలేకపోయారు. మడిని గట్టున పెట్టి వెళ్లారు. సముద్రం దాటిన వారు కులాన్ని కోల్పోతారని శాస్త్రాల్లో రాసి ఉంది మరి. ఎవరైనా కులం పోగొట్టుకున్నవారు ఉన్నారా ? లేకపోగా విదేశాల్లోనూ కుల గజ్జిని వ్యాపింపజేస్తున్నారు.

దేశ పరువును గంగలో కలుపుతున్నారు. ఉన్న మతాలలో తాజాది ఇస్లాం గనుక ఆ మతం మీద ముల్లా 'అగ్రహారికుల' ప్రభావం ఎక్కువగా ఉంది. వివాహం, విడాకులు, ఆస్తి హక్కులు, సంరక్షణ, దత్తత వంటి అంశాలు ఎంతో సున్నితమైనవి గనుక వాటిని సమానత్వ ప్రాతిపదికన, లింగవివక్ష లేకుండా ఎలా చట్టాన్ని రూపొందించాలన్నది పెద్ద ఎత్తున చర్చ జరగాలి. అన్ని మతాలూ మహిళను చిన్నచూపు చూసేవే, అణచేందుకు చూసేవే. అందువల్ల వారికి అనుకూలమైన ఏ చట్టం రూపొందాలన్నా చట్టసభల్లో వారికి హక్కుగా ప్రవేశించే హక్కు కల్పించటం ముందుగా జరగాలి. అప్పుడే పితృస్వామిక సమాజ పెత్తనాన్ని చట్టబద్ధంగా అడ్డుగోగలరు. అనుమానాలను తొలగిస్తూ, విశ్వాసాన్ని పాదుకొల్పుతూ తేవాల్సిన ఏకరూప పౌరస్మృతిని బీజేపీ కోరుకుంటున్నట్లుగా ఏకపక్షంగా రుద్దకూడదు. ❑

# సింగోల్ : రాజ్యాంగం మీద సర్జికల్ స్ట్రైక్!



- దేవరాజు మహారాజు

**అన్ని విషయాలలో వివాదాస్పదమవుతున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ విషయం లోనూ విమర్శలకు గురైంది. ముఖ్యమైన ప్రతిపక్ష పార్టీలన్నీ ఆ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. పరువు కాపాడుకునే ప్రయత్నంలో కేంద్ర హెూం మంత్రి విలేకరులకు సింగోల్ విషయం వెల్లడించారు. ఎవరికీ తెలియని ఒక అప్రధానమైన సింగోల్‌ను ఎందుకు తెరమీదికి తెచ్చారంటే నూతన పార్లమెంటు ప్రారంభోత్సవ వివాదాన్ని కప్పిపుచ్చుకోవడానికి!**

**నూ**తన పార్లమెంటు భవనానికి ప్రధాని శంఖుస్థాపన చేసినప్పుడే దేశం భగ్గుమంది. అశోక చక్రంపై నిర్మించిన కొత్త సింహాలు రౌద్రంగా ఉన్నాయన్న విమర్శలొచ్చాయి. ఇప్పుడు మళ్ళీ ఆ భవన ప్రారంభోత్సవం కూడా ఆయనే చేయడం వల్ల విపక్షాలే కాదు, దేశ ప్రజలు సైతం కినుక వహించారు. ఎందుకంటే పార్లమెంటు వ్యవస్థలో మొదటిస్థానం దేశాధ్యక్షులది. తర్వాత రాజ్యసభది. ఆ తర్వాత లోక్‌సభది. ఆ వరుసక్రమంలో లోక్‌సభ నాయకుడిగా ప్రధానిది మూడోస్థానం. మొదటి వారిని వదిలేసి, మూడోస్థానంలో ఉన్నవారు ప్రారంభించడం ఏమిటని విపక్షాలు నిరసన తెలియజేశాయి. మొత్తానికి మొత్తంగా కార్యక్రమాన్నే బహిష్కరించాయి. దేశాధ్యక్షులంటే సుప్రీం కమాండర్ ఆఫ్ ద ఆర్మ్‌డ్ ఫోర్సెస్ – సైన్యాధినేత ఎవరో వారే దేశాధినేత అవుతారు. పార్లమెంటులో ఉభయ సభల్ని ఉద్దేశించి ప్రసంగించేది కూడా దేశాధ్యక్షులే. ఇక్కడ లింగభేదం ఉండదు. అధ్యక్ష స్థానంలో ఉన్నది గిరిజన మహిళనా? భర్త లేని మహిళనా అని చూడగూడదు. మత మౌఢ్య వ్యవస్థలో మాత్రమే అధ్యక్షుల వారిది ఏ కులం? ఏ మతం ? భర్త లేదా భార్య జీవించి ఉన్నారా లేదా – అనేవి చూసుకుంటారేమో గానీ, ప్రజాస్వామ్య వ్యవస్థలో వాటిని పక్కన పెట్టాల్సిందే! భారత రాజ్యాంగ స్థానంలో మనువాదాన్ని ప్రతిష్టిం చాలని కలలు కంటున్న ఆర్‌ఎస్ఎస్–బీజేపీ వారి విధానాలు ఈ విధంగా అస్తవ్యస్తంగానే ఉంటాయి. మనువాదులు ఏర్పరిచిన నిచ్చెనమెట్ల కుల సంస్కృతి



ప్రకారం ప్రస్తుత ప్రధాని అగ్రవర్ణం వాడు కాదు. పూజలకు అతను ఎలా పనికొచ్చాడూ? పైగా హిందూ ధర్మం ప్రకారం ఏ పూజలైనా సతీసమేతంగా చేయాలి. మరి ఈ ప్రధాని అలా చేయలేదు కదా? వారి ధర్మం ప్రకారం ఒంటిగా చేసిన పూజలు, సాష్టాంగ ప్రమాణాలు అన్నీ మంచి ఫలితాలనిస్తాయా? ఇవి సామాన్యుల అనుమానాలు. మనది ప్రజాస్వామ్య దేశం గనుక, అన్ని మతాలకూ సమాన మైన విలువనివ్వాలి. అలాంటప్పుడు ఏ ఒక్క మతానుసారం హెూమాలు, పూజలు ఎలా నిర్వహిస్తారు ? ఛార్టెడ్ ఫ్లేన్ పంపి తమిళనాడులోని ఆధీనం మతానికి చెందిన సాధువులను ఢిల్లీకి పిలిపించుకున్నారు కదా ? మరి ఇతర మతాల ప్రతినిధుల్ని నామమాత్రంగానైనా పిలవలేదే ? అసలైతే ప్రజాస్వామ్య వ్యవస్థలో మతాలను మత సంబంధమైన పూజా కార్యక్రమాల్ని పక్కన పెట్టి, వాటికి అతీతంగా వ్యవహరించాలి. కేంద్ర ప్రభు త్వం ఆ విషయాన్ని అతిక్రమించింది.

సింగోల్ అంటే రాజదండం అనీ, అది తన చేతికి వచ్చింది గనుక, తనకు పట్టాభిషేకం జరిగిందనీ ఇక అధికారమంతా తనదే అని ప్రధాని భావిస్తూ ఉండొచ్చు. ఒకప్పుడు నెహ్రూ చేతిలో ఉన్న రాజదండం ఈ రోజు తన చేతిలో కొచ్చిందని సంబరపడుతూ ఉండొచ్చు. అసలు విషయ మేమంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజదండానికి గానీ, రాచరికానికి గాని ఎలాంటి విలువా లేదు, ఉండదు! చాలా శ్రద్ధగా గమనించాల్సిన విషయం ఒకటుంది. అలహాబాదు మ్యూజియంలో అప్పుడు పనిచేసిన క్యురేటర్ ఓంకార్ ఆనందరావు వాంఖ్‌డే చెప్పిన దాని ప్రకారం అది 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు బహుమతిగా వచ్చిన ఒక బంగారు చేతికర్ర' మాత్రమే. నెహ్రూ తన వస్తువుల్ని మ్యూజి యంకు బహూకరించినప్పటి నుండి అంటే 1952 నుండి అది అక్కడే అలహాబాదు మ్యూజియంలో ఉంది. ఇప్పుడు అక్కడ ఉన్నది ఆధీనం మతం వారిచ్చిన సింగోల్‌కు ప్రతిరూపం. ఒరిజనల్ సింగోల్, ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో ఉంది. నెహ్రూజీ దాన్ని తన స్వంత ఆస్తిగా దాచుకున్నాడని అధికార పార్టీ వారు చెప్పడం అబద్ధం. ఎందుకంటే ఆ ఒరిజినల్ సింగోల్‌నే ఢిల్లీ నేషనల్ మ్యూజియం నుండి తెప్పించి మోడీ గారు పూజలు చేసి కొత్త పార్లమెంట్‌లో ప్రతిష్టించారు. ఏది ఏమైనా ప్రొఫెసర్ మాధవన్ కె.పలట్ చెప్పిన విషయం ఈ దేశ ప్రజలు నమ్మితీరాలి. ఆయన చరిత్ర పరిశోధకుడు మాత్రమే కాక, ఎన్నిక చేసిన నెహ్రూ రచనలకు (సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జవహర్‌లాల్ నెహ్రూ) సంపాదకుడు. అంతే కాదు, నెహ్రూ మెమోరియల్ ఫండ్‌కు ట్రస్టీ కూడా! 'సింగోల్ మౌంట్‌బాటన్‌కు అందించి, మళ్ళీ తీసుకొచ్చి నెహ్రూకు ఇచ్చారనడం శుద్ధ అబ ద్ధం! అందుకు ఏ ఆధారమూ లేదు' అని ప్రొఫెసర్ మాధవన్ కె.పలట్ కొట్టిపడేశారు. ఇవన్నీ కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ అల్లిన తప్పుడు కథలని ఆయన కరన్ థావర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తేల్చిచెప్పారు. అలహాబాదులోని ఆనంద నిలయం నెహ్రూ కుటుంబీకుల స్వంత ఆస్తి. కాలక్రమంలో అది మ్యూజి యం అయ్యింది. నెహ్రూ వస్తువులు, వచ్చిన బహుమతులు అన్నీ అందులో భద్రపరిచారు. ఇందిరాగాంధీ వచ్చాక ఆనంద నిలయాన్ని జాతికి అంకితం చేశారు. అప్పటి నుండి అది పబ్లిక్ ప్రాపర్టీ అయ్యింది. నేటి ప్రభుత్వ పెద్దలు నెహ్రూ విలువను తగ్గించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నట్టే ఈ విషయంలో కూడా చేశారు. నెహ్రూ కావాలని తన ఆధీనంలో ఉంచుకున్నాడనీ, తన చేతికర్ర అని చెప్పుకున్నాడనీ అభాండాలు వేస్తున్నారు. అధికార మార్పిడికి చిహ్నంగా సింగోల్‌ను నెహ్రూ స్వీకరించలేదు. అధికార మార్పిడి అంటే బ్రిటిష్ రాజు ఛార్లెస్–6 నుండి నాటి తొలి భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మధ్య జరగాలి. కానీ జరగలేదు. ప్రజాస్వామ్యంలో దేశాధ్యక్షుడే దేశానికి అధిపతి. ప్రధాని కాదు. అది నెహ్రూ సమయంలోనైనా లేక ఇప్పుడు మోడీ సమయంలోనైనా పద్ధతి పద్ధతే. అలా జర గనప్పుడు దానికి ఏ విలువా ఉండదు. కాంగ్రెస్ నుంచి తాము అధికారం హస్తగతం చేసుకున్నామని ఆర్ఎస్ఎస్ – బీజేపీలు సంబరాలు చేసుకుంటే చేసుకోవచ్చు. నూతన పార్లమెంట్ భవనంలో హెూమాలు, పూజలు, సాష్టాంగ ప్రమాణాలూ చేసి మనువాదం పట్ల తమ భక్తి ప్రపత్తులు చాటుకుంటే చాటుకోవ చ్చు. అవన్నీ ఈ దేశ ప్రజల దృష్టిలో అప్రజాస్వామికమైనవి. రాజ్యాంగానికి విరుద్ధంగా ఒక మతానికి సంబంధించిన కార్య క్రమాలు జరిపించడం అసలు ఎవరూ హర్షించరు. తిరువడు తిరై అధీనం మఠం వారు 14 ఆగస్టు 1947న నెహ్రూజీకి సింగోల్ బహుకరించినప్పుడు ఇందిరా గాంధీ, పద్మజానాయుడు ఇద్దరూ అక్కడే ఉన్నారు. ఒకవేళ అది అధికార మార్పిడికి చిహ్నం – అని అనుకుని ఉంటే, వారు ఎన్నోచోట్ల, ఎన్నోసార్లు దాని గురించి మాట్లాడేవారు, రాసే వారు. వారు ఆ పని చేయ లేదు. చరిత్రకారులెవరూ ఆ సంఘట నకు ప్రాధాన్యమివ్వలేదు. అదీగాక సి.రాజగోపాలాచారి(రాజాజీ) మనుమడు రాజమోహన్ గాంధీ ఎప్పుడూ ఎక్కడా సింగోల్ గురించి రాయలేదు. ఎందుకంటే ఆయన రాజాజీ మనుమడు మాత్రమే కాదు. ప్రసిద్ధ చరిత్రకారుడు. అంత ప్రాముఖ్యమున్న విషయమైతే ఆయన ఆ విషయాన్ని ఎందుకు వదిలేస్తారు ? గోపాల్‌కృష్ణ గాంధీ అయితే అసలు ఆ విషయమే తనకు తెలియదన్నాడు. ఈ సోదరులు పార్లమెంట్ వ్యవస్థలో ఉన్నవారు. ఇటు రాజాజీ అటు గాంధీజీ కుటుంబాలకు చెందిన వారు. వారెందుకు అధికార మార్పిడికి చిహ్నం అయిన సింగోల్ ప్రసక్తి ఎక్కడా తీసుకురాలేదు అంటే ఇది నేటి కేంద్ర హెూం మినిస్టర్ వండి వార్చిన అబద్ధాల వంటకం అని తేలిపోయింది. ఈ వాస్తవాలన్నీ తెలిశాక కేంద్ర గృహ మంత్రి మాటల్లో నిజమెంతో తేటతెల్లమయ్యింది.

1. అలహాబాదు మ్యూజియంలో ఉన్నది ఒరిజనల్ సింగోల్ కాదు. దాని ప్రతిరూపం మాత్రమే! **(మిగతా 15వ పేజీలో)**

# రెండువేల నోట్ల ఉపసంహరణ దేనికి సంకేతం?



- కేశవ్

**2016 నవంబర్ 8 తరువాత మరలా పెద్ద నోట్ల ఉపసంహరణ వార్త వినాల్సి వస్తోంది. అయితే, ఈసారి ఈ వార్తను ప్రధానమంత్రి రాత్రి 8 గంటలకు టెలివిజన్ ద్వారా ఆఘమేఘాల మీద దేశాన్ని ఉద్ధరిస్తున్నట్టు పెద్ద హంగామాతో మోసుకు రాలేదు. సరాసరి రిజర్వ్ బ్యాంకు ఒక మెమో ద్వారా తెలియజేసింది. ప్రజలు ఏం చేయాలో, బ్యాంకులు ఏం చేయాలో నిర్దేశించింది.**




ఒక వాదన ప్రకారం, ఇది సాధారణ ప్రక్రియ తప్ప చర్చించాల్సిన పెద్ద విషయం ఏం కాదు. అయితే, గత నోట్ల రద్దుతో, ఇప్పటి నోట్ల రద్దును ముడిపెడితే కొన్ని ప్రశ్నలు తప్పవు. కొన్ని సందేహాలు మిగిలిపోతూనే ఉన్నాయి. గతంలో పెద్ద నోట్ల రద్దు వల్ల నల్లధనం అంతమైపోతుందన్నారు. టెర్రరిస్టుల చర్యలు బలహీనమవుతాయని చెప్పారు. దేశం మరింత ముందుకుపోతుంది అన్నారు. క్యాష్ లెస్ ఎకానమీగా అభివృద్ధి చెందిన దేశాల దారిలో పయనిస్తామన్నారు. ఆన్‌లైన్ ఎకానమీలో నల్లధనం సునాయాసంగా పట్టుబడుతుందని చెప్పారు. కాని, ఎన్ని వాస్తవ రూపం దాల్చాయో మనకు బాగా తెలుసు.

## ప్రభుత్వం వాదన

2023 మే 23 నుంచి ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం 2000 రూపాయలు నోట్లను బ్యాంకుల్లో జమ చేయాలి. ఇవి లీగల్ టెండర్‌గా కొనసాగుతాయి. అందులో సందేహం లేదు. సెప్టెంబర్ 30వ తేదీలోపు ఈ నోట్లు ఉన్న పౌరులు తమ ఖాతాల్లో అయినా జమ చేయాలి. లేదా, ఇతర నోట్లతో మార్పిడి అయినా చేసుకోవాలి. అయితే, ట్రాంజాక్షన్లు రూ.20 వేలకు మించే అవకాశం లేదు. ఒక ప్రత్యేక దినాన ఎన్ని రెండు వేల నోట్లు బ్యాంకులకు వచ్చాయి ? ఎన్ని డిపాజిట్లు అయ్యాయి ? ఎన్ని ట్రాంజాక్షన్లు అయ్యాయి మొత్తం వివరాలు బ్యాంకులు ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం అందించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ ప్రకారం క్లీన్ నోట్ పాలసీగా ఇది సాధారణమైన చర్య అనీ, ప్రజలకు ఏ విధమైన ఇబ్బంది ఉండదనీ ప్రభుత్వ వాదన. 2018 మార్చి 31వ తేదీ నాటికి ఈ రెండు వేల నోట్లు 37.3 శాతం సర్క్యులేషన్‌లో ఉన్నాయి. కానీ, 2023 మార్చి 31 నాటికి ఇవి 10.8 శాతం మాత్రమే ఉన్నాయి. కాబట్టి, ఇవి తొలగిస్తే ఇబ్బంది ఏమీ లేదు. పైగా 2015 ముందు 89 శాతం ఈ రెండు వేల నోట్లు సర్క్యులేషన్‌లో ఉన్నాయి. క్లీన్ నోట్ పాలసీ ప్రకారం వీటి లైఫ్ స్పాన్ నాలుగు నుంచి ఐదేళ్లు మాత్రమే. అందుకే, వీటి ఉపసంహరణ అని ప్రభుత్వం తరుపున వాదన.

## వాస్తవాలు ఇలా..

నల్లధనం ఎక్కువగా పెద్ద నోట్లలో ఉందనీ, అందుచేత ఆ నోట్లు నిర్మూలిస్తే. అవినీతి అంతమవుతుందనీ, నల్లధనం దాచుకున్న ధనికులు జైలుకు వెళ్తారని నమ్మించారు ఆనాడు. ఎంత మంది జైళ్లలో ఉన్నారో మనకు ఈ రోజు వరకూ ఎవరూ చెప్పలేదు. నల్లధనం పెద్ద నోట్లలో ఉందన్నారు. మరి ఐదు వందలు, వెయ్యి రూపాయల నోట్లు ఆపేసి రెండే వేల నోట్లు ముద్రించడంలో లాజిక్ ఏమిటి ? తాత్కాలిక పరిష్కారం అన్నారు. పొంతన లేని వ్యవహారాలు కావా? నోట్ల రద్దు తర్వాత సాధారణ ప్రజలకు ఈ నోట్లు ఉపయోగపడలేదు. ఇప్పుడు కూడా ఉపయోగపడడం లేదు. ఎక్కడో డబ్బున్న వాళ్ళ దగ్గర, వ్యాపార వర్గాల దగ్గర, రాజకీయ నాయకుల దగ్గర నిల్వ ఉన్నట్టున్నాయి. సర్క్యులేషన్‌లో కూడా లేవు. 2016 తర్వాత ఈ రెండు వేల నోట్లు మూడు లక్షల 62 వేల కోట్ల రూపాయలు సర్క్యులేషన్‌లో ఉన్నాయి. ఎవరి దగ్గర ఉంటాయి ఇలాంటి కరెన్సీ? 90 శాతం అసంఘటిత వర్గం దగ్గర ఉండవు కదా! నల్లధనంపై సర్జికల్ స్ట్రైక్ అని మరలా పెద్ద నోట్లు ఇన్నేళ్లు ఇంత ఎక్కువ విలువగలవి సర్క్యులేషన్‌లో ఉండడంలో అర్థం ఏమిటి ? క్లీన్ నోట్ పాలసీగా ఉపసంహరణ చేస్తున్న నోట్లు సర్క్యులేషన్‌లో ఉంటేనే కదా అవి చిరుగుతాయి.

సాయిల్డ్ నోట్లు అవుతాయి. మరి ఈ నోట్లు సర్క్యులేషన్‌లోనే లేవు కదా. ఇళ్లల్లో భద్రంగా దాచుకున్న ఈ నోట్లు కొత్తగానే ఉంటాయి కదా. మరి, ఈ నోట్లు సాయిల్డ్ నోట్లు అయ్యే ప్రశ్న లేదు కదా? అలాంటప్పుడు, క్లీన్ నోట్ పాలసీ విధానం గాజుగదుల్లో భద్రంగా ఉన్న ఈ వీఐపీ నోట్ల విషయంలో ఎలా వర్తిస్తుంది? సెప్టెంబర్ 30వ తేదీ తర్వాత ఈ నోట్లు లీగల్ టెండర్‌గా ఉంటాయా ? ఉండవా ? ఇలా ఎన్నో ప్రశ్నలు.. దొరకని జవాబులు.

**సొంత ఇంటిని చక్కదిద్దుకోవడం..**

ఇది ఆకస్మిక నోట్ల రద్దు కాకపోయినా, సాధారణ బ్యూరో క్రాటిక్ చర్య అయినా సరే, అమలయ్యే సమయం, అప్రకటిత లక్ష్యాలు మరింత ప్రశ్నార్థకంగా ఉన్నాయని తెలుస్తోంది. కర్ణాటక ఎన్నికలు ఇటీవల ముగిశాయి. కర్ణాటక కోట బీజేపీ చేతుల నుంచి జారిపోవడం అధికార పార్టీకి ఊహించరాని పరిణామం. పార్లమెంటరీ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నాయి. అవతలి ప్రత్యర్థికి ఆర్థికంగా బలహీనం చేయడం కూడా ఎన్నికల ఎత్తుగడలో ఒక భాగమే. పైగా, భారతదేశం ప్రజాస్వామ్యంలో ఎన్నికలు రాను రాను అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారాయి. ప్రఖ్యాత విశ్లేషకులు క్రిస్టఫ్ జఫర్ లాట్ ప్రకారం, 17వ పార్లమెంటరీ ఎలక్షన్‌లో మొత్తం పార్టీలు 7.2 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టాయి అందులో, సగానికి పైగా 3.6 మిలియన్ డాలర్లు బీజేపీ ఖర్చు పెట్టింది. ఫేస్‌బుక్‌కు ప్రకటనలు ఇచ్చిన పది కంపెనీలలో బీజేపీకి సంబంధించినవి ఎనిమిది ఉన్నాయి. ఫేస్‌బుక్ ప్రకటనల కోసం ఎన్నికల ముందు రూ.2.3 కోట్లు ఖర్చు పెట్టారు. బీజేపీ గూగుల్‌లో ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 24 2019 వరకు ఆరు కోట్లు ప్రకటనల కోసం ఖర్చు పెట్టింది. ఇలా చూస్తే ఎన్నికలనేవి అధికార పార్టీకి అత్యంత ఖరీదైన వ్యవహారమయ్యాయి. ఇతర పార్టీలు ఇదే దారిలో వెళ్తున్నా ఇంకా ఈ స్థాయిని అందుకోలేదు. నేటి ఈ రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణ తన ఇంటిని బాగా చక్కదిద్దుకొని అవతలి ప్రత్యర్థిని బలహీనం చేయడం కాదా? నల్లధనం ఎక్కడున్నా దానిని అంతం చేయాల్సిందే? అయితే పెద్ద నోట్లలో నల్లధనం ఉండదు. లిక్విడ్ ఆస్తుల్లో ఉంటుంది. పార్లమెంటరీ ఎన్నికల ముందు నల్లధనం నిర్మూలించే ఈ విధానాలతో ప్రధాని తన ఇమేజిని పెంచుకునే ప్రయత్నం కాదా అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ❑

## సింగోల్ : రాజ్యాంగం మీద సర్జికల్ స్ట్రైక్!


**(13వ పేజీ తరువాయి)**

ఒరిజినల్ సింగోల్ ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో ఉంది. దాన్ని నెహ్రూ తన స్వంత ఆస్తిగా దాచి పెట్టుకోలేదు.

2. అది తన బంగారు చేతికర్ర అని ఎప్పుడూ ఎక్కడా చెప్పుకోలేదు.
3. అధికార మార్పిడి జరిగినప్పుడు స్వీకరించింది అని చెప్పడా నికి వీలే లేదు. నెహ్రూజీకి అందిన ఎన్నో బహుమతులలో ఇది ఒకటి!
4. ఇప్పుడు అధికారం ఎవరి నుండి ఎవరికి మారిందనీ.. బీజేపీ-మోడీ ప్రభుత్వం గత తొమ్మిదేండ్లుగా అధికారంలోనే ఉంది. ఇదంతా వృథా ప్రయాస.
5. పెరిగిన ధరలు, నిరుద్యోగం, బ్యాంకు దోపిడీగాళ్ళు, ప్రైవేటుకు పెద్దపీట, మహిళా రెజ్లర్లపై లైంగిక హింస, పతనమైన రూపాయి విలువ, ఆకలి సూచి, కనీవినీ ఎరుగని రైలు ప్రమాదాలు వంటి ఎన్నెన్నో అంశాల నుండి దేశ ప్రజల దృష్టి మరల్చడానికి - మ్యూజియంలో ఓ మూలపడి ఉన్న వస్తువును తెచ్చి ఈ ప్రభుత్వ పెద్దలు సంచలన వ్యాఖ్యలు చేశారన్న మాట.
6. గత ప్రభుత్వం ఏం చేసిందని మాటి మాటికి ప్రశ్నించే ఈ దేశ ప్రధాని ఇదిగో ఇలాంటి గొప్ప గొప్ప కార్యక్రమాలు చేసి చూపుతున్నారు.

1947 ఆగస్టు 14వ తేదీ సాయంత్రం, గవర్నర్ జనరల్, చివరి వైస్రాయ్ అయిన మౌంట్ బాటన్ - కరాచి నుండి ఢిల్లీ పాలం విమానాశ్రయంలో దిగాడు. ఆయన అప్పుడే పాకిస్థాన్ నుండి తిరిగివచ్చాడు. ఎందుకంటే, ఆ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది ఆ రోజే. మళ్ళీ ఆ రోజు రాత్రి ఢిల్లీ పార్లమెంటులో ఉండాలి. అక్కడ రాత్రి 11.30కు నెహ్రూజీ తొలిసారి ప్రసంగిం చబోతున్నారు. అంతటి ముఖ్యమైన కార్యక్రమాల మధ్య ఆధీనం మఠం వారు మౌంట్ బాటన్‌ను కలిసి సింగోల్ ఇచ్చారనడం వంద శాతం అబద్ధం. వైస్రాయ్ అంటే మామూలు విషయం కాదు. ఏ నిముషానికి ఎవరు వచ్చి వెళ్ళారన్నది అంతా రికార్డు ఉంటుంది. ఆ సాయంత్రం తమిళనాడు మఠాధిపతులు మౌంట్ బాటన్ దగ్గరికి వచ్చిన రికార్డేదీ లేదు. అదంతా ఇప్పటి ఈ గృహ మంత్రి సృష్టించిన రికార్డు! అంతా గమనిస్తే, మరొక విష యం తోస్తుంది. అబద్ధాలతోనైనా ఏదో విధంగా తమిళనాడులో నేటి స్టాలిన్ ప్రభుత్వాన్ని కదిలించాలన్న పథకాలు సిద్ధమవుతు న్నాయేమో! చివరగా ఇంకా ఒక ఆధారం ఉంది. డొమినిక్యూ లిపిరి, లార్రి కొల్లిన్స్‌లు కలిసి ఇండియన్ ఇండిపెండెన్స్ మీద 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' అనే ఒక పెద్ద గ్రంథం రచించారు. అందులో అసలు సింగోల్ ప్రసక్తే లేదు. అధికార మార్పిడికి సింగోల్ చిహ్నమైతే, ఆ రచయితలు దాని గురించి తప్పక రాసి ఉండేవారు కదా? 10-12 శతాబ్దాల నాటి చోళ రాజుల సింగోల్‌ను తవ్వి తీసి ఈ 21వ శతాబ్దానికి తీసుకొచ్చారంటే ఏమనుకోవాలి? ఈ సింగోల్ నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ మీద ఒక 'సర్జికల్ స్ట్రైక్' అని అనుకోవాల్సి ఉంటుంది. ❑

# ఖైదీల హక్కులు హరిస్తున్న జైళ్ళు



అనువాదం : రాఘవశర్మ

\- ఆకార్ పటేల్

**పదహారు మంది మేధావులపైన అయిదేళ్ళ క్రితం ప్రభుత్వం ఎల్గార్ పరిషత్ కేసు పెట్టింది. కేసు దర్యాప్తు ఎంత వరకొచ్చిందో తెలియదు కానీ, విచారణ మాత్రం అంగుళం ముందుకు కదలలేదు. ఈ కేసు విచారణ ఇంత వరకు న్యాయస్థానాల ముందుకు రాలేదు. వీరిలో ఎవరికీ శిక్షపడక పోయినా, అరెస్టైన వీరంతా చట్ట ప్రకారం అందాల్సిన కనీస సదుపాయాలకు కానీ, హక్కులకు కానీ నోచుకోకుండా జైళ్ళలోనే గడుపుతున్నారు.**

వీరిలో ఎనభై నాలుగేళ్ళ స్టాన్ స్వామి చాలా దుర్భరమైన పరిస్థితుల్లో జైలులోనే మృతి చెందారు. వరవరరావు, సుధా భరద్వాజ్‌లకు అనేక న్యాయ పోరాటాల తరువాత ఎన్నో ఆంక్షలతో బెయిల్ మంజూరైంది. మిగతా పదమూడు మంది జైళ్ళలోనే మగ్గుతున్నారు. ఈ కేసు కింద అరెస్టైన వారిలో విద్యా వేత్తలు, కవులు, న్యాయవాదులు వంటి మేధావులే ఉన్నారు.

## ప్రభుత్వం ఈ మేధావులను ఏం చేయదలిచింది!?

దేశ సమగ్రత, సార్వభౌమాధికారానికి భంగకరం కలిగిస్తున్న వారిని అదుపు చేయాలనే ఉద్దేశ్యంతో 1967లో 'చట్టవ్యతిరేక చర్యల నిరోధక చట్టాన్ని (ఉపా) ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికే ఉపయోగించుకుంటోంది. ప్రభుత్వ అరాచకాలను ఎవరైతే ప్రశ్నిస్తారో వారు ప్రభుత్వానికి శత్రువులని ముద్ర వేస్తోంది. అయిదేళ్ళ క్రితం మహారాష్ట్రలోని భీమాకోరెగాన్‌లో జరిగిన హింసకు, ఈ మేధావులకు ఎలాంటి సంబంధమూ లేదు. ఆ సమయంలో వీరక్కడ లేరు. అయినా ప్రభుత్వం వీరిని నిరంకుశ 'ఉపా' చట్టం కింద అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీరు యుద్ధం చేస్తున్నారని, ప్రధాని నరేంద్ర మోడీని హత్య చేయడానికి కుట్ర పన్నుతున్నారని వీరిపైన నిందమోపింది. ఈ మేధావులపైన ఎవరైతే ఫిర్యాదు చేశారో, ఏ ఫిర్యాదుపైనైతే వీరిని అరెస్టు చేశారో, ఆ వ్యక్తి హిందూత్వ పాలన కోరే వ్యక్తి. 'హిందువులకు ఉపయోగపడే వాటికి మనం సాయం చేయాలి, మిగతావి వదిలేయాలి' అని భావించే వ్యక్తి. అతని చేత ఫిర్యాదు చేయించిన తరువాతనే ప్రభుత్వం వీరిని అరెస్టు చేసింది. ఈ 16 మంది మేధావులపైన 'ఉపా' చట్టం కింద పుణె పోలీసులు కేసు పెట్టినప్పుడు మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఆ రాష్ట్ర శాసనసభకు 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది.

ఉద్ధవ్ థాక్రే ముఖ్యమంత్రిగా 2019 నవంబర్ 28న సంకీర్ణ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడంతో ఈ కేసును ఎన్ఐఏ కు అప్పగించాలని 2020 జనవరి 24న మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. మహారాష్ట్రలో కొత్తగా కొలువైన సంకీర్ణ ప్రభుత్వం ఈ 16 మంది మేధావులకు బెయిల్ ఇస్తుందేమోనన్న అనుమానంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ కేసును తన పరిధికి తెచ్చేసుకుంది. కేసు దర్యాప్తును ఏమైనా ముందుకు తీసుకెళ్ళిందా అంటే అదీ లేదు. పైగా ఈ మేధావుల తో కేంద్రం చాలా అమానుషంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగంలోని 19(1) అధికరణం ప్రతి పౌరుడికి భావ ప్రకట నా స్వేచ్ఛను కల్పిస్తోంది. 21వ అధికరణం జీవించే హక్కును కల్పిస్తోంది. 14వ అధికరణం సమాన హక్కును కల్పిస్తోంది. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కులన్నిటినీ ఈ మేధావులకు దక్కకుండా హరించే విధంగా, ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు ఈ నిరంకుశ 'ఉపా' చట్టాన్ని ప్రయోగించింది. ఈ కారణం చేతనే వారు జైల్లో ఉన్నారన్న విషయం మనం మర్చిపోకూడదు. జైలులో ఉన్నప్పటికీ ఖైదీలకు కూడా కొన్ని హక్కులుంటాయి. ఈ హక్కులు చట్టం కల్పించినవే. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత జైలు అధికారులపైనే ఉంటుంది.

**భీమా కోరెగాన్ కేసులో నింది తులైన 16 మందిలో ఒకరైన ఎనభై నాలుగేళ్ళ స్టాన్ స్వామి క్రైస్తవ మత బోధకుడు, హక్కుల కార్యకర్త. అతను అనేక అనా రోగ్య సమస్యలతోపాటు, తీవ్రమైన పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నాడు. చేతితో గ్లాసు పట్టుకుని మంచి నీళ్ళు తాగలేని పరిస్థితి. స్ట్రా గ్లాసు ఏర్పాటు చేయమని స్టాన్ స్వామి జైలు అధికారులను కోరారు. అది ఏర్పాటు చేయడం జైలు అధికారుల బాధ్యత. స్ట్రా గ్లాసు కూడా ఏర్పాటు చేయకుండా, కోర్టు అనుమతి కావాలని**

**మెలికపెట్టారు. కోర్టు తాత్సారం చేసింది. సరైన వైద్యం, కనీస సదుపాయాలు అందక స్టాన్ స్వామి జైలులోనే మృతి చెందారు. ఇతని మృతి ఒక్క భారత దేశంలోనే కాదు ప్రపంచంలోని మేధావులందరినీ కదిలించింది. అయినా ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదు.**

మరో నిందితురాలు సోమాసేన్ మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్నారు. కమోట్ లేకుండా టాయిలెట్లో కూర్చోవడం ఆమెకు చాలా ఇబ్బందికరం. కమోట్ అడిగినా జైలు అధికారు లు ఏర్పాటు చేయలేదు. బైట నుంచి ఆమె కుమార్తె తెచ్చిచ్చిన కమోట్‌ను అనుమతించలేదు. ఐటీ, ఉపా చట్టాలతో పాటు, నాలుగు వివేకానందుడి పుస్తకాలను, కాగితాలను కావాలని సురేంద్ర గాడ్గిల్ జైలు అధికారులను కోరారు. దీన్ని జైలు అధికారులు తిరస్కరించారు. పుస్తకాల కోసం గాడ్గిల్ న్యాయ స్థానానికి వెళ్ళవలసి వచ్చిందంటే జైలు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. న్యాయస్థానం అనుమతించినా, జైలు అధికారులు ఆ పుస్తకాలను ఇవ్వడానికి అనుమతించలేదు. చలికి తట్టుకోలేకున్నానని, స్వెట్టర్ను అనుమతించాలని గాడ్గిల్ కోర్టుకు విన్నవిస్తే, కోర్టు అనుమతించింది. జైలు అధికారులు మాత్రం ఉలన్ స్వెట్టర్ను అనుమతించలేదు. గాడ్గిల్ కుమార్తె థర్మల్ స్వెట్టర్‌ను తీసుకొచ్చినా, సగం చేతుల వరకు వున్న స్వెట్టర్‌ను మాత్రమే అనుమతిస్తామని, పొడుగు చేతుల థర్మల్ స్వెట్టర్‌ను అనుమతించమని జైలు అధికారులు తిప్పి పంపించే శారు. గాడ్గిల్ జైలులో ఉండగానే ఆయన తల్లి మృతి చెందింది. అంత్యక్రియలకు వెళ్లడానికి అనుమతివ్వాలని గాడ్గిల్ కోరారు. అతని దరఖాస్తుతో తల్లి డెత్ సర్టిఫికెట్ లేదు కనుక, ఆమె మృతి చెందినట్టు నిర్ధారణ జరగలేదని, డెత్ సర్టిఫికెట్ లేకుండా ఎన్ఐఏ అంగీకరించదని, అంత్యక్రియలకు అనుమతి కోరిన దరఖాస్తును తిరస్కరించారు. ఒక మనిషి మృతి చెందితే అంత్య క్రియలు పూర్తయ్యిన ఎన్ని రోజులకు డెత్ సర్టిఫికెట్ వస్తుందో మనందరికీ తెలుసు. అంత్యక్రియలు పూర్తి కాక ముందే డెత్ సర్టిఫికెట్ ఎలా సంపాదించగలుగుతారు? డెత్ సర్టిఫికెట్ వచ్చాక కుటుంబ సభ్యులతో గడపడానికి అనుమతి కోరితే, అంత్యక్రియలు అయిపోయాక బయటకు వెళ్ళాల్సిన అవసరం ఏముందని ఎన్ఐఏ ప్రశ్నించింది. తల్లి సంస్మరణ సభకు అనుమతివ్వాలని కోరితే, సంస్మరణ సభకు సంబంధించిన పత్రం లేదని ఎన్ఐఏ తిరస్కరించింది. సుధీర్ ధావ్ లే సోదరుడు మృతి సందర్భంగా అంత్యక్రియల అనంతరం ఏర్పాటుచేసే సంస్మరణ సభ పత్రం జత చేసి బెయిల్ కోసం దరఖాస్తు చేస్తే, అతను చేసిన నేరం తీవ్రమైం దని, బయటకు వెళ్లడానికి వీలులేదని తిరస్కరించారు. మహేష్ రౌత్ విచారణ ఖైదీగా జైల్లో ఉండగానే అతని చెల్లెలి వివాహం జరిగిపోయింది. వెర్నెన్ గోన్ సాల్వ్ తల్లి 2021 మేలో మరణిస్తే, ఆయనకు తల్లి చివరిచూపులు దక్కలేదు.

డెబ్బై ఏళ్ళ వయసున్న గౌతమ్ నవలఖ కళ్ళ జోడును జైల్లో ఎవరో దొంగిలించారు. కళ్ళజోడు లేకపోతే అతినికి ఏమీ కనిపించదు. కళ్ళ జోడు తెప్పించమని ఇంట్లో వారిని కోరడానికి కూడా మూడు రోజుల వరకు అనుమతించలేదు. ఇంటినుంచి ఆయన సతీమణి తెచ్చిన కళ్ళజోడును కూడా ఏదో పాకెట్ ఉందనే నెపంతో అనుమతించలేదు. వరవరరావుకు బెయిల్ మంజూరు చేసినప్పటికీ ముంబయి దాటి వెళ్ళకూడదని ఆంక్షలు పెట్టారు. కంటిచూపు సమస్య ఏర్పడడం వల్ల వరవర రావుకు ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. రిటైర్డ్ ఉద్యోగి కనుక తెలంగాణలో ఉచితంగా ఆపరేషన్ చేయించుకో వచ్చు. కానీ, ఆపరేషన్ కోసం ముంబయి వదిలి హైదరాబాదు వెళ్ళడానికి న్యాయస్థానం అనుమతించకుండా ప్రభుత్వం అడ్డుపడుతోంది. ముంబయి వదిలి వెళ్ళకూడదని ఆంక్షలు పెట్టినప్పుడు ప్రభుత్వమే ఆపరేషన్ చేయించాలి కదా! లేదా దానికయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలి కదా! ఏమీ చేయకుండా వైద్యానికి ప్రభుత్వం మోకాలడ్డుపెడుతోంది. రోనా విల్సన్ ల్యాప్‌టాప్‌లో దొరికినట్టు పోలీసులు ఆరోపిస్తున్న లేఖ ఒక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి వారు పెట్టినదేనని ఒక స్వతంత్ర విశ్లేషణా సంస్థ వెల్లడించిందని 'ద వైర్' రాసింది.

ప్రధాని మోడీని హత్య చేయాలని ఆరోపణ లేఖ కూడా రోనావిల్సన్ ల్యాప్‌టాప్‌లో సాఫ్ట్‌వేర్ ఉపయోగించి చొప్పించిందేనని స్పష్టం చేసింది. రోనావిల్సన్ ల్యాప్‌టాప్‌లో ఉన్న ఈ ఫోల్డర్‌ను ఆయన తెరిచినట్టు ఆధారాలు లేవు. రోనా విల్సన్ ల్యాప్‌టాప్ హ్యాక్ చేశారని డిజిటల్ ఫోరెన్సిక్‌లో పేరు ప్రఖ్యాతులు వున్న సంస్థ 2021 ఏప్రిల్‌లో స్పష్టం చేసింది. ఈ నిందితులందరిపైన దాదాపు ఇలాగే దొంగ సాక్ష్యాలను సృష్టించి ప్రభుత్వం కేసులు పెట్టింది. ప్రభుత్వం అరాచకాలపై ఎవరైతే నిరసన తెలుపు తారో చట్టాన్ని దుర్వినియోగం చేసి, వారందరినీ జైళ్ళలో కుక్కడానికి పెట్టిన భీమా కోరెగాన్ కేసు ఒక ఉదాహరణ మాత్రమే. ప్రభుత్వం అనుసరిస్తున్న చట్టవ్యతి రేక విధానాలకు వ్యతిరేకంగా గొంతెత్తి మాట్లాడినందుకు ఉమర్ ఖలిద వెయ్యి రోజులు జైల్లో గడపాల్సి వచ్చింది. పేద లు, మైనారిటీలు, అట్టడుగున ఉన్న వారు ప్రభుత్వ దమననీతిని ఎదుర్కోవలసి వస్తోంది. అన్యాయాలకు, అరాచకాలకు వ్యతిరే కంగా ఎవరైతే గొంతెత్తుతారో, బలహీనుల పక్షాన ఎవరైతే నిలబడతారో ప్రభుత్వం వారిపై దేశ వ్యతిరేక శక్తులని ముద్ర వేసి జైళ్ళలో కుక్కుతోంది. రాజ్యం వ్యవహరించే ఈ దారు ణాలకు వ్యతిరేకంగా మనమంతా ఎంత కాలమైతే నోరెత్తమో, దీనికి గురైన బాధితులను ఎంత కాలమైతే పట్టించుకోకుండా వదిలేస్తామో అంతకాలం ఈ అరాచకాలు కొనసాగుతూనే ఉంటాయి. ❑

# ఏకాకి గొంతును రికార్డు చేయనివ్వండి



- తులసి చందు

**ఎందుకు నేను బీజేపీపైనే ఎక్కువ వీడియోలు చేస్తున్నాను? ముఖం చూపించలేని వాళ్లు, సొంత పేర్లు చెప్పుకోలేని ఫేక్ అకౌంట్స్ నుంచి ఘోరమైన కామెంట్స్, ఇన్ బాక్స్ మెసేజస్ వస్తున్నా నేను ఈ పని ఎందుకు చేస్తున్నాను ? ఇండిపెండెంట్ జర్నలిస్టుగా చెప్పుకుంటూ ఎక్కువ వీడియోలు బీజేపీని ప్రశ్నిస్తూ ఎందుకు చేస్తున్నాను ? నేను చేసిన వీడియోలు మీరు చూశారా ? ఎంఐఎం బీజేపీ ఒక్కటే అని చాలాసార్లు చెప్పాను. బీజేపీని ఎందుకు వ్యతిరేకిస్తానో చెప్పాను. మతం పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారు అంటేనే ప్రజల్ని సమానంగా చూడట్లేదు అని అర్థం. బీజేపీ ఎంఐఎం రెండింటి డీఎన్ఏ ఒకటి. ఒకటి పెద్ద పార్టీ రెండోది తోకపార్టీ అంతే తేడా.**

ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడంకంటే ఏ దేశానికీ అత్యంత ప్రమాదకరమైన విషయం మరొకటి ఉండదు. రాజ్యాం గం సాక్షిగా పాలిస్తామని చెప్పి ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చి వచ్చినప్పట్నుంచి మెజారిటీ మతం వాళ్లను మైనారిటీ మతాలపైకి ఎగదోయడం కూడా విశాలమైన ఛాతీ ఉన్న రాజకీయాలేనా. వాజ్‌పేయ్ ఇలా చెయ్యలేదే. మత మార్పిడులు జరగకుండా హిందూ మతంలో కులాన్ని పాతరెయ్యొచ్చు. మరి కుల నిర్మూలనకు తీసుకున్న చర్యలేంటి? గిరిజన రాష్ట్రపతి, బహుజన ప్రధాని ఉన్న దేశంలో మత రాజకీయాలు ఎందుకు? ఒక్క రాష్ట్రంలో అయినా మతం పేరు చెప్పకుండా ఎందుకు గెలవలేకపోతున్నారు..? అధికారంలో ఉన్నదే హిందూ పార్టీ అయినప్పుడు.. 80 కోట్ల మంది హిందువుల్ని ఎవరు ఈ రోజు అభద్రతలోకి నెట్టేశారు? 75 ఏళ్లుగా లేని అభద్రత ఇప్పుడే వచ్చిందా. ఢిల్లీలో ఓ హిందూ అమ్మాయిని ముస్లిం చంపేస్తే దాన్ని ఒక క్రైంగా చూడట్లేదు హిందువులపై దాడి అంటున్నారు. అదే హిందూ అమ్మాయిల్ని రోజూ వందల మందిని భర్తలూ, తండ్రులు, అన్నలూ, ప్రియుడు, గుర్తు తెలియని వ్యక్తులు చంపేస్తోంటే ఎందుకు మాట్లాడరు ? దేశంలో ఉగ్రవాదం ఉండకూడదు. అలాగని మీ స్నేహితుడినో, నా పక్కింటిలోవున్న సాధారణ ముస్లింలనో దోషులుగా చూపవచ్చా ? ఇతర దేశాల్లో మనవాళ్లు ఉన్నారు. అక్కడ హిందువులు క్రైం చేస్తే మొత్తం అందరినీ ఒకే గాటన కడితే మనకు ఎలా ఉంటుంది? ఇప్పుడు దేశంలో ఎక్కడ ఏం జరిగినా మతం కోణం ఎందుకు వస్తోంది? చివరికి బాలాసోర్‌లో రైలు ప్రమాదం జరిగిదే పక్కన మసీదు వల్లే, ఆ రోజు శుక్రవారం కాబట్టి అనేది తెరపైకి వచ్చింది. తీరా చూస్తే అది మసీదు కాదు ఇస్కాన్ టెంపుల్. తర్వాత స్టేషన్ మాస్టర్ ముస్లిం కావడం వల్లే ప్రమాదం అన్నారు. తీరా చూస్తే ఆ స్టేషన్ మాస్టర్ మహంతి ఒక హిందువు. తర్వాత ఇప్పుడు ఇంజినీర్ అమీర్ అన్నారు. ఇది కూడా తప్పుడు ప్రచారమే అని చివరికి రైల్వే డిపార్టెంట్ వివరణ ఇవ్వాల్సి వచ్చింది. అంటే ఒక ప్రమాదాన్ని ఇన్నిసార్లు మతం కోణంలో చూసి తప్పుడు ప్రచారాలు చేసి నాలుకు కరుచుకుంటున్నారు అంటే ఎంత ద్వేషం నింపేసి ఉండాలి సామాన్యుల బుర్రల్లోకి. చిన్న పిల్లలు కూడా ఇవాళ మతం గురించి మాట్లాడుతున్నారు అంటే ఈ పరిస్థితిలోకి ఎవరు నెట్టేశారంటే కారణం ఎవరు? మతాల పేరుతో కొట్టుకు చావనీ నా భవిష్యత్తు తరాలు. ఇప్పటి ఈ విద్వేషం కాల్చేసేది మన పిల్లల్ని కాదా? సిరియా, ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ ఈ దేశాల పక్కనా మనకు స్థానం కావాల్సింది? కుటుంబాల్లో, పిల్లల మనసుల్లో నాటుతున్న విష బీజాలు పెరిగి పెద్దయ్యాక ఎలాంటి ఫలితాలు ఇస్తాయో పాలకులు ఆలోచిస్తున్నారా? ఇప్పటి విద్వేషం రేపు ఎన్ని ఓట్లు తెస్తుంది అనే దగ్గరే వాళ్ల ఆలోచనలు ఆగిపోతున్నాయ్.. మర్నాడు మరో ఎన్నిక.. ఇంతే కదా నడుస్తోంది.. !?

**ఇప్పుడు మనకు కావాల్సింది అమెరికాతో చైనాతో పోటీ పడే భారతదేశం కాదు. హిందూ రాష్ట్రంగా ప్రకటించడమే మనక్కావాలి? పోనీ ఏమౌతుంది ప్రకటిస్తే.. ఏం మారుతుంది? విదేశా ల్లో సెటిలైపోయిన ఒక్క నాయకుడి బిడ్డ అయినా తిరిగొచ్చే స్తుందా? ఒక్క సామాన్యుడి పరిస్థితి మారుతుందా..? మహా అయితే పుస్తకాల్లో సిలబస్ మారిపోతుంది. ఇంగ్లీష్ మినిమం అయ్యి హిందీ, సంస్కృతం వస్తుంది. అదే జరిగిదే చిన్న చిన్న చదువుల కోసం విదేశాల బాటపట్టరా? అదా మనకి కావాల్సింది? రాను రాను మతాలు, కులాలు లేని భారతదేశాన్ని నిర్మించాలా ? లేదా ? ఒకరినొకరు ద్వేషిస్తూ కొట్టుకునే దేశం కావాలా?**

కేరళలో 32 వేల మంది అమ్మాయిలు ఐసిస్‌లో చేరా రా? మరి అన్ని మిస్సింగ్ కేసులు ఉండాలి కదా.. గుజరాత్‌లో 40 వేల మంది అమ్మాయిలు మిస్ అయ్యారు. తెలంగాణలో, ఏపీలో అన్ని రాష్ట్రాల్లో వేలాది మంది అమ్మా యిలు మిస్ అవుతున్నారు వీళ్లంతా ఏమైపోతున్నట్లు? కేరళలో ఇప్పటి వరకు 3 కేసులు ఫైల్ అయ్యాయి. తల్లిదండ్రులు బయటికొచ్చారు. బాధితులు ఉన్నారు. మరి మిగతా 31 వేల 997 కేసులు ఏవీ.. అంత మంది ఉగ్రవాద సంస్థల్లో చేరిపోతో ఎన్ని లక్షల మంది వాళ్ల తల్లిదండ్రులు, బంధువులు రోడ్లపైకి రావాలి.. వచ్చారా? మరి ఎందుకీ ప్రచారం? ఆజాదీ కాశ్మీర్ సమస్య కాశ్మీర్‌లో ఉంది. కాశ్మీర్‌లో సాధారణ హిందువులు, సాధారణ ముస్లింలు కొట్టుకోవట్లేదు. ఉగ్రవాదులు వేరు, సాధారణ వ్యక్తులు వేరు. హిందువుల్లో క్రైస్తవుల్లో మతాన్ని అతిగా తీసుకొని ఇతరుల్ని ద్వేషించేవాళ్లు ఉంటారు. ఇది వ్యక్తుల సమస్య ఇక్కడికి రాజకీయం ఎందుకు తెస్తున్నారు. సరే ఇదే బీజేపీ నార్త్ ఈస్ట్‌లో క్రిస్టియన్ అనుకూల విధానాలు, హామీలు ప్రకటనలు చేసి గెలిచింది. అంటే ఎక్కడ ఏ మతం మెజారిటీ అయితే వాళ్లను పోలరైజ్ చేసి ఓట్లు దండుకొని అధాకరంలోకి రావడం ఇదేనా కావాల్సింది? మణిపూర్ ఆహుతి అయిపోతోంటే.. కనీసం ప్రధాని నుంచి శాంతి ప్రకటన కూడా ఎందుకు రావట్లేదు? కరోనా కష్టకాలం లో టీవీల్లో కనిపించి చెప్పిన మాట కనీసం మన్ కీ బాత్‌లో అయినా చెప్పొచ్చు కదా.. నేనున్నాను.. మీ సమస్య పరిష్కరి స్తాను అని.. ఎందుకు చెప్పట్లేదు? చనిపోతున్న వాళ్లంతా మతం మారిన క్రైస్తవులే కాదు.. హిందువులూ చనిపోతున్నారు.. హిందువులైన మెయిటీ ల ఆస్తులూ ధ్వంసమౌతున్నాయ్.. మరి హిందువు కోణంలో అయినా ఒక ప్రకటన చెయ్యాలి కదా కేంద్రం. పోనీ గిరిజన మహిళ అయిన రాష్ట్రపతితో అయిన ప్రకటింపజేయవచ్చు కదా.. ఇవేవీ ఎందుకు జరగట్లేదు. నేను ఇది అడిగినా మీ దృష్టిలో దేశద్రోహి, హిందూ వ్యతిరేకి అయి పోతున్నాను.

**చేవ చచ్చిన కాంగ్రెస్ పార్టీని ఏమని అడుగుతాం ఈ దేశం గురించి..? అధికారంలో ఉన్న వాళ్లనే కదా అడగాలి..? పోనీ దేశంలో ఉన్న మెజారిటీ మతానికి ఏం మేలు చేసినట్లు? ఏ సామాన్యుడినైనా పిలిచి మతం చూసి ఓటు వేశావు కదా.. నీకు జరిగిన మూడు గొప్ప మేళ్లు చెప్పు అంటే ఏం చెప్తాడు? పెట్రోల్ గ్యాస్ ధరలే కాదు.. టాక్స్ పరిధిలోకి రాని వస్తువులు ఎన్ని ఉన్నాయ్ ఇప్పుడు? రైళ్లలో సామాన్యులు కిక్కిరిసి కూర్చునే జనరల్ బోగీలను నిలువునా కోసేస్తున్నారు.. వృద్ధులకుండే రిజర్వేషన్ పూర్తిగా ఎత్తేశారు. పెన్షన్ల నుంచి రకరకాల కోతలతో నేరుగా వసూళ్లు చేస్తున్నారు. పరిశ్రమలు పెట్టట్లేదు.. ఉన్న వాటిని సొంత ఆస్తిలా అమ్మేస్తున్నా అడగకూడదా? కనీసం ఒక పౌరురాలిగా అయినా అడిగే హక్కు ఉంటుంది కదా.. మీరు అడగరు.. నేను అడిగితే హిందూ వ్యతిరేకినా?**

బీజేపీని అధికారంలోకి తెచ్చింది గుజరాత్ మోడల్ చూసే గానీ మతాన్ని చూసి కాదు. మతం పేరుతోనే అయితే అద్వానీని చూపించే వాళ్లు 2014లో. గుజరాత్ వెలిగిపోతోంది. భారత్ కూడా వెలిగి పోవాలి అంటే మోదీ రావాలి అని. మోదీ వచ్చారు. నల్లధనం వచ్చిందా, నోట్ల రద్దు తర్వాత గుర్తించిన నల్లధనం ఏమీ లేదు.. ఏదైనా చేశారు అంటే మళ్లీ రెండు వేల నోట్లు రద్దు చెయ్యడం. మరి అకౌంట్లలో వేస్తాం అన్న రూ.15 లక్షల మాటేంటి ? ఇది ఎవరూ అడగకూడదు కదా..? అడిగితే దేశ ద్రోహి, ధర్మ ద్రోహి హిందూ వ్యతిరేకి. జీఎస్టీ వల్ల కేంద్రానికి రెవెన్యూ పెరిగింది. కానీ పరిశ్రమలు మూతపడ్డాయి. చిన్న చిన్న వ్యాపారాలు నష్టాల్లోకి వెళ్లాయి. హోటల్లో ఇడ్లీ తిన్నా జీఎస్టీ వేస్తున్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామన్నారు. ఏవీ ప్రతి ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయ్. మన దేశంలో ఉండే సహజమైన అధిక జనాభా అనే పొటెన్షియాలి టీని బేస్ చేసుకొని, మనం చదువులకు ఇస్తున్న ప్రాముఖ్యతను క్యాష్ చేసుకునేందుకు చీప్ లేబర్ కోసం ఇక్కడికి పెద్ద పెద్ద కంపెనీలు వచ్చి ప్రైవేట్ జాబ్స్ పెరిగాయ్. మరి ప్రభుత్వ ఉద్యో గాలేవీ..? మేము నిరుద్యోగులం అని 29 కోట్ల మంది ప్రభుత్వం దగ్గర నమోదు చేసుకున్నారు..? నమోదు చేసుకోని వాళ్లనూ కలిపితే..?

కొంత మంది పారిశ్రామిక వేత్తల్నే ప్రోత్సహించడం వల్ల మార్కెట్లో మోనోపోలి పెరిగింది. ఇప్పుడు దేశం అంత భారీ స్థాయికి చేరుకున్న ఆ ఒకరిద్దరు పారిశ్రామికవేత్తలకు ఏదైనా అయితే దేశ ఆర్థిక పరిస్థితి తలకిందులయ్యే స్థితికి ఎవరు కారణం? గ్యాస్, పెట్రోల్ ధరల ప్రభావం ఎవరిపై ఎక్కువగా పడింది. గ్రామాల్లో మళ్లీ కట్టెల పొయ్యిలు ఎందుకు పెరిగాయో మీరు ఊరెళ్లినప్పుడు అడగండి ఆడవాళ్లు చెప్తారు.

మీ ఫోన్ చెక్ చేసుకోండి మీకు బీజేపీ ఐటీ సెల్ నుంచి వండి వార్చిన మెసేజీలు మోదీ వల్ల దేశం వెలిగిపోతోంది అన్న మెసేజీలు, ఇతర మతాలపై ద్వేషం కలిగించే మెసేజీలు ఎన్ని వచ్చాయో చూసుకోండి. కొత్తగా ఆఫీసులో చేరిన వాళ్లు ఇప్పుడు వాళ్ల క్వాలిఫికేషన్స్ గురించి చూడట్లేదు. పక్కవాడి ఐడియాలజీ ఏంటి, వాడి **(మిగతా 23వ పేజీలో)**

# మీరు వాడే వంటనూనెలో మూడో వంతు అదానీ కంపెనీలదే

- బళ్ల సతీశ్

**దేశమంతా అదానీ గురించి చర్చ జరుగుతున్న వేళ, అదానీ కంపెనీ అంటే బొగ్గు, ఎయిర్‌పోర్టులు, కరెంటు, ఓడరేవులు అనే చాలామంది అనుకుంటున్నారు. కానీ కిరాణా వ్యాపా రంలోనూ ఇప్పుడు అదానీయే టాప్. కిరాణా ఏమిటని కన్ఫ్యూజ్ కావద్దు. ఇంట్లో వాడే సాధారణ సరుకుల ఉత్పత్తి, పంపిణీలో ఇప్పుడు దేశంలో నంబర్‌వన్ కంపెనీ. వీటినే ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) అంటారు. మీరు వాడే వంట నూనె లో మూడో వంతు అదానీదే! మీరు మార్కెట్లోకొనే నూనె ప్యాకెట్లు, నూనె డబ్బాల్లో ప్రతీ నాలుగింటిలో ఒకటి అదానీ గ్రూపుదే. ఈ వ్యాపారంలో సుదీర్ఘ కాలంగా పరిచయం ఉన్న హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్‌ను కూడా ఎప్పుడో దాటేసింది అదానీ విల్మర్ గ్రూపు.**



2021-22 సంవత్సరానికి గానూ హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్ వాళ్లు రూ.51,468 కోట్ల వ్యాపారం చేస్తే, అదానీ విల్మర్ గ్రూపు రూ.54,214 కోట్ల వ్యాపారం చేసింది. 2013లో మొదలై 2023 వచ్చేసరికి దేశంలోనే నంబర్‌వన్ ఫుడ్, ఎఫ్ఎంసీజీ బ్రాండ్ అయింది అదానీ విల్మర్ గ్రూపు. 90 ఏళ్ల నుంచి పాతకుపోయిన యూనిలీవర్‌ను దాటి ఈ రంగంలో మార్కెట్ నంబర్ వన్‌గా అదానీ గ్రూపు అవతరించడానికి ఉపయోగపడింది వంట నూనెలే! సింగపూర్‌కి చెందిన విల్మర్ సంస్థకు ఈ రీటెయిల్ వ్యాపారంలో బాగా పట్టు ఉంది. భారత దేశంలోని వ్యవహారాలపై అదానీకి పట్టుంది. ఇద్దరూ కలసి దేశంలోనే అది పెద్ద ఫుడ్ సంస్థను స్థాపించారు. ఈ కంపెనీకి ఎన్ని వ్యాపారాలు వున్నా, నూనెదే అందులో సింహ భాగం. విల్మర్ అంతర్జాతీయంగా ఫుడ్, ఎఫ్ఎంసీజీలో తన అనుభవం ఉపయోగిస్తే, అదానీ లోకల్ మార్కెట్, లాజిస్టిక్స్, రెగ్యులేటింగ్ చూస్తోంది. భారతదేశంలో వివిధ అంశాలు, వ్యవస్థలపై అదానీ గ్రూపుకు ఉన్న పట్టు, ఈ కంపెనీకి లాభాలు తెచ్చిపెట్టింది.

"భారతదేశంలో బ్రాండెడ్ ఆయిల్ మార్కెట్ విలువ దాదాపు ఒక లక్షా 56 వేల కోట్లు. ఇందులో అదానీ విల్మర్, రుచి సోయా, ఇమామీ, మారికో వంటి కంపెనీలు పెద్దవి. ఇప్పుడు అదానీ అందులో దూసుకుపోతున్న సంస్థ. రిఫైన్డ్ సోయా బీన్ ఆయిల్‌లో అదానీ విల్మర్ అతి పెద్దది. 28 శాతం మార్కెట్ వాళ్లదే. పామాయిల్‌లో రెండో స్థానం వీరిది. మార్కెట్ వాటా 11 శాతం. ఇక మస్టర్డ్ ఆయిల్‌లో 10 శాతం, సన్ ఫ్లవర్‌లో 14 శాతం, రైస్ బ్రాన్‌లో 20 శాతం అదానీ విల్మర్ వాటా ఉంది' అని వాణిజ్య రంగ నిపుణులు నాగేంద్ర సాయి బీబీసీతో చెప్పారు. సన్ ఫ్లవర్, సోయా, వరి, వేరుసెనగ, ఆవాలు, పామాయిల్, పత్తి ఇలా రకరకాల నూనెలు, వనస్పతులు ఉత్పత్తి చేస్తోంది అదానీ సంస్థ. ఈ సంస్థకు రోజుకు 12 వేల టన్నుల నూనె శుద్ధి చేసే కెపాసిటీ ఉంది. 23 ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఏటా 25 లక్షల టన్నుల నూనె శుద్ధి చేస్తోంది ఈ సంస్థ. 'ఇన్ని రకాల భిన్నమైన నూనెలు ఉత్పత్తి చేస్తోన్న మరో భారతీయ సంస్థ లేదు' అన్నారు నాగేంద్రసాయి. 'మేం కొబ్బరి నూనె తప్ప, అన్ని రకాల నూనెల ఉత్పత్తిలోనూ ఉన్నాం' అని మీడియాతో చెప్పారు అదానీ విల్మర్ సీఈవో మల్లిక్. మార్కెట్లో

విరివిగా దొరికే ఫార్చ్యూన్ బ్రాండ్ వంట నూనె అదానీదే. అదే కాకుండా, అదానీ దగ్గర కింగ్స్, ఆధార్, బుల్లెట్, రాగ్, అల్ఫ్, జుబిలీ, అవసర్, గోల్డెన్ చెఫ్, ఫ్రయోలా పేర్లతో అనేక నూనె బ్రాండ్లు ఉన్నాయి.

కేవలం ఇంటి అవసరాలకే కాకుండా హెూటల్స్, బేకరీలకు అదానీ గ్రూపు వంట నూనెలు పెద్ద ఎత్తున సరఫరా అవుతున్నాయి. ఎగుమతులు చేస్తున్నారు. అమెరికా, కెనడా, మధ్య ఆసియా, ఆగ్నేయాసియా, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రిటైల్‌తో సమానంగా, హెూటళ్లు, రెస్టారెంట్లు, కేటరర్లపరంగా అదానీ వ్యాపారం పెరుగుతోంది. 2022 అక్టోబరు, నవంబరు, డిసెంబరు - కేవలం ఈ మూడు నెలలకు నూనె, ఇతర ఎఫ్ఎంసీజీ వస్తువుల వల్ల అదానీ నికర లాభం రూ. 246 కోట్లు.

## కలిసొచ్చిన రష్యా-యుక్రెయిన్ యుద్ధం

భారతదేశంలో ఇప్పటికీ సగానికిపైగా వంట నూనెలు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవే. 2021-22లో భారతీయులు రెండు కోట్ల 67 లక్షల టన్నుల ఆయిల్ వాడారని కేంద్ర వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. అందులో కోటి 40 లక్షల టన్నుల నూనెలను దిగుమతి చేసుకున్నారు. 80 లక్షల టన్నులు పామాయిల్, 38 లక్షల సోయా ఆయిల్, 20 లక్షల టన్నుల సన్ ఫ్లవర్ దిగుమతి చేసుకున్నారు. అందులో సన్ ఫ్లవర్ నూనె 90 శాతం రష్యా నుంచే వస్తోంది. భారతదేశం దిగుమతి చేసుకునే సన్ ఫ్లవర్ నూనెలో 70 శాతం యుక్రెయిన్ నుంచి, మిగిలిన 20 శాతం రష్యా నుంచి వస్తోంది. ఆ రెండు దేశాల మధ్య యుద్ధం దిగుమతులకు పెద్ద ఆటంకం కలిగించింది.

- 2022లో రష్యా-యుక్రెయిన్ యుద్ధం
- 2021లో మలేసియా వాతావరణ పరిస్థితులు, ఇండోనేషియా ఎగుమతుల నిషేధం
- 2021-22 కెనడా వాతావరణ పరిస్థితులు

ఇవన్నీ అంతర్జాతీయంగా నూనె ఎగుమతుల మీద తీవ్ర ప్రభావం చూపించాయి. అవే భారతీయ నూనె కంపెనీలకు గొప్ప అవకాశాన్ని ఇచ్చాయి. మార్కెట్లో వంటనూనె ధరలతో పాటూ షేర్ మార్కెట్లో నూనె కంపెనీల ధరలు బాగా పెరిగిపోయాయి. అలా రష్యా-యుక్రెయిన్ యుద్ధం మొదలైందో లేదో, ఇలా అదానీ విల్మర్ సంస్థ షేర్లు పెరగడం ప్రారంభమైంది. రెండు నెలల కాలంలో ఆ సంస్థ షేర్ ధర మూడు రెట్ల కంటే ఎక్కువ పెరిగింది. 2022 ఫిబ్రవరిలో రూ. 221 నుంచి ఏప్రిల్ చివర్లో రూ. 764 వెళ్లింది. ఇక అక్కడి నుంచి వెనక్కి చూసుకులేదు. దేశంలోనే అతి పెద్ద రీటెయిల్ ఆయిల్ బ్రాండ్‌గా ఎదిగింది అదానీ విల్మర్ గ్రూపు.

'గతేడాది మార్చి నెలలో రష్యా-యుక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. భారతీయ దిగుమతులపై ప్రభావం పడింది. అధిక ధర పెట్టి సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను భారతదేశం దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఇదే అదనుగా ఈ వ్యాపారంలో ఉన్న అదానీ స్టాక్ ఏకంగా 40 శాతం పెరిగింది. మార్చిలో స్టాక్ వరుసగా తొమ్మిది రోజులపాటు 5 శాతం అప్పర్ సీలింగ్ దగ్గర లాక్ అయింది' అని నాగేంద్రసాయి వివరించారు. అయితే రష్యా-యుక్రెయిన్ యుద్ధానికంటే ముందు నుంచీ, దాదాపు నాలుగేళ్లుగా వంట నూనెల ధరలు బాగా పెరిగాయి. ఆ పెరుగుదల అదానీ గ్రూపుకు బాగా ఉపయోగపడింది.

## ఫుడ్ మార్కెటే తదుపరి టార్గెట్

నూనెల్లో టాప్‌లో ఉన్న అదానీ గ్రూపు ఇప్పుడు పప్పులు, బియ్యం, గోధుమలు, పంచదార, శనగపిండి, రవ్వలపై ఫోకస్ పెట్టబోతోంది. ఆ రంగంలో పెద్ద ప్లానే వేసింది. ఓడ రేవులు, రవాణా, వ్యవసాయాధారిత పరిశ్రమలు, కరెంటు, రియల్ ఎస్టేట్, ఫైనాన్షియల్ సేవలు, రక్షణ రంగంతో సమానంగా ఫుడ్ రంగంపై దృష్టి పెట్టింది. బ్రాండెడ్ బియ్యం అంటే చాలా మంది కేవలం బాస్మతియే అంటారు. నాన్ బాస్మతి బియ్యంలో పెద్దగా జాతీయ స్థాయి ఫేమస్ బ్రాండ్ బియ్యం అంటూ లేవు. కానీ ఆ నాన్ బాస్మతిలో బ్రాండెడ్ బియ్యం అమ్మడం మొదలుపెట్టింది అదానీ గ్రూపు. రీజినల్ బ్రాండ్ బియ్యం అమ్మే మొదటి జాతీయ ఫుడ్ బ్రాండ్‌గా అవతరించింది.

ఇప్పటికే బెంగాల్‌లో ఫార్చ్యూన్ బ్రాండ్ రైస్ విడుదల చేసింది అదానీ గ్రూపు. సాధారణంగా బియ్యం, గోధుమలు వంటివి దేశమంతా ఒకే వెరైటీ తినరు. ప్రాంతాన్ని బట్టి ఆసక్తి మారిపోతుంది. కానీ పెద్ద బ్రాండ్లు దేశమంతా ఒకే వెరైటీ అమ్ముతాయి. సరిగ్గా ఈ పాయింట్ పట్టుకుంది అదానీ గ్రూపు. ఏ రాష్ట్రం, ఏ ప్రాంతంలో ఏ వెరైటీ ఎక్కువ తింటారో, ఆ వెరైటీ అమ్మేలా ప్లాన్ చేస్తోంది. బెంగాల్ నుంచే ఈ ప్రయోగం మొదలైంది. అందుకోసం ఇప్పటికే బెంగాల్‌లో రైస్ మిల్లుల కొనుగోలు మొదలుపెట్టింది.

'ప్రస్తుతం బ్రాండెడ్ చపాతి పిండి మార్కెట్లో అదానీ విల్మర్‌కు 3.4 శాతం వాటా ఉంది. బియ్యం మార్కెట్లో అదానీ వాటా 8 శాతం' అన్నారు నాగేంద్ర సాయి. 'నూనెల నుంచి మొదలై ఫుడ్‌లోకి వచ్చారు. అంత పెద్ద వైవిధ్య వ్యాపారాలున్న సంస్థలు తాము వ్యాపారం చేస్తోన్న అన్ని రంగాల్లోనూ నంబర్ వన్‌గా ఉండటం చాలా అరుదైన విషయం. అదంత సులువు కాదు' అని సీఐఐ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ చైర్మన్ వినాయక ఛటర్జీ ఒక ఇంటర్వ్యూలో అన్నారు. ❑

# పూనకాల అంటు వ్యాధి



- డాక్టర్ నంబూరి చంద్రశేఖర్, డాక్టర్ విరించి విరివింటి

**ప్రపంచంలో భక్తి సినిమాలు అధికంగా వచ్చే దేశం భారత దేశమే. యూరోప్, అమెరికాలలో కూడా భక్తి సినిమాలు వస్తాయి. కానీ మనంతగా రావు. మనదేశానికున్న మతమూ, సంస్కృతి సాంప్రదాయంతోపాటు మన దగ్గర జరిగిన భక్తి ఉద్యమాలు సగటు భారతీయులలో దేవుడి పట్ల ప్రేమను, భక్తినీ మనలో కలిగిస్తుంటాయి. అందుకే భక్తి అంశంతో సినిమాలు తీసి నష్ట పోవడమనేది ఉండదు. వీటిని ఎలా తీసి రక్తి కట్టించాలో మనకు మాత్రమే తెలిసిన విద్య. వీటికి టార్గెట్ ఆడియన్స్ ఉంటారు. ఎవరి కోసం ఉద్దేశించి తీయాలో మేకర్స్ కి తెలుసు కాబట్టి ఆయా ప్రేక్షకులకు తగినట్టు తీయడం జరుగుతుంది.**



నాగుపాము అంశం చుట్టూ వేల సంఖ్యలో సినిమాలు వచ్చి వుంటాయి మన దేశంలో. తెలుగులో కూడా అవి ఒక ఉద్యమం లాగా వస్తుంటాయి. సాధారణ స్త్రీలు వీటిలో టార్గెటెడ్ ఆడియన్స్. అత్తమామల సాధింపులు, ఇంటింటి రామాయణాలు, ఇల్లాలి కష్టాల చుట్టూ కథ తిరుగుతూ ఉంటుంది. చూడండి ఎంత కామన్ సబ్జెక్టును తీసుకున్నారో. అందుకే ఇవి భలే అప్పీలింగ్‌గా స్త్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఇప్పటికీ వీటికి ఆదరణ అలాగే ఉంది. అంటే, ఈ రోజుకీ కుటుంబ విలువల్లో, సంబంధ బాంధవ్యాలలో కట్న కానుకాది సాధింపులల్లో మన సమాజంలో పెద్దగా మార్పులు రాలేదని అర్థం.

ముఖ్యంగా ఈ సినిమాలు చూసి పూనకాలు వచ్చేలా చేయడంపై మేకర్స్ దృష్టి పెడతారు. కొన్ని సీన్లలో దేవుడి దర్శనం జరగడం వంటివి, ఆ సమయంలో వచ్చే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ వీక్షకులను ఉద్రేకులను చేస్తుంటాయి. ఉద్రేకం ఊగి పోయేంతగా తీసికెళ్ళి పూనకాలు వచ్చేలా చేయగలగడం ఎలా అన్నది మేకర్స్ ముందున్న ఛాలెంజ్. కోడి రామకృష్ణ, వాసు, రాఘవేంద్రరావు వంటి ఉద్దండ దర్శకులు ఎవరి రీతిలో వారు ప్రేక్షకులకు పూనకాలు తెప్పించారు. పూనకాల గురించి కార్ల్ యూంగ్ చాలా రాశారు.

మనిషిలోని ఇల్లాజికల్ ఎమోషనల్ పార్శ్వాన్ని గ్రీకులు కూడా అర్థం చేసుకున్నారని, రిచర్డ్ వాగ్నర్ చేసిన సంగీతం ఇటువంటి భావోద్వేగాలను రెచ్చగొట్టేదని అంటాడు నీషే. ఇటువంటి సినిమాలు వాటిలో జరిగే పూనకాలూ మన దేశంలో మాత్రమే కాదు, వివిధ దేశాల్లో జరిగాయని మనకు డేటా వుంది. మన దేశంలో సరైన స్టడీస్ జరగలేదు కానీ దగ్గరగా పరిశీలించిన వారు లేకపోలేదు. కుటుంబపరంగా ఆర్థిక సామాజిక ఒత్తిడికి లోనవుతున్నవారికి పూనకాలు సర్వసాధారణంగా రావడం కనిపిస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే నేల టికెట్, బెంచీ టికెట్ వారికి వచ్చే పూనకాలు కుర్చీ, బాల్కనీ టికెట్ వారికి రావడం లేదు. రావు అని కాదు. సంఖ్యా పరంగా చూస్తే నేల టికెట్‌లో ఉన్నవారికి, సి క్లాస్ థియేటర్లలోనూ ఇవి ఎక్కువగా కనిపిస్తుంటాయి. బాల్కనీలో ఉండే వీరాభిమానికి ఎపుడూ పూనకం వచ్చి ఊగిపోవడం రాదు. కానీ, అతడు నేల టికెట్‌లో ఉండే అభిమాని పూనకంతో ఊగిపోవడాన్ని ఆమోదిస్తు గొప్పగా చెప్పుకోవడం కనిపిస్తూ ఉంటుంది. ఇదొక అంటువ్యాధిలా జరుగుతుంది. ఒకరిని చూసి మరొకరికి రావడం. సూక్ష్మ క్రిముల ద్వారా జబ్బు ఒకరి నుండి ఒకరికి పాకినట్టు (contagium vivum) పూనకం అనేది సజెషన్ ద్వారా ఒకరి నుండి మరొకరికి పాకుతుంది (contagium psychicum) అంటాడు పూనకాల మీద విస్తృతంగా స్టడీ చేసిన బెక్తెరేవ్ అనే రష్యన్ న్యూరాలజిస్టు. (Suggestion and its role in social life by V.M. Bekhterev) వీటికి ఆమోదం దొరకడం నిజానికి విషాదం. సినిమా ద్వారా ఆమోదం దొరకడం మరింత విషాదం. "అసలా సినిమా చూస్తే నాకైతే పూనకం వచ్చేసింది" అని చెప్పుకోవడం చూస్తుంటాం. నిజానికి సినిమా ఫీవర్ వంటిదొకటి ఆవహించి అందరూ గొప్పగా వుందని చెప్పుకుంటున్న తరుణంలో ఒక

sense of groupings వంటిదేదో వచ్చి అబ్బా నాకు కూడా తెగ నచ్చేసిందని చెప్పుకోవడం వంటిది ఇది. సర్వ సాధారణ మైనదే. కానీ నిజంగా పూనకం రావడమనేది వ్యక్తి అస్థిరమైన మానసిక స్థితి కదా!. దీనికెందుకు ఆమోదం తెలపాలి ?

Rtc x roadsలో సినిమా చూస్తే వచ్చే కిక్కు ప్రసాద్ ఐమాక్స్ లో క్లాస్ ఆడియన్స్ మధ్యన చూస్తే రాదనే వారు కోకొల్లలు. వాళ్ళు స్వతహాగా పేపర్లను చింపి గాలిలో వేయరుగానీ అభిమాన హీరో సినిమా అలా అల్లరి చేసి పూనకాలు తెప్పించేచోటే చూడాలని అనుకుంటారు. ఇది కంటాజియమ్ సైకికంకి మంచి ఉదాహరణ. ఆ సినిమాలో ముందు వరుసలో ఇద్దరు ముగ్గురికి పూనకం వచ్చేసింది. జడలు విరబోసుకుని అరవడం మొదలెట్టారు తెలుసా ? అని సాగతీసి చెప్పడంలో సినిమా ఎంతో బాగుందని ఉబ్బిపోతూ చెప్పడం ఉంది. కానీ నిజానికి ఆ సినిమా సున్నితమైన నిలకడలేనీ లేదా సామాజికార్థిక బలం లేని కొందరిని తమలోపల ఉన్న స్థితిని బయటకు పడవేసిందని తెలుసుకోవడం అవసరం. సినిమా ప్రమోటర్స్ ఇలా పూనకాలు రావడం చాలా గొప్ప విషయం అన్నట్టు ప్రచారం చేసుకోవడం దానిని మరింత పెంచి పోషించినట్టు ఔతుందా ? కాదా? హీరో వీర ఫ్యాన్స్ కూడా మా హీరో సినిమా చూస్తే మీకు ఇంక పూనకాలే అని గర్వంగా చెప్పుకోవడం ఒక అన్ బాలెన్స్ మానసిక స్థితికి ఆమోదం తెలపడమే. పిచ్చితనాన్ని స్వాగతించడమే కదా. ఇలాంటి వల్నరబుల్ ప్రజానీకాన్ని తయారు చేయడం, వారి మానసిక స్థితులను exploit చేసి డబ్బు సంపాదించడం అన్నది ఏ రకంగాను ఎంకరేజ్ చేయవలసిన అంశం కాదు. ఐతే కేవలం సినిమా వరకే కాక క్రికెట్, రాజకీయాలకు కూడా ఈ పూనకాల వ్యాప్తి జరుగుతోంది. అభిమానం ఉండడం వేరు. ఆ అభిమానం పూనకంగా మారడం వేరు. కంటికి కనిపించని సూక్ష్మ జీవుల్లాగే వార్తలు వండి వార్చి జనాల మీదకు వదలడం వాటి బారిన పడి మానసిక సమతౌల్యతను కోల్పోయి ఊగి పోవడం ప్రస్తుతం మనం చూస్తున్న చిత్రం. ఈ పిచ్చితనానికి విస్తృత జనామోదం దొరకడమే శోచనీయాంశం. ❑

---

# ఏకాకి గొంతును రికార్డు చేయనివ్వండి

**(19వ పేజీ తరువాయి)**

మతం ఏంటి అని చూస్తున్నారు. క్రిస్టియనో, ముస్లిమో అయితే కొందరు హిందువులు ద్వేషిస్తున్నారు. నుదుటున కుంకం బొట్టు పెట్టుకున్న ఫ్రెండ్‌ను చూస్తే ముస్లిం లేదా క్రిస్టియన్ ఉలిక్కిపడుతున్నారు. మన ఫ్రెండ్స్‌లో ఆ అభద్రతకు కారణం ఎవరు? అంత అవసరం ఏంటి? పోనీ ఆలయాలకు ఏం చేశారు? అయోధ్యలోని రామ మందిరమే కాదు అంతే విశిష్ఠత ఉన్న కడప జిల్లా ఒంటిమిట్ట రామాలయం ఉంది. భద్రాద్రి రాముల వారి ఆలయం ఉంది. వాటికి ఏం చేశారు ? ఏమీ లేదు.. ఒక్క టెంపుల్ చూపించి దేశంలోని మొత్తం దేవాలయాలను నిర్వీర్యం చేస్తున్నది ఎవరు ? ఈ రోజు అందరికంటే దయనీయ పరిస్థితి సగటు సామాన్య హిందువులది. గతంలో ప్రభుత్వాలపై కోపమొస్తే గట్టిగా రోడ్లపైకి వచ్చి నిలదీసేవాళ్లు.

కానీ ఇప్పుడు ఎవరైనా కడుపు కాలి నోరెత్తితే.. హిందువై ఉండి హిందువుల్ని ప్రశ్నిస్తావా నువ్వు దేశద్రోహివీ, హిందూ ద్రోహివీ.. నీ మొగుడు/పెళ్లాం ముస్లిమా, నువ్వు కన్వర్టెడ్ క్రిస్టియనా అంటున్నారు.. సామాన్య యువత(బడా బాబుల పిల్లలు కాదు) మెదళ్లు ఈ రోజు గొప్ప భవిష్యత్తు గురించో, శాస్త్రీయ దృక్పథం వైపో లేవు. కేవలం తాము నమ్మిన మతాన్ని తమను రెచ్చగొడుతున్న మతాన్ని డిఫెండే చేసే స్థాయికి పడిపోయాయి. ఇన్ని కోట్ల మెదళ్లు మతం చుట్టూ ఉన్నప్పుడు నా లాంటి ఒక్కరో ఇద్దరో ఇలా చేస్తున్న మతోన్మాద పార్టీలను ప్రశ్నిస్తే మీకు చాలా కష్టం కలుగుతోంది. నాకు తెలుసు నాది ప్రమాదకరమైన ప్రయాణం.. ఎప్పుడో ఏ అమాయక యువకుడో నా మీద తను ప్రేమించే పార్టీ నింపిన విద్వేషాన్ని కత్తిగానో బుల్లెట్టుగానో మార్చి దాడి చేస్తాడని.. అలాగని కోట్లాది మంది యువత కళ్ల ముందు మతం మత్తులోకి జారుకుంటూ ఉంటే నేను చూస్తూ ఉండలేకనే నా పరిధిలో నేను చెప్పాల్సినవి చెప్తున్నాను. మత విద్వేషాలు మాత్రమే ఏ దేశ యువతకైనా అత్యంత ప్రమాదకరం అని నేను చెప్తున్నందుకు నన్ను ద్వేషిస్తున్నారు. బూతులు తిడుతున్నారు. నా ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారు ఇష్టమొచ్చినట్లు మాట్లాడు తున్నారు. కానివ్వండి. నన్ను డిఫెండ్ చేయడానికి ఏ పార్టీ ముందుకు రాదు. నేను ఏ పార్టీ మద్దతుదారూ కాదు కాబట్టి. ఏ కుల సంఘమూ రాదు.. నా కులమేంటో ఎవరికీ తెలీదు కాబట్టి. ఏ గ్రూపూ నా కోసం నిలబడదు. నాకు ప్రభుత్వం ఇచ్చే జర్నలిస్టు గుర్తింపు కార్డు సహా ఏ గుర్తింపూ లేదు కాబట్టి. ఇలా ఒకరిద్దరికి నాకు తోచినప్పుడు వివరణ ఇవ్వడం కంటే ఇంకేమీ చెయ్యలేని అశక్తురాలిని. ఏదో ఒక రోజు రాలిపోతాను, బలైపోతాను. నా బిడ్డలకు, భర్తకూ అన్యాయం చేసిన దానిని అవుతాను. నేను తప్ప ఈ లోకంలో ఎవరూ లేని నా తల్లికి అన్యాయం చేసినదానిని అవుతాను. కానివ్వండి. అలా అయ్యేలోపు కనీసం నా ఆవేదనను, ఏకాకి గొంతును రికార్డు చేయనివ్వండి. ❑

# ప్రగతి అవరోధకము.. మూఢ నమ్మకము



- డాక్టర్ సి.వి.సర్వేశ్వరశర్మ

**అనాగరికుడై ఆదిమ మానవునిగా జీవితాన్ని ప్రారంభించి తన అస్థికత్వాన్ని నిలుపుకుంటూ నేటి ఆధునిక యుగంలో తన ఉనికిని మరింత ప్రస్ఫుటం చేస్తున్న మానవుడు సాధించిన విజయాలు అసంఖ్యాకం. నిత్యాన్వేషి, నిరంత పరిశోధకుడిగా ప్రపంచాన్ని అధ్యయనం చేయడమే కాక ఈ విశ్వాంతరాళాన్ని శోధించి, భూగర్భ రహస్యాలను పసిగట్టి తన మేధా సంపత్తిని వినియోగిస్తూ ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాడు. చావును జయించడం తప్ప అన్నింటా నెగ్గగలడన్న నానుడికి చక్కని భాష్యం చెప్పాడు. కాని, మనిషి జయించలేని మరొక ప్రగతి అవరోధకము 'మూఢ నమ్మకాలు'.**

ఈ మూఢ నమ్మకాలు పల్లెల్లోను, నిరక్షరాస్యులలోను ఎక్కువ గా ఉన్నాయని చాలామంది అభిప్రాయం. నిజానికి పట్టణాలలో ను, అక్షరాస్యులలోను మరీ ఎక్కువగా ఈ మూఢ నమ్మకాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రచారం చేస్తూ మరికొంత మంది ప్రజలను వీటి ముసుగులోకి లాగేస్తున్నారు. కొన్ని ప్రచార సాధ నాలు తెలిసో తెలియకో వీటిని ప్రచారం చేసేస్తున్నాయి. కొన్ని సినిమాలు, నవలలు, కథలు, దెయ్యాలు భూతాలు, పిశాచాలు, పూనకాలు వంటి అంశాలకు చోటిచ్చి ప్రజలకు వాటిపై నమ్మకం ఏర్పడేటట్లు దోహదం చేస్తున్నాయి.

## శాస్త్రీయ ధోరణులు

సరైన శాస్త్రీయ ధోరణులు మనుషులకు అలవరిస్తే మూఢ నమ్మకాలలో మునిగిపోకుండా భయాన్ని పక్కకునెట్టి ధైర్యంగా ముందుకు సాగుతారు. మనిషి మస్తిష్కంలో ఉదయించే కొన్ని ప్రశ్నలు వారిలోనే నిక్షిప్తమై పోవడం, సహజ సిద్ధంగా ఉండే వారిలోని సిగ్గు, భయం, నిరక్షరాస్యత వారి ప్రశ్నలను అంతర్గ తంగానే చంపివేయడం ఈ మూఢనమ్మకాల విస్తరణకు మరో కారణం. మనందరి జీవితాల్లోనూ మూఢనమ్మకాలు ఒక ముఖ్య భూమికను నిర్వహిస్తున్నాయని మనకు తెలుసు. అయితే ఇది ఏ రకమైనది, అది నిర్వహించే పాత్ర ఏమిటో మన ఎరుకలో ఉండకపోవచ్చు. కర్మకాండ, నమ్మకాలు, ఆచారాలు, వ్యక్తిగత విలువలు వంటి వేరు వేరు పేర్లతో మన జీవితంలో ఈ మూఢ నమ్మకాలు చోటు చేసుకుంటున్నాయి. అతీత శక్తులు ఉన్నాయని నమ్మేవారు, అహేతుకమైన భయాన్ని పొందేవారు తగిన ఆధారం లేకపోయినా విషయాలను నమ్మేవారు సులువుగా మూఢ నమ్మకాలకు తల వంచుతారు. మూఢ నమ్మకాలనేవి ఒక మతానికి, సంస్కృతికి పరిమితమైనవి కావు. మాన సమాజాలన్నింటిలోను ఇవి విస్తృతంగా వ్యాపించి ఉన్నాయి. మూఢ నమ్మకాలను పాటించడం అనేది మతాన్ని బట్టి, సంస్కృతిని బట్టి, వ్యక్తిని బట్టి మారిపోతూ ఉంటాయి. మత, సాంస్కృతిక మూఢ నమ్మకాలు మొత్తం ఆ సమాజం పాటిస్తుంది. కాబట్టి అవి పరిశోధనకు అందుబాటులో ఉంటాయి. వ్యక్తిగత మూఢ నమ్మకాలు అధ్యయనానికి గాని, అర్థం చేసుకునేందుకు గాని వీలుగా ఉండవు.

## తుమ్మడంపై మూఢ నమ్మకాలు

- ప్రపంచం మొత్తం మీద వేరు వేరు ప్రాంతాలలో తుమ్మడం మీద రకరకాలైన మూఢ నమ్మకాలు ఉన్నాయి. తుమ్మడం అనేది ప్రపంచంలో ఎవరికైనా, ఎక్కడైనా సంభవిస్తుంది. దీనికి శుభాశుభాలు తమాషాగా అంటగడుతూ ఉంటారు.
- తుమ్మడం వల్ల ఆ మనిషి ఆత్మ కలత చెందుతుందని నమ్మేవారు ఉన్నారు. అందుకే తుమ్మిన వ్యక్తిని 'చిరంజీవ' అని ఆశీర్వదిస్తూ కలత చెందిన ఆత్మ దాని యథాస్థానం లోకి రావాల్సిందిగా దీవిస్తారు.
- కొంతమంది తుమ్మును, జరిగిన ప్రదేశాన్ని బట్టి సమయాన్ని బట్టి మంచి శకునంగానో, చెడ్డ శకునంగానో పరిగణిస్తారు. ఏ రోజున తుమ్మడం జరిగిందో లెక్కలోకి తీసుకుంటారు.
- సోమవారం తుమ్మితే.. ప్రమాద సంకేతంగా తుమ్మినట్లు,
- మంగళవారం తుమ్మితే.. అగంతకుడిని ముద్దాడతారని,
- బుధవారం తుమ్మితే.. ఉత్తరం వస్తుందని,
- గురువారం తుమ్మితే.. ఏదో మంచి జరుగుతుందని,
- శుక్రవారం తుమ్మితే.. ఏదో చెడ్డ జరుగుతుందని,
- శనివారం తుమ్మితే.. నేస్తం కోసమని,
- ఆదివారం తుమ్మితే.. క్షేమదాయం కాదని.. మొత్తం వారం అంతా దీని ప్రభావం ఉంటుందని తేల్చారు.

వైద్య విజ్ఞానం అనుసరించి ముక్కులో ఏదైనా పరాయి

వస్తువు ప్రవేశిస్తే దానిని బయటకు తొలగించేందుకు శరీర రక్షక వ్యవస్థ చర్య తుమ్ము అని మనకు తెలుసు. అయినప్పటికీ పాత మూఢ నమ్మకాన్ని మనం విశ్వసిస్తాం. ప్రశ్నించుకునే ధోరణి మనం అలవరచుకోలేదు. వైద్య విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, ప్రజలను ఈ దిశలో ఎంత విజ్ఞానవంతుల్ని చేస్తున్నా ఇంకా ప్రజల్లో కొన్ని మూఢ నమ్మకాల కారణంగా కొన్ని రోగాలను ముదరనిచ్చి ప్రాణాపాయ స్థితికి ఆరోగులను తీసుకువస్తున్నారు.

### ఒక విచిత్ర సంఘటన

ఆయన ఒక పట్టణంలో పెద్ద డాక్టర్. ఎటువంటి రోగాలకైనా వైద్యం చేయగల సిద్ధహస్తుడని పేరు తెచ్చుకున్నాడు. అనేక వేదికలపై ఆయన ఉపన్యాసాలు ఇచ్చారు. మూఢ నమ్మకాలతో రోగాలకు కారణాలు తాము చేసిన పొరపాట్లకు ముత్యాలమ్మో, పోలేరమ్మో ఆగ్రహించడం వల్ల వస్తున్నాయని భావించి ఆ రోగులను వైద్యుడి దగ్గరకు తీసుకుని వెళ్లకుండా మేకలు, గొర్రెలు వంటి జంతువులను బలిచ్చి, జాతరలు జరుపుతామని, కొలువులు కొలుస్తామని మొక్కడం సరికాదని ఎన్నో ఉదాహరణలతో జనంలో ప్రచారం చేసేవాడు ఆయన. ఒకసారి ఆ వైద్యుడికే కామెర్లు వచ్చాయి. అది ముదరడంతో భయపడి ఆయన కుటుంబ సభ్యులు ఆయన చేతి మీద కాల్పించి, పసరు వైద్యం చేయించేశారు. మూఢ నమ్మకాలపై ప్రచారం చేసిన వైద్యుడు అదే బాటలో వైద్యం చేయించుకోవడం ఒక హాస్యాస్పద సంఘటనగా చెప్పుకున్నారు. ఇటువంటి సందర్భాలు మూఢ నమ్మకాల వ్యాప్తికి తోడవుతాయి.

### ప్రజల్లో చైతన్యం తీసుకొద్దామని..

ఒక పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు సాయంత్రం స్కూలు గంటలు ముగిశాక, హెడ్ మాస్టారును కలిశారు. మనం మన విజ్ఞానం కేవలం తరగతి గదిలోని విద్యార్థులకు మాత్రమే పరిచయం చేసుకుంటున్నాం. ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు మూఢ నమ్మకాల ముసుగులో వారు నలిగి పోకుండా ఉండేందుకు మనం కృషి చేద్దాం అని కొంత మంది ఉపాధ్యాయులు హెడ్ మాస్టారుకు చెప్పారు.

మంచి ఆలోచన తప్పకుండా చేద్దాం అన్నారు.

ఇంతలో గోడ గడియారం ఐదు గంటలు కొట్టింది..

చూశారా ! గంట కొట్టింది. మనం చేపట్టబోయే కార్యక్రమం జయప్రదం అవుతుంది అని ఒక ఉపాధ్యాయుడు అనేశాడు.

ఇంతలో మరో ఉపాధ్యాయుడు మనం ఉద్యమం ప్రారంభించేందుకు ముహూర్తం పెట్టమంటారా ? అని అడిగారు. ఇటువంటి సమాజంలో తమ ఉద్యమం ఎంత వరకు ముందుకు వెళుతుంది. అని మిగిలిన వారు వాపోయారు.

దురదృష్టం ఏమిటంటే పాపకర్మల ఫలితంగా రోగాలు వస్తాయని, ఆ రోగాలు నయం కావడానికి తమ శక్తినంతా పూజలు, పునస్కారాలు చేయడానికి వినియోగిస్తారు. వైద్య సహాయం కోసం ప్రయత్నించనివారు ఇంకా చాలా మంది ఉండడం మనకు ఎంతో బాధ కలిగిస్తుంది.

అంటు వ్యాధులు సూక్ష్మ జీవులు, వైరస్ వంటి వాటి వల్ల వస్తాయి. దగ్గడం, తుమ్మడం వంటి రోగి చేష్టల వల్ల చుట్టుపక్కల వారికి వ్యాప్తి చెందుతాయి.

హిస్టీరియా, ఫిట్సు, చలి జ్వరం వంటి రోగాలతో రోగి వణుకుతూ ఉంటే రోగికి దయ్యం పట్టిందని, భూత వైద్యుడిని పిలిపించి వారి మెడలో మంత్రపు తాళ్లు వేయించి, చీపురు కట్టతో రోగిని రకరకాలుగా హింసకు గురి చేస్తూ ఉంటారు.

### మరికొన్ని మూఢ నమ్మకాలు

చిన్న పిల్లలకు ఆహారం సులువుగా జీర్ణమవుతుందని కొంత మంది వారి పొట్టల మీద సూదులతో కాలుస్తారు. సూదుల వల్ల గాయాలు ఏర్పడి చీముపట్టి ఆ పిల్లలను కొంత కాలం బాధి స్తాయి తప్ప జీర్ణశక్తిని ఏమాత్రం పెంచవు. పొగాకు చుట్ట తాగితే ఆస్మా తగ్గుతుందని మూఢ నమ్మకం చాలా మందిలో కనిపిస్తుంది. ఈ చుట్ట పొగ తాగడం వల్ల ఉబ్బసం తగ్గడం మాట అటుంచి మరింత అధికమవుతుంది. ఎటువంటి పొగైనా ఊపిరి తిత్తుల్లోకి వెళితే ప్రమాదకరం. తమ ఆరాధ్య దైవాలను వింత వింత రీతుల్లో పూజించి తన్మయత్వంలో అనిర్వచనీయ మైన ఆనందాన్ని పొందే భక్తులను కూడా మనం చూస్తూ ఉంటాము. వింటూ ఉంటాము. ఇతరులకు ఇబ్బంది లేకుండా తమ మతపర లక్ష్యాలను సాధించుకోవాలని అన్ని మతాలు చాటి చెబుతున్నాయి. కాని, విభిన్న మతాలు, పలు భాషలు గల నేటి సమాజంలోని భక్తులు ముక్తి కోసం అనుసరిస్తున్న కొన్ని మార్గాలు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి.

### నగ్న పూజలు

నగ్న పూజలు, చిత్రమైన ప్రదర్శనలు, కానుకల సమర్పణ క్షుద్ర దేవతారాధన వెర్రి తలలు వేసి కొత్త కొత్త సమస్యలు అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు తెచ్చి పెడుతున్నాయి. ఉదాహరణకు కర్ణాటకలో షిమోగా జిల్లాలోని చంద్రగుత్తికి చెందిన రేణుకాదేవి అనే ఆమెను అచటి ప్రజలు దేవతగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం ఆమె పేరిట ఉత్సవాలు చేస్తారు. ఆ ఉత్సవంలో ఆమెను భక్తులు నగ్నంగా ఆరాధిస్తారు. ఈ దుష్ట సంప్రదాయాన్ని నిరోధించడానికి ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఆ ప్రాంతానికి వెళ్లే భక్తులు దృక్పథంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నించిన ప్రభుత్వ సిబ్బందిని, సాంఘిక కార్యకర్తలను తమ పూజా


కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తున్నందుకు విచక్షణారహితంగా భక్తులు కొట్టారు. అంతేకాదు భక్తులు ఒక పోలీసు ఉన్నతాధికారిని, మరికొందరు పోలీసులను బలవంతంగా నగ్నంగా తయారు చేసి తమ పూజా విధానంలోకి దించారు. తర్వాత ఈ పూజా కార్యక్రమాలను నిరోధించడంలో ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు విజయం సాధించాయి. ఇప్పుడు కర్ణాటకలో నగ్న పూజలు నిషేధం. కర్నాటకలోని గుల్బర్గాలో ఒక భక్తుడు తన చర్మంతో పాదరక్షలు కుట్టించి సంగమేశ్వరుడికి 1988 జనవరిలో కానుకగా సమర్పించి ఘటన దేశవ్యాప్తంగా ఎంతో సంచలనాన్ని కలిగించింది.


ఒకసారి మూఢ నమ్మకం మనసుల్లో సిర్థరపడిందంటే దాని నుంచి వారిని బయటకు తీసుకురావడం కష్టమవుతుంది. పైగా అది బహువ్యాప్త చెందుతుంది. సైన్సు చైతన్యవంతమైనది. ప్రకృతికి సంబంధించి నూతన విజ్ఞానం కోసం, కొత్త పరిజ్ఞానం కోసం నవీన సూత్రాల కోసం నిరంతర పరిశోధన జరుగుతూ ఉంటుంది. వీటిని కలపడం వల్ల విజ్ఞానపు ఖచ్చితత్త్వం సొగసు మరింత అధికమవుతాయి. సమాజ ఉద్భవంతో సాంఘిక సందర్భాలు, విషయాలు ప్రత్యక్షంగాను, అప్రత్యక్షంగాను మారుతూ ఉంటాయి. ఈ మార్పు సమాజానికి చేరిన కొత్త విజ్ఞానం మీద ఆధారపడి ఉంటుంది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం రకరకాల సాంఘిక ప్రక్రియల ద్వారా సమాజానికి చేరాలి. శాస్త్ర వేత్తలు సమాజానికి రెండు రకాలుగా సహాయపడవలసి ఉంది. బాగా పాతుకుపోయిన మూఢ నమ్మకాలను శాస్త్ర పరిశోధనతో పరీక్షించాలి. వారు తెలుసుకున్న నిజాలను ప్రజల్లోకి బాగా వ్యాప్తి చెందించాలి. శాస్త్ర పరిశోధనలో కార్యాకారణ సంబంధం నిస్పాక్షిక నిర్ణయాలు ఉంటాయి. కాబట్టి ప్రజలకు వారి మూఢ నమ్మకాలలోని లోటుపాట్లను చక్కగా వివరించి చెప్పాలి. ప్రజలు తమ నమ్మిలోని తప్పును గ్రహించాల్సిన విధంగా వారిని విద్యా వంతులను చేయాలి.

శాస్త్రవేత్త చెప్పదలచుకున్న పరిశోధనా విషయాలను ప్రజల భాషలో ప్రజలకు అర్థమయ్యేటట్లు చెప్పాలి. సైన్స్ విజ్ఞానాన్ని జన విజ్ఞానంగా చెప్పడం ఎంతైనా అవసరం. ❑

## కొత్త పుస్తకాలు స్వీకారం



# ఇక విజ్ఞానశాస్త్రాల పుస్తకాల మార్పే మిగిలింది!

(తెలుగు: ఎన్.వేణుగోపాల్)

- సంపత్



**ది హిందూ దినపత్రిక ఆదివారం అనుబంధంలో సోషల్ అఫైర్స్ ఎడిటర్ జి.సంపత్ రాసే వ్యంగ్య శీర్షిక అలెజ్డ్లీ నా అభిమాన శీర్షిక. ప్రతిసారీ అది మిత్రులతో పంచుకోవాలనిపిస్తుంది గాని కాపీరైట్ ఆటంకాలెన్నో ఉన్నాయి. అయినా ఈసారి పంచుకోకుండా ఉండలేకపోయాను.**

మార్పులు చేసిన ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలు చూశారా? అవి అద్భుతంగా ఉన్నాయి. మొఘల్స్ (మీకు హొటళ్లలో మొఘలాయి చికెన్ అనే ఆహారపదార్థం దొరుకుతున్నంత మాత్రాన చరిత్రలో ఎప్పుడో మొఘలాయీలు అనబడే మనుషులు ఉన్నట్టు కాదు), 2002 గుజరాత్ మారణకాండ (అది ఒక మిథ్య, వ్యోమాంతర జీవులు మెరుగైన జీవితం వెతుక్కుంటూ అమెరికాకు వస్తున్నారనేటటువంటిది), నిరసన ఉద్యమాలు (పిల్లలకు 'గోలీ మార్' వంటి జాతీయ గీతాలు నేర్పించడం మంచిది) లాంటి పనికిరాని చెత్త అధ్యాయాలన్నిటినీ తుడిచి పారేసే మహత్తరమైన కార్యాన్ని అవి పరిపూర్తి చేశాయి.

ఏది ఏమైనప్పటికీ, ప్రజాస్వామ్యం, సమానత్వం, గాంధీ హత్యకు దారితీసిన పరిస్థితులు లాంటి భాగాలు తీసేసినందుకు అతి చదువులు చదువుకున్న మేధావులు కొందరు గగ్గోలు పెట్టడం దిగ్భ్రాంతికరం. అసలు వీళ్ళు పాఠశాల విద్యా లక్ష్యం ఏమిటో మరిచిపోయినట్టున్నారు. మన పాఠశాల విద్యా లక్ష్యం ప్రతి శిశువునూ జెఎన్‌యు విద్యార్థిగా మార్చడమైతే కచ్చితంగా కాదు. ఈ పాఠ్య పుస్తకాల హేతుబద్ధీకరణ వెనుక ఉన్న ఆలోచన ఏమిటని ఒక విద్యా మంత్రిత్వ శాఖ అధికారిని అడిగే అవకాశం నాకు వచ్చింది. "చూడండి. చాలా ప్రజాస్వామ్యాలు అసమగ్రమైనవి. వాటి నాయకులు ప్రమాణాలకు తగినవారు కారు. అందువల్ల ఆ దేశాలలో పిల్లలకు ప్రజాస్వామిక హక్కులు, వగైరాల గురించి నేర్పవలసివస్తుంది. వాళ్ళ ప్రభుత్వాలు పెద్ద నోట్ల రద్దు, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు లాంటి పిచ్చి పనులు చేసినప్పుడు వాళ్ళు ప్రశ్నించే అవకాశం వస్తుంది. కాని భారతదేశం అలా కాదు గదా. ఇది ప్రజాస్వామ్యానికి కన్నతల్లి. ఇక్కడ పౌరులకు ఒకే ఒక్క పని ఉంటుంది : అది ప్రభుత్వానికి విధేయంగా ఉండడం" అన్నాడాయన.

"ఇప్పటికే చట్టానికి విధేయంగా ఉండమని ప్రతి ఒక్కరికీ నేర్పుతున్నాం గదా?"

"ఆహా, నేను చెప్పేది మరొకస్థాయి విధేయత. ప్రజలను పదహారు గంటలపాటు క్యూలల్లో నిలబడమంటే, ఎదురు చెప్పకుండా ఆ పనిచేయాలి. మరొక మతం వారినో, మరొక లింగానికి చెందిన వారినో పెళ్లి చేసుకోగూడదంటే, వాళ్ళు ఆ మాట జవదాటగూడదు. తమ పాన్ కార్డునూ ఆధార్ కార్డ్‌నూ, కక్కసుదొడ్డి చీపురునూ ఆధార్ కార్డ్‌నూ స్వచ్ఛందంగా లింక్ చేయమని ప్రభుత్వం ఆదేశిస్తే, వాళ్ళు మారు మాటాడకుండా ఆ పని చేయాలి!"

"నేను నా ఆధార్ కార్డ్‌నూ కక్కసుదొడ్డి చీపురునూ ఎప్పుడో లింక్ చేసేశాను" అన్నాను.

"అబ్బ, మీరొక ఆదర్శపౌరులు. కాని ఇక్కడ విశాలమైన లక్ష్యం ఏమంటే మన పిల్లలను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం. ఆ బాధ్యతాయుత పౌరులైన పెద్దలు తాము ఎన్నుకొన్న రాజును గుడ్డిగా ఆరాధించాలి. పనీపాటా లేని రోజుల్లో ఇతరుల మీద మెరుపు దాడులు చేయగలగాలి, లేదా అల్లర్లలో, యుద్ధాలలో సమిధాలు కావడానికి సిద్ధం కావాలి."

ఆయన మాటలను మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తుంటే, పాఠ్యపుస్తకాల హేతుబద్ధీకరణను ఇంకా ముందుకు తీసుకుపోయేందుకు నా మెదడు కూడా కొత్త కొత్త సూచనలను చిలకడం మొదలు పెట్టింది. ఇప్పటి వరకు కేంద్రీకరణ అంతా చరిత్ర, రాజ నీతి శాస్త్రాల మీదనే ఉంది. ఇప్పుడిక్కడ నేను స్టెం అంటారు గదా, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ – ఆ సబ్జెక్టులలో సూచిస్తున్న మార్పులివి.

**భౌతికశాస్త్రం**

గ్రీకు గణిత శాస్త్రవేత్తగా పేరు పొందిన ఆర్కిమెడీస్ చిన్న పిల్లవాడిగా వారణాసి వచ్చాడు. ఆర్కిమెడీస్ సూత్రం అనేదాన్ని ఆయన కనిపెట్టాడు. ఆ సూత్రం ప్రకారం ఒక వస్తువు గంగలో మునిగినప్పుడు ఆ వస్తువు ఎంత బరువైన గంగా జలాన్ని బైటికి తోస్తుందో అంతే సమానమైన శక్తిని బహిర్గతం చేస్తుంది. ఆర్కిమెడీస్ తన స్నానపు తొట్టిలో **(తరువాయి 36వ పేజీలో)**

# పీడితుల పక్షాన కలం ఝుళిపించిన ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

-ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి

**పీడితుల పక్షాన తన కలాన్ని ఝుళిపించిన మానవతావాది, అభ్యుదయ భావాలతో సాహిత్యాన్ని సామాజిక శాస్త్రాలతో అధ్యయనం చేసిన గొప్ప కథా రచయిత, విమర్శకుడు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కడప జిల్లా శాఖ అధ్యక్షులు ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభను అరసం కడప జిల్లా శాఖ, వైవియూ సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్తంగా ఆదివారం ఉదయం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించాయి.**

తొలుత వక్తలు, సాహితీవేత్తలు కేతు విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి తన చుట్టూ ఉన్న సమస్యలను, పుట్టి పెరిగిన ప్రాంత జీవితాన్ని కథలుగా మలచిన విశిష్ట రచయితని కీర్తించారు. మనుషులను ప్రేమించే వాడని, ప్రాంతాల మధ్య వైరుధ్యాన్ని, దళితుల దైన్యస్థితిని, లింగ వివక్షతను తన కథల ద్వారా



ఎండగట్టారన్నారు. 1980లో స్త్రీవాదం పుట్టుకొస్తే ఆచార్య కేతు 1977లోనే పురుషులతో సమానంగా మహిళలు నిలబడాలని, ఎవరి దయా దాక్షిణ్యాల మీద బతకొద్దంటూ రచనలు చేయడం విశేషమ న్నారు. పంటలు లేని పొలాలను చూస్తే శుభ్రం చేసిన పలకలా ఉన్నాయంటూ ఆనాటి స్థితిని పోల్చారని చెప్పారు. ఆయన అం దరిలో ఒకడిలా కుల, మత, వయోభేదం లేకుండా ఆదర్శనీయ జీవితం గడిపారని తెలిపారు. ఆచార్య కేతు కథలను రేపటి తరానికి అందించి చదివించగలిగితే సమాజంలో మార్పు సాధ్య మవుతుందని, అదే మనం ఆయనకిచ్చే ఘననివాళి అన్నారు.

వైవియూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ సందేశాన్ని వినిపిస్తూ ఆచార్య కేతుకు విశ్వ విద్యాలయంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ తెలుగు శాఖకు మార్గదర్శనం చెయ్యడమే కాక గజ్జల మల్లారెడ్డి అవార్డు ఎంపికలో కీలకపాత్ర పోషించారని, బ్రౌన్ సలహా మండలి సభ్యులుగా సేవలందించా రని పేర్కొంటూ నివాళి అర్పించారు. ఆం.ప్ర.అభ్యుదయ రచ యితల సంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ మాట్లాడుతూ తనకు ఆచార్య కేతుతో తనకు 1973 నుండి




**దారిదీపం నివాళి**

పరిచయం ఉందని, 1974లో అరసం మొదటి కథా సంపుటాన్ని తీసుకు వచ్చారని గుర్తుచేశారు. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిన సందర్భంలో ఆయన స్పందన వ్యక్తం చేస్తూ రాయలసీమ కథకు, రాయలసీమ సాహిత్య చైతన్యానికి గుర్తింపుగా వచ్చిన పురస్కారంగా నిరాడంబరంగా పేర్కొన్నారన్నారు. ఆయన విమర్శ వ్యాసాలను 'దృష్టి' పేరుతో గ్రంథంగా తెచ్చారని, వేరు, బోధి అనే నవలలు రాశారని, అవి చాలా ప్రభావపూరితమైనవన్నారు. ఆయనను రాయలసీ మకో, రాష్ట్రానికో పరిమితం చెయ్యకూడదని, ఆయన రచనలు అనేక జాతీయ భాషల్లోకి అనువదితమయ్యాయని, అందువల్ల ఆయనను భారతీయ జాతీయ అభ్యుద య కథా రచయితగా చూడాలన్నారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని సేకరించి, విషయపరంగా విభజించి, ఆరు భాగాలుగా కేతు తన సంపాదకత్వంలో తీసుకువచ్చారన్నారు. విద్యా రంగానికి పాఠ్యపుస్తక సంపాదకులుగా విశేష సేవలం దించడమే కాక అభ్యుదయ వాదాన్ని పాఠ్యాంశాల్లోకి తీసుకువచ్చి ఉన్నతీకరించారన్నారు. సి.పి.ఐ. రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యాన్ని, మార్క్సిస్టు తాత్వికతను ఆయన ఒంటపట్టించుకొన్నారని తెలిపారు. ఆయన మననుంచి దూరం కావడం దిగ్భ్రాంతికరమన్నారు. కమ్యూనిస్టు పార్టీతో ఆయనకు విడదీయ రాని అనుబంధం ఉండేదన్నారు. విశాలాంధ్రకు ఆయన అందించిన సేవ శ్లాఘనీయమని, ఆయన కథలు, నవలలు, ఇతర రచనలను విశాలాంధ్ర ద్వారా పుస్తకాలుగా తీసుకువస్తామన్నారు. ఆయన రచించిన 'నమ్ముకున్న నేల' జన హృదయానికి దగ్గరగా ఉందని, యథార్థ సంఘటనలు అందులో కనిపిస్తాయన్నారు. యువ రచయితలను వెన్నుతట్టి ప్రోత్సహించేవారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సాహితీ రంగంలో విశ్వనాథ రెడ్డి తనకు మార్గదర్శకులన్నారు. బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్నారు.



సి.పి.ఐ. కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ విశ్వ విద్యాలయం, అరసం ప్రతి ఏటా ఆయన పేరుతో సదస్సులు నిర్వహించి అవార్డులు ఇచ్చేలా చూడాలని కోరారు. కెస్కో సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ ద్వారా ప్రతి ఏటా కేతు విశ్వనాథరెడ్డి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తామని ప్రకటించారు. ప్రముఖ కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి రాయలసీమ ప్రాతినిధ్య రచయిత అని, తాను రచయిత కావడానికి ఆయనే దారిదీపమన్నారు. జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ ఆచార్య కేతు వ్రాత ప్రతులను సేకరించి సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో భద్రపరచాలని కోరారు.

రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటి చీఫ్ ప్యాట్రన్ లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ విశ్వనాథరెడ్డి తన రచనల చిరంజీవి అని, ఆయన తన రచనలను ఆస్తిగా మనందరికీ ఇచ్చి వెళ్ళారన్నారు. సి.పి.యం. జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ప్రముఖ కథారచయిత తవ్వా ఓబుల్ రెడ్డి, డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు యం.బాలాజీరావు, కొండూరు పిచ్చమ్మ వెంకటరాజు స్మారక సంస్థ అధ్యక్షులు లయన్ కొండూరు జనార్దనరాజులు కేతు విశ్వనాథ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. అరసం కడపజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు స్వాగతం పలికారు. ఒడిస్సా రైలు దుర్ఘటన మృతుల ఆత్మశాంతికి సభ మౌనం పాటించింది. కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగా సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజగోపాల రెడ్డి, డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి, హజరతయ్య, కుమారస్వామి రెడ్డి, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు. ❑


# నిరవధిక రాత్రి



- కె.శ్రీనివాస్

**సమకాలీన తెలుగు పత్రికా సంపాదకుల్లో ప్రముఖులైన కె. శ్రీనివాస్ ఆంధ్రజ్యోతి దినపత్రిక లో రాస్తున్న 'సందర్భం' కాలమ్ లో గత తొమ్మిదేళ్లుగా రాసి ఎంపిక చేసి వేసిన వ్యాసాల సంకలనం 'బుల్డోజర్ సందర్భాలు.' ప్రజాస్వామిక లౌకిక విలువల పట్ల నిబద్ధతతో, దేశ బహుళత్వం మీద, విభిన్నతల మీద గౌరవంతో రాసిన వ్యాసాల సంకలనం ఇది. నియంతృత్వ పోకడల వర్తమానం మీద స్పష్టమైన అవగాహనతో, రాజకీయం కప్పుకున్న ముసుగుల్ని వొడుపుగా తొలగిస్తూ, వస్తుశిల్పాల సమతూకం కలిగిన వ్యక్తీకరణతో ఈ వ్యాస సంకలనానికి రచయిత రాసుకున్న ముందుమాట ఇది. చదవండి.**

చీకటి బాగా చిక్కబడిపోయింది. దుర్భిణీలు వేసి వెతికినా వెలుగురేక లేదు. అంతటా ఆవరించిన అబద్ధాల దుర్వాసన. ద్వేషంతో నిండిన అగడ్తలు. గడ్డకట్టిపోయే చలి లాంటి భయం. అవతలిగట్టు కనిపించడం లేదు. ఎచటికి పోతావీ రాత్రి ? చెడు కాలాలు మునుపు చాలానే దాటి వచ్చాము కానీ, సన్నద్ధత లేకపోయిందో, ఆదమరపులో ఉన్నామో, ఈ ఆపత్కాలం మాత్రం పెద్దపులి వలె మాటు వేసి మీదకు దుమికింది. దాని కోరలు, కన్నుల మెరుపులు గమనింపులోకి వచ్చే నాటికే, వెయ్యి పంజాల పరిష్వంగం బిగిసిపోయింది. ఇది చాలదన్నట్టు, అంధకారాన్ని మహాప్రకాశంగా కీర్తిస్తూ, చెవులు చిల్లులు పడే హోరు. హాహాకారాలు, ఆర్తనాదాలు అన్నీ అరణ్యరోదనలే. సత్యం పరిమళిస్తోందని, చరిత్ర పరవశిస్తోందని చేస్తున్న ప్రకటనలకు, సంకెళ్ల చప్పుడే నేపథ్యసంగీతం. ప్రయత్నించి చిన్న దీపం కూడా వెలిగించని అలక్ష్యం వల్ల, వెలిగించలేక పోతున్న అసమర్థత వల్ల చీకటి భయం రెండింతలవుతున్నది. శకలాలుగా మారిపోయిన సమష్టి, స్వార్థానికీ సాధికారతకీ చెరిగిపోయిన సరిహద్దు, దూరలక్ష్యాలను చూడలేని హ్రస్వదృష్టి, ప్రాధాన్యాల వివేచన లేని రాజకీయం, భయానికీ కర్తవ్యానికీ నడుమ నలిగిపోతున్న పౌరసమాజం, రాత్రిని నిరవధికం చేస్తున్నాయి. ఇదంతా ఇట్లా మొదలై దాదాపు తొమ్మిదేళ్లు. ఈ కాలంలో ప్రయాణిస్తూ, కలవరపడుతూ, భయపడుతూ, ఆశపడుతూ, విసిగిపోతూ రాసిన అక్షరాలు ఇవి. అన్ని




సంఘటనలు, సకల రంగాలు ఈ వ్యాసాలలో ప్రస్తావన పొందాయని చెప్పలేను. కానీ, పట్టుకున్నవి మాత్రం కేవలం ఒకటి, రెండు మెతుకులు కావు.

ఎలుక చచ్చిన వాసన మొదట ఎప్పుడు తెలిసిందో, అప్పటి అంచనాలేమిటో, ఎప్పుడు ఉపద్రవాన్ని గుర్తించామో, చాప కింద నీరు ఎప్పుడు ప్రమాదసూచిక ఎగురవేసిందో, తెలుసుకోవడానికి ఈ కల్లోల కాలాన్ని రీవిజిట్ చేయాలి. మంద్ర స్థాయిలో మొదలైనట్టు కనిపించిన మతతత్వం, ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగం మీద మహాయుద్ధానికి దిగిన క్రమాన్ని ఈ పుస్తకంలో సూచనమాత్రంగా గుర్తించవచ్చు.

### "మోదీ పేరుకు, మాటకు ఎదురులేని రోజులివి"

అని ఆయన అధికారానికి వచ్చిన ఆరు నెలలకే వ్యాఖ్యానించ వలసి వచ్చింది. భారతీయ జనతాపార్టీ స్థానిక, ప్రాంతీయ శక్తులపై యుద్ధం ప్రకటించిందని, సర్దార్ పటేల్ స్మృతిని ఆవాహన చేసుకోవడం వెనుక ఉన్నది ఏకశిలా సదృశ జాతీయ తావాదమేనని హెచ్చరించవలసి వచ్చింది. అయితే, మొదటి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంలో కూడా మోదీ పాలనపై "పెద్దగా విమర్శించడానికి కూడా ఏమీ లేద"ని, "అలాగని పెద్దగా చెప్పుకోవడానికి ఏమీలేద"ని సమతూకపు వ్యాఖ్యలే చేయవలసి వచ్చింది. మరో నాలుగు నెలలు తిరిగేసరికి కల్బుర్గి హత్య జరిగి 'వేట వేగం పుంజుకుంటున్నది' అన్న గుర్తింపు కలిగింది. గౌరీ లంకేశ్ హత్యతో నిస్సందేహపు నిర్ధారణ జరిగింది. ఆహారంపై, ఆహార్యంపై నిఘా పెరిగింది. ఊరు అడివి అయింది. పౌరసత్వం ప్రశ్నార్థకమైంది. దీక్షపై కక్ష కత్తి కట్టింది. ప్రజాక్షేత్రంలో పనిచేసే వారిపై ప్రభుత్వాలు పగబడతాయని రుజువైంది. అల్లరి మూకలూ, ప్రభుత్వ యంత్రాంగాలూ, పాలకులూ, సిద్ధాంతులూ, సామాజిక మాధ్యములూ – సమస్త బల గాల మోహరింపు పూర్తయ్యింది. కూల్చివేతల కొత్త రథయాత్ర మొదలయింది. కొన్ని భౌతికమైన కూల్చివేతలు కాగా, మరికొన్ని సాంస్కృతికమైన విధ్వంసాలు! బుల్ డోజర్ బొమ్మే వారి జెండాపై కపిరాజు!

ఒక అంతస్సూత్రాన్ని, అంతర్వాహినిగా ఉన్న క్రమపరిణామాన్ని ఈ వ్యాసాలు చెప్పే మాట నిజమే కానీ, వీటికి ఉన్న ఒక తాక్షణిక లక్షణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అప్పటికి ఆ సంఘటనో, పరిణామమో కలిగించే కుతూహలం, కలవరం, ఆశాభావం వంటి ప్రభావంతో చేసే వ్యాఖ్యలు కొన్ని కనిపిస్తాయి. ఇప్పుడు వెనుకకు తిరిగి చూసుకుంటే, ఆ వ్యాఖ్యలలో వ్యక్తమైన అంచనాలు తర్వాతి కాలంలో నెరవేరి ఉండకపోవచ్చు. పరిస్థితుల గమనాన్ని చర్చించేటప్పుడు, పాత్రికేయుడు జ్యోతిష్యుడేమీ కాదు. వ్యాఖ్యలో వ్యక్తమయ్యే విశ్లేషణ ప్రాతిపదికలు సరైనవా ? కావా ?, మంచి వైపుగా కాలం నడవాలన్న ఆకాంక్షకు కట్టుబాటు ఉన్నదా ? లేదా ? అన్నవి మాత్రమే పరిగణించాలనుకుంటాను. రాజకీయ, సామాజిక అంశాలలో కేవలం ఒక వైఖరి ప్రకటించడానికి మాత్రమే రచన చేయడం, పాత్రికేయ రచనలలో నేను ప్రాధాన్యం ఇచ్చే పద్ధతి కాదు. సొంత వైఖరి ఉండదని, దానిని కాలమ్‌లో ప్రస్తావించననీ చెప్పడం లేదు.

**రచయిత సొంత వైఖరితోపాటు, అనేక వైఖరులను రచనలో చర్చించాలి. ఆ చర్చ తార్కికంగా ఉండాలి. పాఠకుడికి ఆలోచించే అవకాశం మిగలాలి. ఈ క్రమంలో అనివార్యంగా రచయిత సొంత వైఖరిపై మొగ్గుతోనే వ్యాసం ముగుస్తుంది. ఈ అవగాహనతోనే రాయడానికి ప్రయత్నించినప్పటికీ, కొన్ని సందర్భాలు రచయితను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. చర్చకంటే స్పందనకే ప్రాధాన్యం ఇచ్చేట్టు చేస్తాయి. ఈ వ్యాసాలలో కొన్నిచోట్ల అటువంటి ధోరణి తారసపడవచ్చు.**

ఈ వ్యాసాలు సమాచారాత్మకమైనవి కావు. అవసరమైన సందర్భాలలో తప్ప ఆయా అంశాల నేపథ్య చరిత్రను, అనుబంధ వివరాలను వీటిలో అందించలేదు. ప్రజా స్వామిక ఆవరణలోని అందరు భాగస్వాములను సీరియస్‌గా తీసుకుని, వారి ఆచరణలను చర్చించాను. వివిధ వ్యవస్థలను కానీ, రాజకీయ సంస్థలను కానీ మూకుమ్మడిగా ఒకే గాటన కట్టడం కానీ, వాటి నిరర్థకతను పరమ సత్యంగా చెప్పడం కానీ చేయలేదు. ఆయా సన్నివేశాలలో ఎవరు మెరుగుగా కనిపించినా వారిని సానుకూలంగా ప్రస్తావించాను. అసత్యాల చుట్టూ సత్యాలను మోహరించడానికి, ఆ క్షణానికి పనికివచ్చే ప్రతి మాట నుంచీ సాయం తీసుకున్నాను. ఎంతటి హాస్యాస్పదమైనవైనా, ఎంతటి హేయమైనవైనా, బూటకపువైనా, జరుగుతున్న పరిణామాల నడుమనే, అందుబాటులో ఉన్న అవకాశాల మధ్యనే ప్రజలు ప్రత్యామ్నాయాలను నిర్మించుకోవలసి ఉంటుంది. కొత్త పరిణామాలను ఆవిష్కరించవలసి ఉంటుంది. కొత్త అవకాశాలను కల్పించుకోవలసి ఉంటుంది. బహుశా, రచన కూడా అటువంటి విన్యాసమే. కాలమ్‌గా వచ్చినప్పుడు ఈ వ్యాసాల్లో దొర్లిన కొన్ని తప్పులను ఇప్పుడు సవరించాను. కొన్ని పునరుక్తులను, క్లిష్టంగా ఉన్న వాక్య నిర్మాణాలను, వ్యక్తీకరణలను సరళంగా మార్చాను. అస్పష్ట అర్థాలకు, అపార్థాలకు ఆస్కారమిచ్చే అసమర్థ వ్యక్తీకరణలను కొద్దిగా సవరించాను. ఎటువంటి చేర్పులు కానీ, భావాలకు సంబంధించిన దిద్దుబాట్లను కానీ చేయలేదు.

ఎంతగా ప్రజాస్వామిక పద్ధతిలో రాయడానికి ప్రయత్నించినప్పటికీ, ఆయా వ్యాసాలలోని అంశాలు, నిషిద్ధాక్షరుల వంటివి. రాజకీయంగా సున్నితమైనవి. అయినా, 'సందర్భం' కాలమ్‌ను నా విచక్షణ మేరకు నిర్వహించేందుకు సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చిన ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా పత్రికా వ్యాసాల సంకలనం ప్రచురించాలని 'మలుపు' బాల్ రెడ్డి గారు మూడు నాలుగేళ్లుగా అడుగుతున్నారు. ఒక నిర్దిష్ట అంశానికి సంబంధించిన వ్యాసాలను ప్రత్యేకంగా అందిస్తే బాగుంటుందని సూచించి, ఈ పుస్తకాన్ని ప్రచురించినందుకు ఆయనకు, 'మలుపు' సంస్థకు కృతజ్ఞతలు. ఈ పుస్తకాన్ని 'సందర్భీకరిస్తూ' ప్రొఫెసర్ జి.హరగోపాల్ నాలుగు మంచి మాటలు రాయడానికి కారణం, పుస్తకాంశం మీద ఆసక్తితోపాటు నా మీద ప్రేమ కూడా కారణమనుకుంటాను. ❑


# అసమర్థతకు ఆనవాలు మోదీ



- ఆర్వీ రామారావు

**సవ్యంగా ఆలోచించగలిగే వారు కూడా మోదీ ప్రభుత్వ సమర్థతా రాహిత్యాన్ని గుర్తించలేక హిందుత్వ రాగా లాపనకు పాల్పడుతున్న దశలో మోదీని నిలదీయడం సాహసమే. ఒక వేపు అకడమిక్ అర్హతలు, ఇంకోవేపు ఆర్థికశాస్త్రంలో సంపూర్ణ అవగాహన, మరో వేపు తల్లిదండ్రులు కూడా రాజకీయాలలో ఉండడం వీటన్నింటికీ తోడు స్వయంగా సామాజిక-రాజకీయ-ఆర్థిక పరిణామాల మీద క్షుణ్నమైన అవగాహన ఉన్నందువల్లే పరకాల ప్రభాకర్ మోదీ అసమర్థతను “ది క్రుకెడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా: ఎస్సేస్ ఆన్ ఎ రిపబ్లిక్ ఇన్ క్రైసిస్” లో నిర్మొహమాటంగా బయటపెట్టగలిగారు.**

పరకాల తల్లి, తండ్రి కూడా రాజకీయాలలో ఉన్నవారే. తల్లి కాళికాంబ శాసనసభ్యురాలిగా ఉండేవారు. తండ్రి పరకాల శేషావతారం మూడు మంత్రి వర్గాలలో పనిచేశారు. అంతకుముందు ఆయన కమ్యూనిస్టు పార్టీలో ఉండేవారు. పరకాల గ్రంథం లాంఛనప్రాయంగా ఆవిష్కరణ జరగకపోయినా ఆలోచనాపరులను ఆకర్షించింది. “ది వైర్” వెబ్ పోర్టల్ లో రచయితను కరణ్ థాపార్ ఈ గ్రంథంపై సుదీర్ఘంగా ఇంటర్వ్యూ చేశారు. ప్రేం ఫణిక్కర్ కూడా ఆయనను ఇంటర్వ్యూ చేశారు. పరకాల ప్రభాకర్‌కు రాజకీయ ఆర్థిక శాస్త్రంలో అభినివేశం ఉంది. రాజకీయ, సామాజిక వ్యాఖ్యాతగా ఆయన గురించి అనేకమందికి తెలుసు. ఈ టీవీలో ‘ప్రతిధ్వని’ కార్యక్రమాన్ని పరకాల కొన్నేళ్లపాటు నిర్వహించారు. ఎన్‌టీవీలో “నమస్తే ఆంధ్రప్రదేశ్” పేర ఇలాంటి కార్యక్రమం కొనసాగించారు. ఒకప్పుడు ఆయన బీజేపీలో ఉన్నారు. కొంతకాలం ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కొంత కాలం సమాచార వ్యవహారాల సలహాదారుగా కేబినెట్ హోదాలో ఉన్నారు. ప్రజారాజ్యం పార్టీ ఏర్పడినప్పుడు ఆయన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగానూ, అధికార ప్రతినిధి గానూ బాధ్యతలు నిర్వర్తించారు. “మిడ్ వీక్ మాటర్స్” యూట్యూబ్ కార్యక్రమానికీ బహుళ జనాదరణ దక్కింది. ఈ విస్తారమైన అనుభవమే ఆయన ఈ తాజా గ్రంథం వెలువరించడానికి కారణం కావొచ్చు. ఈ గ్రంథం ఆవిష్కరణ బెంగళూరులో ఆది వారం జరిగింది. ఈ గ్రంథంలో అనేక విషయాలను ఏ మాత్రం బెరుకు లేకుండా, మొహమాటాలకు, తెచ్చిపెట్టుకున్న మర్యాదలకు పోకుండా రాయడం ఒక రకంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. మోదీ అధికారం చేపట్టిన తరవాత నెలకొన్న ప్రస్తుత



వాతావరణమే ఈ ఆశ్చర్యానికి కారణం. అయితే ఈ గ్రంథాన్ని ప్రచురించాలా ? లేదా ? అని కొంత కాలం పరకాల సందిగ్ధం లో ఉన్నారట. చివరకు సాహసించారు. ఈ గ్రంథ ప్రచురణ నిజంగా సాహసమే. ఎక్కడ్కైనా తప్పు జరిగినప్పుడు దాన్ని ఎత్తి చూపడం పరకాల నైజం. పరకాల రాజకీయాలను ఆమోదిం చినా, ఒప్పుకోక పోయినా ఆయన నిజాయితీని శంకించలేం. మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిపోయిందం టారు ప్రభాకర్. అక్కడితో ఆగకుండా మోదీ ప్రభుత్వానికి ఆర్థి కాంశాలలో నిర్దిష్టమైన సిద్ధాంత ప్రాతిపదిక లేదని చెప్పారు. ఎక్కడైనా తప్పు జరుగుతోందని అనిపించినప్పుడు కిమ్మనకుండా ఉండలేని తత్వం ఆయనది. ఆర్థిక విషయాలలో మోదీ అసమర్థ త కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని రుజువు చేయడానికి ఆయన అనేక గణాంకాలను మన ముందుంచారు. నిరుద్యోగం సగటున ఏడు శాతం ఉన్నా యువతలో అది 18 శాతం దాకా ఉండడం ఆందోళనకరం అంటారు ప్రభాకర్. మన జనాభాలో అత్యధికు లు యువతే ఉన్నప్పుడు వారికి జీవనో పాధి లేకపోవడంతో పరిస్థితి వికటిస్తుందన్న ఆందోళన ఆయన ను వేధిస్తోంది. సంపద సృష్టిలో దేశ పరిస్థితి ఆశాజనకంగానే ఉన్నప్పటికీ ఆ సంపద అతి కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కావడం, విస్తారమైన జనాభా పేదరికంలో కూరుకుపోవడం కల్లోలాన్ని సృష్టించే ప్రమాదం ఉందంటారు పరకాల. మన గణతంత్రానికి పునాదులు వేసిన వారి కృషి, ఆ నాటి విలువలు మోదీ హయాంలో శీఘ్రంగా పతనం అవుతున్నాయ న్నది ఆయన ఆవేదన. ఇదే వ్యథ చాలా మందికి ఉంది. దీనికం తటికీ మోదీ, ఆయన నాయకత్వంలోని ప్రభుత్వ అసమర్థతే కారణం అన్న అభిప్రాయం ఈ గ్రంథం అంతా పరుచుకుని కని పిస్తుంది. కరోనా మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ కుదేలైన మాట వాస్తవమే అయినా ఆ గడ్డు రోజులు తొలగిపోయిన ప్పటికీ మనం కరోనాకు ముందున్న స్థితికి చేరకపోవడానికి మోదీ ప్రభుత్వ అసమర్థతే కారణం అన్నది పరకాల గ్రంథంలో ప్రధానాంశంగా కనిపిస్తుంది. మన స్థూల జాతీయోత్పత్తి ఇప్పటికీ కరోనాకు ముందున్న స్థాయికి చేరుకోలేక పోయింది. 1980లో వాజపేయి, అద్వాణీ లాంటి ఉద్దండులు బీజేపీని ఏర్పాటు చేసినప్పుడు గాంధేయ సోషలిజం తమ సిద్ధాంతం అన్నారు. ఆ తర్వాత ఆ ప్రస్తావనే తీసుకు రావడం లేదంటారు పరకాల. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 1991లో ప్రవేశ పెట్టిన ఉదారవాద ఆర్థిక విధానాలు ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వేగవంతంగా అమలు చేయడం లేదని బీజేపీ తూర్పారపట్టేది. కానీ ఇదే బీజేపీ 1991లో అమలుచేసిన ఉదారవాద ఆర్థిక విధానాలను దుయ్య బట్టింది. దీనికంతటికీ కారణం నికరమైన ఆర్థిక సిద్ధాంత ప్రాతిపదిక లేకపోవడమేనని పరకాల తేల్చారు. మోదీ సర్కారు సరఫరా వేపే చూస్తోంది తప్ప గిరాకీ అంశాన్ని పట్టించుకోవడం లేదన్నది ఆయన అభ్యంతరం. పెద్ద నోట్లను రద్దు చేసి మోదీ ప్రభు త్వం దేశవాసులందరినీ దొంగ దెబ్బతీసింది. ఇది అత్యంత వినాశకరమైందిగా తేలింది. నల్ల ధనం అంటే నోట్ల కట్టల్లో మాత్రమే ఉండదని పరకాల అంటారు.

మరుగుదొడ్లు నిర్మించడం, ఆర్థిక లావాదేవీలను డిజిటలీకరిం చి యు.పి.ఐ.లాంటి వాటిని ప్రవేశ పెట్టడం, గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడం లాంటివి జనానికి కొంత మేర ఉపకరించి ఉండవచ్చు. కానీ అది ఆర్థిక వ్యవస్థను ప్రోది చేయడానికి ఎంత మాత్రం ఉపకరించలేదు అని చాలా మందిలో ఉన్న అభిప్రాయా న్ని పరకాల నిర్భయంగా ఈ గ్రంథంలో చెప్పారు. ప్రజలకు వెసులుబాట్లు కల్పించడం, ఆర్థికాభివృద్ధి సాధించడం ఒకటే కాదన్నది పరకాల వాదన. మన దేశంలో కోట్లాది స్మార్ట్ ఫోన్లు, ఆపిల్ ఫోన్లు తయారు చేయడం ఆర్థికాభివృద్ధికి సూచిక కాదంటారాయన. హిందుత్వ బీజేపీ రాజకీయాలలో పాతుకు పోయింది. అయితే మోదీ ప్రభుత్వం అనుసరించే ఈ విలోమ విధానాలను మోసపూరితంగా అమలు చేస్తున్నారంటారు పరకాల. విచ్ఛిన్నకర రాజకీయాల ఆధారంగా బీజేపీ, మోదీ జన సమీకరణ చేయడం వల్ల అపారమైన ముప్పు పొంచి ఉందన్నది ఆయన బాధ. పది పదిహేనేళ్ల కింద విరివిగా వినిపించే సెక్యులరిజం అన్నమాటను సైతం బీజేపీ వికృతీకరించింది. తామే నికరమైన సెక్యులర్ వాదులమనీ, మిగతా పార్టీలన్నీ కుహనా సెక్యులర్‌పార్టీలని బీజేపీ ఊదరగొట్టిన సందర్భాలను గుర్తు చేసుకుంటే పరకాల భాష మనకూ అర్థం అవుతుంది. తామే అసల్కైన సెక్యులర్ వాదులమని బీజేపీ చెప్పుకోవడంలో పెద్దమోసం ఉందని పరకాల సూత్రీకరించారు.

దేశ విభజన సమయంలో ఉన్న వాతావరణం ఒక వర్గాన్ని పనిగట్టుకుని ద్వేషించడానికి ఎక్కువ ఆస్కారం ఉన్నా అప్పుడు అలా జరగలేదు కానీ ఇప్పుడు జరుగుతున్న దంతా అదేనం టారు పరకాల. 2014లో బీజేపీ అధికారం లోకి రావడానికి ముందు మతతత్వం గురించి మాట్లాడలేదు. అభివృద్ధి, అవినీ తినే ప్రధాన సమస్యలుగా ముందుకు తోసింది. అధికారంలోకి వచ్చిన తరవాత అసలు రంగు బయటపెట్టింది. మోసకారితనం అంటే ఇదే కదా! ఈ గ్రంథం పొడవునా ఆయన వ్యక్తులను ఎక్కడా విమర్శించ లేదు. మోదీ అసమర్థత, పాలనా విధానమే సకల రుగ్మతలకు కారణం అని మాత్రం మొహమాటం లేకుం డా చెప్పారు. ఉత్తర భారతంలో ఉన్న విద్వేష వాతావరణం దక్షిణభారతాన్ని కూడా ఆవహించే ప్రమాదం ఉందంటారు. మోదీ సామర్థ్యం అంతా మతతత్వాన్ని ప్రోత్సహించడం, విద్వేషం రెచ్చగొట్టడం, జనాన్ని చీల్చడంలో మాత్రమే ఉందని ఈ గ్రంథంలో నిర్భయంగా వెల్లడించడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ❑

# మహాభారతం వెల్లువలో ఒక అనుభూతి

- కృష్ణుడు


**'వాన వెలిసి మబ్బు తేలిపోతుంది. ఒక మబ్బుతోనే భూమి తృప్తమవుతుందా? బయట కాలువలై, నదులై నీళ్లు ప్రవహించినా, లోన తేమ అంటదు. నేల మరో మేఘం కోసం ఎదురు చూస్తూ తాపోపశమనం కోసం నోరు తెరుచుకుని ఉంటుంది. బిడ్డా ! నా అయిదుగురు కొడుకులను నువ్వు ఒకటిగా పెళ్లి చేసుకో. సంతోషం, సుఖం అఖండ ప్రమాణంలో నీ ఎదురుగా పరుగెత్తుకుని వస్తుంటే వద్దని వీపు తిప్పడం వివేకం కాదు' అని మహాభారతంలో కుంతి ద్రౌపదితో అంటుంది.**

ఇది కన్నడ మహాకవి భైరప్ప రాసిన 'పర్వ'లో ఒక దృశ్యం. స్వయంవరంలో అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని గెలుచుకున్నప్పటికీ మిగిలిన నలుగురు సోదరులు ఆమె తమకే దక్కాలని వాదించుకున్నట్లు భైరప్ప చిత్రీకరించారు. భైరప్ప అనేకమంది రచించిన భారతాలను, స్థల పురాణాలను చదివి, భారతం జరిగినట్లు చెప్పుకుంటున్న ప్రాంతాలను సందర్శించి ఎంతో పరిశోధన తర్వాత రచించిన అద్భుత మహాకావ్యం ఇది. ద్రౌపది గురించి పాండవులు ఐదుగురు మనసు పడ్డారని నన్నయ్య కూడా ఆదిపర్వం సప్తమా శ్వాసంలో ఒక పద్య పాదంలో స్పష్టీకరించారు.

**ఆ లలితాంగి యందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండు భూపాల తనూజ పంచకము పంచ శరాహుతి బొందె నొక్కతన్.**

ఏ ఆర్య స్త్రీకి లభించని సమృద్ధ సుఖం తనకు లభిస్తుందని ద్రౌపది ఉత్సాహపడుతుందని భైరప్ప రాశారు. అయిదుగురు భర్తలతో అయిదు రాత్రుల వివాహ వైభవాన్నీ ఆయన చిత్రించారు. ఆశ్చర్యకరమేమంటే ఇదే అయిదు రాత్రుల వివాహ వైభవాన్ని తన ద్రౌపది నవలలో చిత్రించినందుకు తెలుగు రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వివాదాస్పదుడయ్యారు. అయితేనేం, అటు భైరప్పకు, ఇటు లక్ష్మీప్రసాద్‌కూ పద్మ భూషణ్ పురస్కారాలతో సత్కరించిన ఘనత నరేంద్రమోదీ ప్రభుత్వానికి దక్కింది. భైరప్ప బీజేపీకి అత్యంత సన్నిహితుడుగా గుర్తింపు పొందడం గమనార్హం. ఈ విషయం పక్కన పెడితే భైరప్ప నవలను తెలుగులో అనువదించిన గంగిశెట్టి లక్ష్మీనారాయణ ఒక మహానుభావుడని చెప్పక తప్పదు. రాయలసీమ మాండలి కంలో మహా భారతాన్ని చదివే అద్భుత ఆనందాన్ని ఆయన కలిగించారు. గంగిశెట్టి అనువదించిన 'పర్వ'లో పాత్రలు ఎద్దు మాంసం ముక్కను నములుతూ మాట్లాడుకుంటారు. వంశం పెరగాలని పెయ్య దూడలను తెచ్చినట్లు కురువంశంలో కోడళ్లను తెచ్చారని, లాగ లేని ఎద్దులాగా కామ క్రీడలో డీలా పడే పాండురాజు తన అసహాయతను భార్యపై హింస రూపంలో చూపుతాడని ఆయన అనువదించిన తీరు అనన్య సామాన్యం. 'నీవొక్కడివీ విసనకర్ర విసురుకుంటున్నావే, నాకు కూడా కాస్త గాలి తగలనీ', అని కృష్ణుడు భీముడి విసనకర్రను తన ఎద వైపుకు తిప్పుకుంటున్నారని రాయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. 'పుండాకోర్' లాంటి పదాలను కూడా గంగిశెట్టి ఈ అనువాదంలో విరివిగా వాడారు. మహాభారతం అంటే అదొక సామాన్యుల కథగా 'పర్వ'లో భైరప్ప చిత్రించారు. అంతే సామాన్యంగా గంగిశెట్టి అనువదించి చరిత్రలో నిలిచిపోయారు. 'ఆకాశంలో అంతటా వెన్నెలను నింపి దానిలో చంద్రుడు తేలిపోతున్నాడు' లాంటి అద్భుత కవితా వాక్యాలు పర్వలో మనకు గోచరిస్తాయి.









నియోగపు పద్ధతి మహాభారతం కాలంలో అమలులో ఉంది. భార్యను క్షేత్రంగా చేసి, వేరే పురుషుడి వల్ల సంతా నం పొందే విధానాన్ని అతి సాధారణ విషయంగా మహా భారతంలో చిత్రించారు. కుంతి, మాద్రి ఇదే విధంగా సంతానం పొందారు. భైరప్ప కూడా దాన్నే చిత్రించారు. అయితే కుంతి, మాద్రి ఇష్ట ప్రకారం నియోగపు పద్ధతిని అనుసరిస్తే మాధవి అనే పాత్ర ఈ పద్ధతి వల్ల తన స్వేచ్ఛను, ఇష్టాయిష్టాలను బలి చేయవలిసి వచ్చింది. భైరప్పలాగే మరో కన్నడ రచయిత్రి అనుపమ నిరంజన 'మాధవి' అనే నవలను రాశారు. మాధవిది మహాభారతంలో వచ్చే ఉప కథ. వ్యాసుడి భారతంలో ఇది వివరంగా ఉన్నప్పటికీ నన్నయ్య ఒకటి, రెండు పద్యాల్లో ఆమె కథను తేల్చిపారేశారు. యయాతి తన కుమార్తె మాధవిని గాలవుడనే మునికి దానం చేయడం, అతడు విశ్వామిత్రుడికి చెల్లించాల్సిన గురుదక్షిణ కోసం ఆమెను రాజులకు అద్దెకివ్వడం ఈ నవల సారాంశం. చివరకు స్త్రీ దాస్యానికి విరుద్ధంగా మాధవి ప్రతి ఘటించి సమాజాన్నే త్యజించిన తీరును అనుపమ నిరంజన అద్భుతంగా చిత్రించారు. గురుదక్షిణ కోసం గుర్రాలను కోరిన విశ్వామిత్రు డు మాధవిని చూసినప్పుడు 'ఎనిమిది వందల గుర్రాలకు బదులుగా ఈ మాధవినే స్వీకరించండి, అని నా వద్ద కు తెచ్చి వదిలిపెడితే ఎంత బాగుండేది' అని అంటాడు. విశ్వా మిత్రుడు కోరిన గుర్రా లు దూరంగా గడ్డిని మేస్తుంటే అతడు ఆమెను అనుభవిస్తాడు. 'కామాన్ని పూర్తిగా అనుభవించిన దానివి నువ్వు. అందుకే నీకు కోరిక లేదు. కానీ నాకున్న ఆకలి ఎన్నో సంవత్సరాలది' అంటాడు. వేద పారంగతులైన మునులు మానవ సహజ దౌర్బల్యాన్ని జయించలేదని, ప్రవచనాలకు, ప్రవర్తనలకూ చాలా తేడా ఉండేదని అనుపమ నిరంజన వ్యాఖ్యానించారు. ఇది ఇప్పటికీ ఎంత సత్యం?

భైరప్ప, అనుపమ నిరంజన ఇద్దరూ మహాభారతాన్ని వైజ్ఞానిక, శాస్త్రీయ దృక్పథంతో ఎంతో పరిశోధన తర్వాత తమదైన మార్గం లో నవలీకరించారు. అనుపమ నిరంజనకు ప్రేరణ మహా భారతంలోని అనేక సంఘటనలను సామాజిక రాజకీయ సందర్భం లో వివరించడానికి ప్రయత్నించిన మరాఠీ రచయిత ఇరావతీ కర్వే 'యుగాంతం'. 'యుగాంతం' గురించి ఎంత చెప్పినా తనివి తీరదు. కాని అనుపమ నిరంజన గురించి, ఆమె భర్త రచించిన 'మృత్యుంజయుడు' గురించి కూడా ఎంత చెప్పినా తక్కువే. మాధవిని తెలుగులో అనువదించిన కల్యాణి నీలాంభరం, ఆమె తల్లి శర్వాణి ఇద్దరూ కన్నడ–తెలుగు సాహిత్యాల మధ్య వారధులు. వారి పాద పద్మాలకు నమస్కరించడం తప్ప మనం చేయగలిగింది ఏమీ లేదు. 'మాధవి' చదివిన తర్వాత నేను ఆమె గురించి తెలుసుకోవడం కోసం శలాక రఘునాథ శర్మ పరిష్కరించిన వ్యాస భారతాన్ని చదవడం ఒక గొప్ప అనుభవం. కన్నడ రచయితల మాదిరే తెలుగులో మహా భారతాన్ని తమదైన రీతిలో రచించిన వారు ఎందరో ఉన్నారు. పురిపండ అప్పలస్వామి, కొడవటిగంటి కుటుంబరావు, రెంటాల గోపాల కృష్ణ, ప్రయాగ రామకృష్ణ నుంచి జగన్నాథశర్మ, జ్వాలా వనం నరసింహారావు వరకు వీరిలో ఎందరో. రంగనాయకమ్మ కూడా భారతాన్ని వదలలేదు. కొందరు వ్యవహారిక భాషల్లో రచిస్తే మరికొందరు కథా కథన శైలిలో తమకు ఇష్టమైన ఘట్టాలను వివరించారు. పురిపండను చదివితే భారతాన్ని కాక ఒక నవలను చదువుతున్నట్లు అనిపిస్తుంది. కవిత్రయం రచించిన భారతం ఆధారంగా అనేక మంది భారతాన్ని తమదైన శైలిలో వివరించినా, మహాభారతంలోని అనేకపర్వాల్ని పరిష్కరించిన పుట్టపర్తి నారాయణాచార్యుల వంటి పండితులు వ్యాసుని మహాభారతాన్ని పోల్చదగిన రచనలేవీ రాలేదన్నారు. 'వ్యాసుని స్వరూపమందు ప్రపంచమంతయూ పిపీలిక. ఒక్క తిక్కన మాత్రమే వ్యాసునకు తన శక్తి కొద్దీ సేవ చేశారు కాని మరే తెలుగువాడు చేయలేదు' అని పుట్టపర్తి అన్నారు. తిక్కన యతిప్రాసల అచ్చుకట్టులో కొట్టుకుపోయిన వదిలిపెట్టిన అనేక ఘట్టాల్ని ఆయన వివరించారు.

జ్వాలావనం నరసింహారావు పద్య ప్రియుడు. భారతంలో కవిత్రయం రచించిన పద్యాలను ఆస్వాదించి ఆ పద్యాల ఆధారంగా ఆయన అందులోని కథలను వివరించారు. నన్నయ్య, తిక్కన, ఎర్రన రచించిన అనేక పద్యాల్లో కవితా స్వారస్యాన్ని నరసింహారావు అనుభవించి పలవరించారు. జ్వాల వివరించిన ఒక ఘట్టంలో కచుడిని ప్రేమించిన దేవయాని తనను స్వీకరించమని అతడిని నిర్మొహమాటంగా చెబుతుంది.

**నీవును బ్రహ్మచారివి వినీతుడ గన్యకన్ మహీ**

**దేవకులావతంస రవితేజ ! వివాహము నీకు నాకు మున్**

**భావజశక్తి వైనయది పన్నుగ నన్ను బరిగ్రహింపు సం**

**జీవని తోడ శుక్రు దయ జేయుము నాకు బ్రియంబు నావుడున్**

అన్న దేవయాని 'మన్మథుడి ఆకర్షణే వివాహానికి మూలం' అని స్పష్టంగా చెబుతుంది. స్త్రీలు మనసు విప్పి తమ కోరికను వెల్లడించేందుకు కాలంతో పనిలేదు అని భారతం మనకు చెబుతుం ది. ఇంద్ర పదవి వచ్చినప్పటికీ నహుషుడు మదం అతిశయించి మన్మథవశుడై ఇంద్రుడి భార్య శచీదేవినీ తన వద్దకు రమ్మంటా డు. ఆ అహంకారమే అతడిని ఇంద్ర పదవి నుంచి భ్రష్టుడిని చేస్తుంది. ఈ కథను ధర్మరాజుకు చెప్పిన శల్యుడు నహుషుడి లాగానే దుర్యోధనుడు కూడా నశిస్తాడని వివరిస్తాడు. అధికారం ఎవరినైనా బదిరాంధుల్ని చేస్తుందని జ్వాలా నహుషుడి కథ ద్వారా వివరించిన తీరు అమోఘం. అధికార సోపానాలకు సమీ పంలో ఉన్న ఆయన ఎంతమంది ఇలాంటి బదిరాంధుల్ని, వారి పతనాల్ని చూశారో? భారతం గురించి ఎంత మంది ఎన్నిసార్లు రచించినా చదివిన కొద్దీ ఆ కథల మైకంలో మనం కొట్టుకు పోవడానికి ప్రధాన కారణం నిజ జీవితంలో ఇప్పటికీ ఆ పాత్ర లు మనకు కనిపించడమే కావచ్చు. భారతం గురించి ఎవరు రాసినా ఆ సముద్రంలో అలల్ని తడిమే వారే కాని అగాధాన్ని స్పృశించడం అంత సులభం కాదు. ❑

# అస్తిత్వం - చైతన్యం - కార్మికవర్గం


**- రావు కృష్ణారావు పుస్తకం నుండి..**



**- గౌరవ్**

'**చ**రిత్ర అంటే భావాల చరిత్రేనని భావిస్తున్న రోజుల్లో మార్క్స్, ఎంగెల్స్ ఆ వాదాన్ని తిరస్కరిస్తూ చాలా రాడికల్ ప్రతిపాదనలు చేశారు. చరిత్ర అంతటికీ మొట్టమొదటి ప్రాతిపదిక సజీవ మానవ వ్యక్తుల ఉనికి, ప్రకృతితో వారి సంబంధం అని ప్రకటించారు. తమ జీవితావసరాలను ఉత్పత్తి చేసే క్రమంలోనే మనుషులు పరోక్షంగా తమ వాస్తవ జీవితాలను రూపొందించుకొని తీర్చిదిద్దుకుంటారు. తమ జీవితావసరాలను ఉత్పత్తి చేసుకొనే విధానమే వారు తమ జీవితాలను వ్యక్తం చేసుకొనే నిర్దిష్ట రూపం. వారు తమ జీవితాలను ఎలా వ్యక్తం చేసుకుంటారో అలాగే ఉంటారు" (పేజి 13)

'ఈ మహా మానవ ప్రస్థానంలో వేలు లక్షల తరాల మానవులు తమ చెమటతో ఈ భూగోళపు రూపు రేఖల్ని మార్చేశారు. ఆ క్రమంలో కోటానుకోట్ల ప్రజలు చరిత్ర రథచక్రాల కింద నలిగి నాశనమైపోయారు. ఆకలి, రోగాలు, యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలకు బలైపోయారు. ఇలా మొత్తం మానవాళి కృషి, ఆ కృషిలో అత్యధిక మానవులు అనుభవించిన నరక యాతనలు, బలిదానాల మొత్తానికి ఎవరైనా ఖరీదు కట్టగలరా?' (పేజి 14)




'మనుషుల నిజ జీవితం కేవలం ఆకలి తీర్చుకొనే జీవపర అస్తిత్వం కాదు. అది ఇతర జీవులకు భిన్నమైన అస్తిత్వం. అవసరాలు తీర్చే వస్తువుల సేకరణకు పరిమిత మవ్వక మనిషి వాటి ఉత్పత్తికి పూనుకున్నాడు. అలా మనిషి తన అవసరాలను ఉత్పత్తి చేసే క్రమం యొక్క చరిత్ర సృష్టించినదే మానవ అస్తిత్వం.' (పేజి 37)

ప్రొలెటేరియన్ అనే మాటకు అసలు అర్థం, ఏ పనీ చేయకుండా, సోమరులుగా బతికేవారు తప్ప మిగిలిన వారందరూ అని. కేపిటలిస్టు సమాజంలో ప్రొలెటేరియట్ అంటే వ్యక్తి కాదు, సమిష్టి శ్రామికుడు. ఒక్కడే కావచ్చు (చాలా అరుదు). పెద్ద సమూహం కావచ్చు. ఎవరైతే సరుకును ఉత్పత్తి చేస్తారో వారిని ప్రొలెటేరియట్ అన్నాడు మార్క్స్. ఇందులో ముఖ్యంగా మానసిక, శారీరక శ్రమలు కలిసి ఉంటాయి. ఈ శ్రమ ఫ్యాక్టరీలోగాని, దానికి దూరంగా గాని, ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని, పర్యవేక్షణ గాని, పాచిపని గాని ఏదైనా కావచ్చు. ఇవన్నీ సరుకుల ఉత్పత్తికి సంబంధించినవై ఉండాలి. అలా ఉత్పత్తి అయిన సరుకుల్లో చేరిన విలువ ఏ ఒక్కరిదో కాక అందరి శ్రమఫలితం. ఈ శ్రమలో పాలుపంచుకున్న వారందరూ ప్రొలెటేరియట్‌లో సభ్యులే!' (పేజి 64,65)

'కార్మిక వర్గం యొక్క ఈనాటి స్థితిని వివరించగల సిద్ధాంతం మార్క్స్ రచనల్లో లభించదు. వివరించగల సత్తా ఉన్న ఎలియనేషన్, ఐడియాలజీ, ఫెటిషిజం మొదలైన సిద్ధాంతాలను నేటి పరిస్థితులకు అన్వయించే ప్రయత్నాలు జరగడం లేదు. వామపక్ష కార్మిక నాయకులైతే ఇటువంటి సమస్య ఉందని గుర్తించినట్లు లేదు. కార్మికుల మనస్తత్వంపై ప్రభావం చూపగల సాంస్కృతిక రంగంలో కృషి నామ మాత్రం. వికృతమొనర్చిన పెట్టుబడిదారీ మనస్తత్వాన్ని నరనరాన జీర్ణించుకున్న కార్మికవర్గం పెట్టుబడిదారీ వర్గాన్ని ఎలా కూలదొయ్యగలదు?' (పేజి 76)

'ఈ సమాజంలో చిన్నప్పటి నుంచి ఇంట్లో, గుళ్ళో, బళ్ళో అన్నిచోట్లా మనిషికి 'విధేయత'ను నూరిపోస్తారు. ఇది 'అధికా రానికి విధేయత. ఇటీవలి కాలంలో 'ప్రశ్న' పంచ మహాపాతకాలనూ మించిన మహాపాపమై పోయింది. శిక్షా స్మృతిని సవరించకుండానే ప్రశ్నించే వారిని శిక్షిస్తున్నారు. సామాజిక, రాజకీయ జీవితంలో ప్రశ్నను సహించే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమకు హాని చేస్తున్న వారిని సైతం ప్రశ్నించడానికి అవిధేయత చూపడానికి సాహసించలేక పోతున్నారు." (పేజి 77, 78)

'మరో ముఖ్య విషయం ఏమంటే మార్క్స్ 'నియతివాది'కాదు. మార్క్స్ గతితర్కంలో 'ఆవశ్యకత' (నెసెస్సిటి)లో 'యాదృచ్ఛికత' (చాన్స్) ఒక భాగంగా, దాన్ని వెన్నంటి ఉంటుంది. ఛాన్స్‌కు ఏ మాత్రం తావులేని 'శుద్ధ ఆవశ్యకత' ఉండదు. ఆవశ్యకతకు అతీతంగా ఛాన్స్ ఉండదు.' (పేజి 82)

'అనేక దొంతర్లు వున్న మన దేశంలో మెజారిటీ ప్రజలకు

కులం పుట్టుకతోనే వస్తుంది. అగ్ర కులాలకు చెందిన వారు తమ కులాధిక్యత గురించి గొప్పగా ఫీలవుతారు. ఇందులో ఒక సౌలభ్యం ఉంది. వ్యక్తిగా తనకు లేని ఆధిక్యత, విలువలను కుల సభ్యునిగా ఫీలవ్వచ్చు. దోపిడీ కోసం, అధికారం కోసం వివిధ అగ్రకులాల ధనికులు ఇతర కులాలకు వ్యతిరేకంగా తమ తమ కులస్తులను కూడగట్టి రెచ్చగొడుతున్నారు. ఈ కులతత్వం వల్ల ఆయా కులాల్లోని బీదలకు ఒరుగుతున్నదేమీ లేదు. ఐతే, మరో కులం పట్ల ద్వేషం వల్ల వారిలోని ద్వేషాగ్నికి ఇంధనం అందుతున్నది.' (పేజి 87)

'మార్క్సిజం గురించి అవగాహన లేకుంటే కమ్యూనిస్టులుగా మన ఆచరణ సత్ఫలితాన్ని ఇవ్వదు. అలాగే చాలామంది యువ కమ్యూనిస్టులు హేతువాదం, నాస్తిక ఉద్యమాల పట్ల తీవ్ర ఆకర్షణ, అభిమానం కలిగి ఉంటున్నారు. నిజానికి చాలా మంది హేతువాద, నాస్తిక ఉద్యమ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు కమ్యూనిస్టు వ్యతిరేకులు. మార్క్సిజం పట్ల వీరికి తీవ్ర అభ్యంతరాలు ఎందుకున్నాయో తెలుసుకోవాలి. ఈ క్రమంలో అస్తిత్వానికి, చైతన్యానికి ఉన్న సంబంధం గురించి మార్క్సిజం ఏం చెబుతుందో తెలుసుకోవడం చాలా అవసరం.' (పేజి 90)

అస్తిత్వం – చైతన్యం గురించిన మార్క్స్ భావనల్ని పరిచయం చేస్తూ రావు కృష్ణారావు గారు రాసిన 90 పుటల చిన్న పుస్తకం ఇది. డా. చెలికాని రామారావు స్మారక సమితి ప్రచురించిన ఈ గ్రంథం చివర 1934లో జర్మన్ కమ్యూనిస్టు పార్టీని విమర్శిస్తూ Wilhelm Reich అనే కమ్యూనిస్టు రాసిన వ్యాసంలోని అంశాల గురించి ప్రస్తావించడం సమకాలీనంగా ఈ రోజు అవసరమని నా భావన. కాలక్షేపం కోసం కాకుండా కాస్త సీరియస్ అధ్యయనం చేసేవారు చదవాల్సిన పుస్తకం. 20/– రూపాయల నామమాత్రపు విరాళానికి విశాలాంధ్రలో అందుబాటులో ఉంది ! ❑

# ఇక విజ్ఞానశాస్త్రాల పుస్తకాల మార్పే మిగిలింది!

**(27వ పేజీ తరువాయి)**

గంగా జలంలో స్నానం చేస్తున్నప్పుడు ఆయన ఈ విషయం కనిపెట్టాడు. ఆ అన్వేషణతో ఆయన ఎంత ఉద్వేగం పొందాడం టే, నగ్నంగానే భారత్ మాతా కీ జై అంటూ బైటికి పరుగెత్తాడు.

**జాతీయ ఆల్జీబ్రా**

ఎ ప్లస్ బిని కుండలాల్లో ఉంచి దాన్ని దానితోనే హెచ్చ వేసినప్పుడు, ఎ స్క్వేర్ ప్లస్ బి స్క్వేర్‌తోపాటు, 2ఎబి వస్తుందని అందరికీ తెలుసు. మరి ఈ అదనపు 2ఎబి ఎక్కడి నుంచి వచ్చింది? మీకు తెలుసా, ఆ అదనపు శక్తి ఒకరితో ఒకరు కలిసి ఉండి, ఒకరి మీద ఒకరు నమ్మకం ఉంచినప్పుడే వస్తుంది. ఈ 2ఎబి అదనపు శక్తి మీకు సాహసికమైన నిర్ణయాలు తీసుకునే శక్తినిస్తుంది. పిల్లలందరూ కూడా ఈ అదనపు శక్తిని దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికి వినియోగించాలి.

**న్యూరాలజీ**

కళ్లతో చూసినదాన్ని ఆకళింపు (ప్రాసెస్) చేసుకోవడంలో, నిలువ ఉంచుకోవడంలో కొంత మంది ప్రజ్ఞావంతులైన వ్యక్తులు ఇతోధిక సామర్థ్యంతో పుడతారు. వారి మెదడు, ఒక పేజీలో పంక్తి తర్వాత పంక్తి చదివే బదులు మొత్తం పేజీని ఒక ఫొటో గ్రాఫ్‌లాగ స్వీకరిస్తుంది. అంటే ఆ వ్యక్తి ఆ పేజీలో ఉన్నదాన్నం తా ఒక క్షణంలో గ్రహించే వీలు కలుగుతుంది. అందువల్ల ఆ వ్యక్తి జ్ఞాపకాలు కెమెరా మీద అందంగా కనబడతాయి. ఇటువంటి ప్రత్యేక మానసిక శక్తి ఉన్న మహా ప్రజ్ఞావంతులను "ఫొటోజెనిక్ జ్ఞాపకశక్తి" ఉన్నవారిగా పరిగణిస్తారు. అటువంటి ఫొటోజెనిక్ జ్ఞాపకశక్తికి ఉదాహరణగా చెప్పగల వ్యక్తి గురించి వివరాల కోసం దయచేసి అనుబంధం చూడండి.

**జీవశాస్త్రం**

స్టెం సెల్ సాంకేతిక పరిజ్ఞానం 4,500 సంవత్సరాల కింద భారతదేశంలో మొట్టమొదట ఆవిష్కృతమయింది. కౌరవులు గణనీయమైన ఆధిక్యత సాధించడం కోసం ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకున్న సుప్రసిద్ధ సందర్భం మహాభారత ఇతిహాసంలో నమోదు అయింది. ప్రాచీన భారతంలో ఈ స్టెం సెల్స్ ఉపయోగించి ఒక జీవశాస్త్రజ్ఞుడిని ప్రతిసృష్టి చేశారు. ఆ ప్రతిసృష్టి జీవశాస్త్రవేత్త విశిష్టమైన ప్లాస్టిక్ సర్జరీ సాంకేతిక పరిజ్ఞానాన్ని కనిపెట్టాడు. ఆ పరిజ్ఞానంతోనే మానవ దేహానికి ఏనుగు తలను అతికించారు.

**ఆస్ట్రోఫిజిక్స్**

భారతదేశానికి చెందిన శ్రీ నెయ్వేలి ఆరంస్ట్రాంగమూర్తి చంద్రగ్రహం మీద కాలుమోపి న తొలి మానవుడు. ఆయన ఆ అద్భుతాన్ని 2014లో సాధించాడు. 14 వేరువేరు పాలపుంతల లోని 17 గ్రహాలకు పుష్పక విమానాన్ని పంపిన ఏకైక దేశం కూడ భారతదేశమే. అంతేకాదు, ఒక్కరిని కాదు, ఇద్దరిని కాదు, 140 కోట్ల మందిని బ్లాక్ హోల్‌లోకి, కృష్ణ బిలంలోకి పంపించే మొట్టమొదటి దేశంగా కీర్తి సంపాదించడానికి చివరి అడుగులో ఉన్నది కూడ భారతదేశమే. ఈసారి జరిగే హేతు బద్ధీకరణలో ఈ మార్పులన్నిటినీ చేర్చవలసిందిగా నేను ఎన్‌సిఇఆర్‌టికి విజ్ఞప్తి చేస్తున్నాను. ❑


# కమ్యూనిస్టు మానిఫెస్టో శైలి



- కొండూరి వీరయ్య

**మార్క్స్‌ ఓ సాంస్కృతిక రచయిత అన్న కోణంలో పరిశోధన సాగించిన స్టాన్లీ ఎడ్గర్‌ హైమన్‌ కమ్యూనిస్టు ప్రణాళిక ఓ అసామాన్యమైన వాక్చాతుర్యం అని వ్యాఖ్యానిస్తారు. కేవలం కమ్యూనిస్టు ప్రణాళిక వెలువడిన 130 ఏళ్ల తర్వాత కూడా ప్రపంచ వ్యాప్తంగా ఈ గ్రంధాన్ని పాఠకులు చదువుతున్నారంటే అది కేవలం దానిలో ఉన్న వాక్చాతుర్యం కోసం మాత్రమే కాదు. దానిలో ఉన్న సారాంశం కోసం చదువుతున్నారు.**

కమ్యూనిస్టు ప్రణాళిక ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాద దృక్పథం, మానవచరిత్ర పురోగమనంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బడా వ్యాపారులు, సంపద కేంద్రీకరణ, పదేపదే పునరావృతమ వుతున్న సంక్షోభాలతో కూడిన ఓ దశ మాత్రమేననీ, ఈ పెట్టు బడిదారీ సంక్షోభమే నూతన ప్రపంచ నిర్మాణానికి తలుపులు తెరుస్తుందన్న విశ్లేషణ కోసం చదువుతున్నారు. కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్‌ ఏంగెల్స్‌లు చేసిన ఈ విశ్లేషణే నేటికీ ఈ గ్రంథం పట్ల ప్రపంచవ్యాప్తమైన ఆసక్తికి కారణం. 'కమ్యూనిస్టు ప్రణాళిక గ్రంథంలాగా భవిష్యత్తు పరీక్షలకు నెగ్గిన గ్రంథాలు బహు అరుదు' అని బ్రిటిష్‌ రాజనీతిజ్ఞుడు హెరాల్డ్‌ జె లాస్కీ వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు ప్రణాళికలోని చారిత్రక భౌతిక వాద పద్ధతిని పాటించటం ద్వారా గత 130 ఏళ్ల ప్రపంచ పరిణామాణాలను విశ్లేషించి అర్థం చేసుకోవచ్చని మార్క్సిస్టులు అంటున్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక ఇచ్చే సందేశం కోసమే ఈ గ్రంథాన్ని నేటికీ చదువుతున్నా ఈ ప్రణాళిక రచనలో మార్క్స్‌ ఏంగెల్స్‌ ప్రయోగించిన శైలి ఈ గ్రంథం పట్ల తొలితరం పాఠకులను ఆకర్షించిన అంశాల్లో ఒకటని చెప్పటానికి సందేహించనవసరం లేదు. కమ్యూనిస్టు ప్రణాళిక రచనా శైలి గురించి ఇప్పటి వరకూ వెలుగు చూడని కోణాలను పాఠకుల ముందుంచే ప్రయత్నమే ఇది.




ఆక్స్‌ఫర్డ్‌ ఇంగ్లీషు డిక్షనరీ ప్రకారం ప్రణాళిక (మానిఫెస్టో) అంటే 'ఒక రాజ్యం కానీ, రాజు గానీ, కొందరు వ్యక్తుల సమూహం కానీ లేదా ఒక వ్యక్తి కానీ ప్రజాహితం లేదా ప్రజల కోసం చేసే ప్రకటన'. ఈ నిర్వచనాన్ని గమనించినప్పుడు కమ్యూనిస్టు ప్రణాళిక డిక్లరేషన్‌ ఆఫ్‌ ఇండిపెండెన్స్‌ ప్రకటనను (అమెరికా స్వాతంత్ర్య ప్రకటన) పోలి ఉంటుంది. 'మానవాళి కలిగి ఉన్న అభిప్రాయాలను గౌరవిస్తూ' యావత్‌ ప్రపంచాన్నీ ఉద్దేశించి చేసిన ప్రకటన డిక్లరేషన్‌ ఆఫ్‌ ఇండిపెండెన్స్‌ అయితే కమ్యూనిస్టు ప్రణాళిక 'ప్రపంచం ముందు కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలను బాహాటంగా వెల్లడించటానికి ఇది తగిన సమయం' అని చెప్తోంది. అయితే ఈ రెండు ప్రకటనల శైలిలో ఉన్న వ్యత్యాసాలు ఆయా రచయిత సైద్ధాంతిక సామర్థ్యం, లోతులు, ప్రాపంచిక దృక్పథాల మధ్య ఉన్న వ్యత్యాసాల్లోని తేడాలతో ముడిపడి ఉన్నాయి. డిక్లరేషన్‌ ఆఫ్‌ ఇండిపెండెన్స్‌ విప్లవ నినాదం కాదు. లోకజ్ఞానం (కామన్‌ సెన్స్‌) అన్న తన గ్రంథంలో థామస్‌ పైన్‌ విప్లవ నినాదమిచ్చారు. వాద ప్రతి వాదనలు కాదు. ఎందుకంటే డిక్లరేషన్‌ ఆఫ్‌ ఇండిపెండెన్స్‌ కొన్ని పూర్వమే స్థిరపడిన, స్థిరపర్చబడిన సత్యాలతో మొదలవు తుంది. కాలం నిరూపించిన సత్యాల గురించి వాదోపవాదనలు అక్కర్లేదు. యూరప్‌లోని ఛాన్సలరీస్‌లో (ఆస్థానాలు, దర్బారుల్లో) ఈ ప్రకటనను చదివి వినిపిస్తారని, తద్వారా తమ స్వాతంత్ర్య సాధన ప్రయత్నాలకు కొద్దిపాటి మద్దతు అయినా దక్కుతుందని ఆశతో చేసిన ప్రకటన అది. తర్వాతి కాలంలో ఈ ప్రకటనను, అందులోని భాషను, పద ప్రయోగాలను ఉన్నత స్థాయిలో నిలబెట్టారు. డిక్లరేషన్‌ ఆఫ్‌ ఇండిపెండెన్స్‌లో తీవ్రమైన అభ్యంతరకరమైన పదాలు జెఫర్సన్‌ మాంటిసెల్లోలో నిలువెత్తున ఉన్న స్థంభాల్లాగా అలానే నిలిచిపోయాయి.

కమ్యూనిస్టు ప్రణాళిక దీనికి భిన్నమైనది. యూరోపియన్‌ పాలకవర్గం చేస్తున్న దాడులను తిప్పికొడుతూ ప్రపంచ కార్మిక వర్గాన్ని కార్యోన్ముఖులను చేసేందుకు ఇచ్చిన పిలుపే కమ్యూనిస్టు ప్రణాళిక. కమ్యూనిస్టు ప్రణాళికలో చరిత్ర ఉంది. వాద ప్రతివాదాలు ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానపు ప్రయాణం గురించిన రేఖాచిత్రమూ ఉంది. అందుకే కమ్యూ

నిస్టు ప్రణాళికలోని వాక్యాలు నిక్కచ్చిగానూ, వైవిధ్యంతోనూ, స్పష్టతతోనూ, సజీవంగానూ, అనేక ఉపమానాలతో కూడుకుని ఉంది. రెండింటిలోనూ ఉన్న ప్రకటన, భాష, భావం రీత్యా చూసుకున్నప్పుడు కమ్యూనిస్టు ప్రణాళిక సాంప్రదాయ శైలిలో ఉంటే డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్ ప్రకటన నియో క్లాసికల్ శైలిలో ఉంది. బూర్జువాలతో పోరాడుతున్న కార్మికులతో చేతులు కలపటానికి కులీనస్వామ్యం ప్రయత్నం చేసినప్పుడల్లా ఆయా పోరాటాల సందర్భంగా చర్చలకో వ్యూహరచనకో కులీనుల ఇళ్లను సందర్శించిన కార్మికులు ఆయా ఇళ్లల్లో వేళ్లాడుతున్న జమీందారీ చిహ్నాలు, ఆయుధాలు చూసినప్పుడు 'గౌరవాన్ని గుండెల మీద పెట్టుకుని ఆయుధాలు భుజాలకు తగిలించుకున్న' అనే హైన్ వాక్యాలు గుర్తొస్తాయి. ఎందుకంటే భూస్వామ్య రాచరికవర్గం తమ ఆధిపత్యాన్ని నిలిపి ఉంచటానికి దోహదం చేసిన ఈ చిహ్నాలకు ఎంతగానో రుణపడి ఉంది. మార్క్స్ ఏంగెల్స్‌లు కార్మికులను బూర్జువా వర్గానికి సమాధులు తవ్వే వారని సంబోధించినప్పుడు ఆ భాష మట్టి వాసనలతో కూడుకుని ఉంది. కమ్యూనిస్టు ప్రణాళిక ఎన్నో సందర్భాల్లో ఉప మానాల ప్రస్తావన ఉన్నా కొన్ని ఉపమానాలు మాత్రం పదేపదే పునరావృతమయ్యాయి. పదే పదే పునరావృతమైన అంశాల్లో ఒకటి పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాల గురించిన అంశం.

పెట్టుబడిదారీ వ్యవస్థ తన ప్రయోజనాల కోసం నిరంతరం ఉత్పత్తి శక్తుల సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతుంది. దాంతో ఆస్తి సంబంధాలు తీవ్రమైన పరస్పర వైరుధ్యంలోకి ప్రవేశిస్తాయి. మధ్యయుగాల్లో చిన్న చిన్న కార్ఖానా దశలో జరిగే ఉత్పత్తి సంబంధాలకూ భూస్వామ్య సమాజపు ఆస్తి సంబంధాలకు మధ్య వైరుధ్యం నెలకొన్నట్టుగానే పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఉత్పత్తి శక్తులు అభివృద్ధికి, ఆస్తి సంబంధాల్లో ఉన్న స్థితిస్థాపకత(యధాతథ స్థితి) తీవ్రమైన వైరుధ్యం నెలకొంటుంది. భూస్వామ్య వ్యవస్థలో ఉత్పత్తి సంబంధాలను స్వేఛ్ఛా వాణిజ్యంతో బూర్జువా ఉత్పత్తి సంబంధాలు ఆక్రమిం చాయి. ఈ వాక్యాలు చదివినప్పుడు సమీకృతాభివృద్ధి పర్యవ సానంగా ఎదిగే ఉత్పత్తి శక్తుల ఎదుగుదలకు ఓ దశలో అదే వ్యవస్థలోని ఆస్తి సంబంధాలు ఆటంకంగా మారుతున్న దృశ్యం, ఉత్పత్తి శక్తులు ఈ సంకెళ్లను ఛేధించుకుని నూతన సమాజం దిశగా పురోగమిస్తున్న దృశ్యం కళ్ల ముందు కనిపిస్తుంది. అభివృద్ధి ఎక్కడా ఆగిపోలేదు. భూస్వామ్య సమాజంలోని ఆస్తి సంబంధాలు పెరుగుతున్న ఉత్పత్తి శక్తుల శక్తి సామర్థ్యాల ముందు మోకరిల్లాలి. అదే విధంగా బూర్జువా సమాజంలోని ఉత్పత్తి సంబంధాలు, ఆస్తి సంబంధాలు ఆ సమాజంలోని ఉత్పత్తి శక్తులు సృష్టించే సంపదను ఇముడ్చుకో లేవు. ఉత్పత్తి శక్తులు, వాణిజ్యాల ఎదుగుదలను పాతకాలపు ఆస్తి నమూనాల చట్రంలో ఇమిడ్చి కుదింపచేయటం అన్ని వేళలా సాధ్యం కాదు. ఈ వైరుధ్యం ఎప్పుడో ఒకప్పుడు బద్దలు కావల్సిందే అన్న అర్థంలో వాక్యాలు చదివినప్పుడు సమాజ మార్పు, పురోగమనం, నూతన వ్యవస్థ దిశగా ప్రయాణం లీలగానైనా గోచరిస్తుంది (పే.116).

ఈ రచనలో మనకు పదే పదే కనిపించే మరో అంశం బూర్జువా వ్యవస్థను నగ్నంగా చిత్రీకరించడం. 'మతం మాటున దాక్కున్న బూర్జువా దోపిడీ ఆచరణలో ప్రజలను ప్రత్యక్షంగా, నిస్సిగ్గుగా, నగ్నంగా దోపిడీ చేస్తుంది. తన దోపిడీని చలామణీ చేసుకోవడానికి మతం, రాజకీయ రంగాల్లో అనేక భ్రాంతులను కలుగచేస్తుంది బూర్జువా వ్యవస్థ. (92)'. భూస్వామ్య వ్యవస్థ నిర్మించిన అన్ని రకాల పితృస్వామిక, భూస్వామ్య, స్థబ్దతతో కూడిన సంబంధాలను బద్దలు కొట్టేంత వరకూ పెట్టుబడిదారీ వ్యవస్థ విప్లవాత్మక పాత్ర పోషించింది. ఈ క్రమంలో పెట్టుబడి దారీ వ్యవస్థ మనిషికి తన నిజమైన స్థితిని, సంబంధాలను, సామాజిక వాస్తవాన్ని పరిచయం చేస్తుంది. మతం మత్తులో విహరిస్తున్న మనిషిని భూమ్మీద నిలబెడుతుంది. అన్ని రంగా ల్లోనూ ఇది వాస్తవికంగా జరుగుతున్న పరిణామమే. “సాటి మనిషిని తమపై పెత్తనం చేసే పెత్తందారులతో బంధించిన అన్ని రకాల మార్మిక సంబంధాలను బద్దలు కొట్టి మనిషికి మనిషికీ మధ్య కేవలం నగ్నమైన నగదు సంబంధం, స్వార్థం తప్ప మరేమీ మిగలని, మిగల్చని వ్యవస్థను బూర్జువా సమాజం ముందుకు తెస్తుంది(91-92). అప్పటి వరకూ నోరెళ్లబెట్టుకుని ఆశ్చర్యంతో చూసే వృత్తులు, హోదాల్లోని డొల్లతనాన్ని బట్టబయలు చేసింది. కుటుంబ సంబంధాల్లోని భావోద్వేగాలను తొలగించి కుటుంబ సంబంధాలు కేవలం ఆర్థిక సంబంధా లేనని బూర్జువా వ్యవస్థ రుజువు చేసింది (91-92). పెట్టుబడి శక్తి ముందు లొంగిపోయిన కార్మిక శక్తి లేశమాత్రమైనా జాతీయతను నిలుపుకోలేని దుస్థితికి చేరుకుంటుంది.

కార్మికవర్గం విషయంలో కమ్యూనిస్టు మానిఫెస్టో రెండు రకాలైన ఉపమానాలను పదేపదే ఉపయోగించింది. కార్మికవర్గం సమాజంలో అట్టడుగు వర్గం, పునాది వర్గం అన్నది మొదటి ఉపమానం. మధ్యతరగతిలోని దిగువ శ్రేణి, దుకాణదారులు, వృత్తిదారులు క్రమేణా కార్మికవర్గంలో చేరిపోతారు.(పేజీ 96). పెటీ బూర్జువా వర్గం తన స్థానాన్ని కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నా బూర్జువా వర్గం సృష్టించే పోటీ వాతావరణంలో ఈ వర్గానికి చెందిన సభ్యులు మాత్రం పదేపదే వర్గాంతరం చెంది కార్మికవర్గంలో చేరిపోతూ ఉంటారు (115). ఈ విశ్లేషణ అంతా వెరసి కార్మికవర్గం మొత్తం బూర్జువా వ్యవస్థపై తిరుగుబాటు చేస్తుంది. 'ప్రస్తుత సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న కార్మికవర్గం మిగిలిన సమాజంలో ఉన్న మిగిలిన వర్గాలు దోపిడీకి వ్యతిరేకంగా సాగే ప్రయత్నంలో

దిగబడకుండా ఈ దోపిడీకి వ్యతిరేకంగా తిరగబడే స్థితిలో ఉండదు.(101). అనివార్య స్థితిలో పరిశ్రమలను విస్తరిస్తున్న బూర్జువా వర్గం అదేరకమైన అనివార్య స్థితిలో విశాల కార్మిక వర్గాన్ని విప్లవ సమీకరణలో భాగస్వాములను చేస్తుంది. తద్వారా బూర్జువా వ్యవస్థ మౌలిక పునాదినే ఛేదిస్తుంది. ఈ బలమైన పునాది తొలగిపోయిన పక్షంలో బూర్జువావర్గం తన ఉన్నత స్థానం నుంచి ఎకాఎకిన చారిత్రక నేపథ్యం సృష్టించిన సమాధిలోకి చేరుతుంది. 'బూర్జువా వర్గం పతనం, కార్మికవర్గం విజయం చారిత్రక అనివార్యతలు'(102),

కార్మికవర్గాన్ని మార్క్స్ సైన్యంతో పోలుస్తారు. 'గుంపులుగా ఉన్న కార్మికులు క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా ఫ్యాక్టరీల్లో జమ కూడతారు. పారిశ్రామిక సైన్యంలా ఈ కార్మికులు దొంతర్లతో కూడిన అధికార వ్యవస్థ కనుసన్నల్లో పనిచేస్తూ ఉంటారు. (96). పరిశ్రమల్లో కార్మికులను సైన్యంలా మల్చి పని చేయిం చుకుంటున్న పారిశ్రామిక వర్గం భవిష్యత్తులో తనకు సమాధులు తవ్వే శతృవులను తయారు చేసుకుంటుంది. తద్వారా ఆధునిక సమాజం రెండు వైరి శిబిరాలుగా చీలిపోయి ఉంటుంది. బూర్జు వా వర్గం, కార్మికవర్గం అన్న వైరి శిబిరాలుగా విడిపోతుంది. ఈ రెండు వర్గాల మధ్య జరిగే పోరాటం దాదాపుగా అంతర్యుద్ధం లా ఉంటుంది. కాలక్రమంలో ఈ అంతర్యుద్ధం పూర్తిస్థాయి విప్లవంగా బద్దలవుతుంది. విశాల కార్మికవర్గాన్ని సమీకరించ టంలోనే కమ్యూనిస్టుల విజయం ఆధారపడి ఉంటుంది. ఇక్కడ విషయమేమిటంటే భూస్వామ్య కులీన వర్గాలకు వ్యతిరేకంగా పోరాడే క్రమంలో బూర్జువా వర్గం శాశ్వత శతృవర్గాన్ని తయారు చేసుకుంటుంది. అటువంటి శతృవర్గాన్ని కార్మికవర్గం రూపంలో సాయుధులను చేస్తుంది.

యుద్ధ చిత్రణకు సంబంధించిన వివరణ కూడా మనకు కమ్యూనిస్టు ప్రణాళికలో కనిపిస్తుంది. పెట్టుబడిదారీ వర్గం నిరంతరం యుద్ధంలో మునిగి తెలుతుందనీ, తొలుత భూస్వామ్యపు కులీన వర్గంపై యుద్ధం చేస్తుందనీ, తర్వాత పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి అవరోధంగా ఉన్న తోటి వర్గ మిత్రులపై యుద్ధం చేస్తుందనీ, తర్వాత విదేశీ పెట్టుబడిదారీ వర్గంతో యుద్ధం చేస్తుందని మార్క్స్ ఏంగెల్స్‌లు ప్రణాళికలో ప్రస్తావిస్తారు. అంతేకాదు. పెట్టుబడిదారీ పూర్వపు ఉత్పత్తి సంబంధాలు కొనసాగుతున్న దేశాలతో పెట్టుబడిదారీ దేశాలు శాశ్వతమైన యుద్ధాన్ని ప్రకటిస్తాయని వివరిస్తారు. విదేశీ మార్కెట్ల వెతుకులాటలో "కారు చౌకగా తయారయ్యే సరుకులే చైనా గోడలను సైతం తునాతునకలు చేయగలిగిన మందుగుండు సామగ్రి. ఈ సరుకులే విదేశీయులను ఈసడించుకునే ఆదిమ తెగలను సైతం లొంగదీసుకుంటాయి. నాగరికత అని చెప్పబడే ధోరణులను ఆయా సమాజల నడి బొడ్డుకు తీసుకెళ్తాయి.' ఇక్కడ మార్క్స్ ఏంగెల్స్‌లు బ్రిటిష్ సామ్రాజ్యం తమ వ్యాపారస్తులకు నల్లమందు అమ్ముకునేందుకు అవకాశాలు కల్పించాలని ఒత్తిడి తెస్తూ చైనాతో సాగించిన యుద్ధాల గురించి ప్రస్తావిస్తున్నారు. ఈ యుద్ధాల అనంతరం నల్లమందు మోసుకెళ్లే బ్రిటిష్ ఓడలు చైనా రేవు పట్టణాల్లో లంగరు వేయటం చైనా సమాజాన్ని నల్ల మందు మార్కెట్‌గా మార్చుకోవటం చారిత్రక సత్యాలే. పాశ్చాత్య దేశాల పెట్టుబడి దారీ వ్యవస్థ మొత్తం ప్రపంచంపై మార్కెట్ల కోసం సాగించే యుద్ధానికి శాంతియుత స్వేఛ్చా వాణిజ్యమని పేరు పెట్టిందని ఎగతాళి చేస్తారు మార్క్స్.

ఇక్కడ వైరుధ్యం నాటకీయమైనదైతే వర్గపోరాటం కమ్యూనిస్టు ప్రణాళికకు ప్రజాతంత్ర స్వభావాన్ని సమకూరుస్తుంది. ప్రత్యేకించి కమ్యూనిజం గురించి కమ్యూనిస్టుల గురించి ప్రత్యర్థులు చేసే విమర్శలకు సమాధానాలు వివరణలు ఇచ్చే కమ్యూనిస్టు ప్రణాళిక రెండో భాగంలో ఈ ధోరణి కనిపిస్తుంది. ఈ భాగం ప్రధానంగా బూర్జువా వర్గ ప్రతినిధులతో జరిపిన సంవాదంలా కనిపిస్తుంది. ఈ భాగం చదువుతున్నపుడు పాఠకుడికి ఓ బహిరంగ సభలో ఉపన్యసిస్తున్న వక్తను గేలి చేస్తూ ఉక్రోషంగా విమర్శించే ఓ బృందం తారసపడితే వారికి సమాధానమివ్వటానికి ఉపన్యాసకుడు ప్రయత్నం చేసే దృశ్యం కళ్లముందు కనిపిస్తుంది. ఈ వక్తకున్న విషయ పరిజ్ఞానం, లోకజ్ఞానం, వెటకారం, ఆత్మ విశ్వాసంతో సభను ఆటంకపర్చ టానికి వచ్చిన ముష్కరులపై విజయం సాధిస్తారు.

వ్యక్తిగత ఆస్తిని రద్దు చేయాలన్న నినాదం వినపడగానే మీరు గంగవెర్రులెత్తుతారు. నిజానికి ఇప్పుడున్న సమాజంలో పదింట తొమ్మిది వంతుల మంది చేతుల్లో వ్యక్తిగత ఆస్తి అనేదే లేదు. కానీ బూర్జువా ఆస్తులను రద్దు చేయటం గురించి మేము మాట్లాడుతున్నప్పుడు మీరు అర్థం లేని అభ్యంతరాలు లేవనెత్తటం మానేయండి. బూర్జువా అర్థంలో స్వేచ్ఛ, సంస్కృతి, చట్టం, న్యాయం అన్న సూత్రాలు వల్లె వేయకండి. స్వార్థపూరి తమైన తప్పుడు అవగాహనతోనే మీరు మొత్తం ప్రకృతి సూత్రాలను, హేతుబద్ధతను, సామాజిక రూపాలను అదుపు చేయాలనుకుంటారు. ఇవన్నీ ప్రస్తుత ఉత్పత్తి విధానం నుండి పుట్టుకొచ్చాయే తప్ప శాశ్వతమైనవి కాదు. మీకు ముందున్న పాలకవర్గాలు కూడా ఇవే అభిప్రాయాలను కలిగి ఉన్నాయి. పై వివరణలో 'మీరు గంగవెర్రులెత్తుతున్నారు' 'మాతో పెట్టుకోవద్దు' వంటి పదాలు సంవాద ధోరణిని సూచిస్తున్నాయి. ఓ దశలో ఉపన్యాసకుడు సభకు అంతరాయం కలిగించటానికి వచ్చిన వాళ్లకున్న పొరపాటు అవగాహనలు, గందరగోళాన్ని సభికుల దృష్టికి తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నంలాగా కూడా కనిపిస్తుంది.

'మీ కమ్యూనిస్టులు భార్యలను కూడా జాతీయం చేస్తారంటూ బూర్జువా వర్గం గగ్గోలు పెడుతుంది. బూర్జువావర్గం తమ

సొంత భార్యలను ఉత్పత్తి సాధనంగానే చూస్తోంది. ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయాలన్న నినాదం వినపడగానే బూర్జువా వర్గం దృష్టిలో భార్య కూడా ఉత్పత్తి సాధనమే కాబట్టి సహజంగానే జాతీయం చేయాలన్న ప్రతిపాదాన్ని మహిళలకు కూడా వర్తింప చేస్తూ మాట్లాడతారు. ఇక్కడ మహిళలను కేవలం ఉత్పత్తిసాధనాలుగా చూసే దృష్టి నుండి బయటపడటం, మహిళలను విముక్తి చేయటం అన్న ధ్యాస కూడా రాని వాళ్లు ఈ బూర్జువా వర్గం.'

విమర్శనాత్మక వెటకారం మరోచోట పరాకాష్టకు చేరుకుంటుంది. అది యాంటీ క్లయిమాక్స్‌ను తలపిస్తుంది. కమ్యూనిస్టు ప్రణాళిక ఆరంభ వాక్యమే "యూరప్‌ను ఓ భూతం వెంటాడుతోంది. ఆ భూతం పేరు కమ్యూనిజం. ఈ భూతాన్ని తరిమికొట్టడానికి పాత కాలపు యూరప్‌లోని పాలక వర్గాలన్నీ జార్ చక్రవర్తి, మెటర్నిక్, గిజోట్, జర్మనీ గూఢచారులు, ఫ్రెంచి రాడికల్స్ ఏకమయ్యారు.' రోమన్ చర్చి మొదలు రష్యాలోని ఆర్థడాక్స్ చర్చి, దాంతో మిత్రత్వం నెరుపుతున్న జార్ చక్రవర్తి, ఆస్ట్రియా రాచరికం, లూయీ ఫిలిప్ నాయకత్వంలోని బూర్జువా నియంతృత్వం, ఫ్రాన్స్‌లోని ఉదారవాద బూర్జువా మేధావులు, ప్రష్యా పోలీసు ఏజెంట్లు శైశవ దశలో ఉన్న కమ్యూనిజాన్ని చూసి భయకంపితులై దాన్ని పసికందుగా ఉన్నప్పుడే పీకనులమటానికి ఒక్కటవుతారు. వీళ్లకుతోడు రష్యా, ఆస్ట్రియా, ప్రష్యా చక్రవర్తులతో పాటు ఈ కూటమికి ఓ కొసన ప్రపంచ క్రైస్తవాధిపతి పోప్ నిలబడితే మరో కొసన ప్రష్యా పోలీసు ఏజెంట్లు నిలబడతారు. కమ్యూనిజం అనే భూతాన్ని వాళ్లే సృష్టించి ఇప్పుడు దాన్ని తుదముట్టించటానికి అడ్డగోలు ప్రయత్నం చేస్తున్న యూరోపియన్ పాలకవర్గం పట్ల రచయితకున్న జుగుప్సాకరమైన వెటకారం ఈ వర్ణనలో కనిపిస్తుంది. మరో చోట కొత్తగా పుట్టుకొస్తున్న పారిశ్రామిక బూర్జువా వర్గం తన లాభాపేక్ష కోసం మత భావనలు, వీరత్వం, ఆడంబరమైన భావోద్వేగాలను సైతం పక్కకు తోసేస్తారు అని గుర్తు చేస్తారు మార్క్స్. ఇక్కడ మధ్య యుగాల సాంప్రదాయకపు భావోద్వేగాలు, వీరత్వం, మార్మికతల నుండి ప్రజలను బయటికి లాక్కొస్తున్న బూర్జువా సమాజ విలువలు గుర్తు చేస్తున్నారు రచయి తలు. ఏమీ సాధించలేని పెటీ బూర్జువా వర్గం తమ అర్భకత్వాన్ని ఈ మధ్యయుగాల నాటి విలువల మాటున దాచిపెడుతుంది. అదే సమయంలో ఈ భావోద్వేగాలు, పెటీ బూర్జువా లక్షణాలన్నీ ఏకరవుపెడతూ వీటిలో ఒక్కటి కూడా ఆధునిక ప్రపంచంలో నిలదొక్కుకోలేదని మార్క్స్ ఏంగెల్స్‌లు స్పష్టం చేస్తున్నారు. దీంతోపాటు మధ్య యుగాల భావజాలం, వర్తమాన సమాజపు భావజాలాలు వాస్తవాన్ని కప్పిపెడుతున్నాయని కూడా వివరిస్తున్నారు.

కులీన వర్గం గురించిన వ్యాఖ్యానాల్లో శైలి రీత్యా ప్రస్తావించుకోదగిన మరో సందర్భంలో మార్క్స్ "బయటికి ఎంతో వాగాడంబరంతో మాట్లాడినా ఆచరణలో(ఈ వర్గం) పారిశ్రామికీకరణ అందించిన బంగారపు యాపిల్ పళ్లు అందుకోవడానికి ప్రేమను తాకట్టు పెట్టారు. వెచ్చని ఉన్ని కోసం, బీటు రూట్‌తో తయారు చేసిన చక్కెర, బంగాళా దుంపలతో తయారు చేసిన మద్యం వంటి వాటి కోసం గౌరవాన్ని తాకట్టు పెట్టారు" అని ఎగతాళి చేస్తారు. బంగారపు యాపిల్ పళ్ల గురించిన దేవలోకపు కథనాలు పక్కన పెట్టినా జర్మనీకి చెందిన భూయజమానులు తమ మందల్లోని గొర్రెల నుండి ఉన్నిని, బీటు రూట్ వేళ్ల నుండి చక్కెరను, బంగాళా దుంపల రసం నుండి మద్యాన్ని తయారు చేసి అమ్ముకునే క్రమంలో తమ కులీన తరగతి వీరికి గుర్తు రాదు. ప్రేమ, సత్యం, గౌరవం వంటి ఉన్నత పదాలకు బదులు వ్యాపారంలో వచ్చే కళ్లు మిరుమిట్లు గొలిపే లాభాలు, ఫలాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని విరుచుకు పడ్డారు. మనిషికి గుర్తింపు, ధీరత్వాన్ని తెచ్చి పెట్టే గౌరవానికి బదులు బంగాళా దుంపల రసంతో చేసే మద్యం అమ్మకాల ద్వారా వచ్చే గౌరవమే ఎక్కువ ప్రయోజనం అని భావించారు.

ఇటువంటి యాంటీ క్లయిమాక్స్ కథనాలు ఎన్ని ప్రస్తావించినా ఆచరణలో ముగింపుకు వచ్చేసరికి "పారిశ్రామిక రంగం విస్తరించటంతో కార్మికవర్గం సంఖ్య రీత్యా గణనీయంగా విస్తరిస్తోంది. బలం పెంచుకుంటుంది. పెద్ద సంఖ్యలో కేంద్రీ కృతమవుతుంది. అంతకంతకూ తన శక్తిని తాను గుర్తించు కోగలుగుతుంది" అని గుర్తు చేస్తారు. వివిధ వర్గాల్లో వచ్చే మార్పుల గురించి మార్క్స్ చేసిన ప్రస్తావనలు, విశ్లేషణల్లో కార్మిక వర్గం తన శక్తి గురించి తాను తెలుసుకోవటం ఈ పరిణామాలకు కీలకమైన ముగింపు అని మార్క్స్ వ్యాఖ్యానిస్తారు. ఇక్కడ క్లయిమాక్స్ ఏమిటంటే శ్రమ శక్తి వినియోగంలో నిరంతరం పరస్పరం పోటీపడే రెండు ధోరణులు, పోటీతత్వం, నిర్మాణం ఒక దానితో ఒకటి తోడుగా సాగుతున్నా ఈ రెండిటిలో నిర్మాణం కీలకమైనదిగా మార్క్స్ భావిస్తారు. "కార్మికులందరినీ ఓ వర్గంగా నిర్మాణం చేయటం తర్వాత ఈ వర్గాన్ని ఓ రాజకీయ పార్టీగా తీర్చి దిద్దటం అనే ప్రయత్నాలు ఉపాధి కోసం కార్మికులు పోటీ పడుతూ ఉండటంతో పదేపదే ఎదురుదెబ్బలకు గురవుతున్నాయి. ఒకసారి పడిపోయి తిరిగి లేచేటప్పుడు ఈ వర్గం మరింత శక్తివంతంగా మారుతుంది. ఈ వివరణ ఇస్తున్నప్పుడు మార్క్స్ ప్రయోగించిన పద బంధాలు గమనిస్తే కార్మికవర్గం శక్తి పుంజుకోవటం నిరంతరం జరిగే ప్రక్రియ అన్న అర్థాన్నిస్తుంది. ఈ విధంగా కార్మికవర్గం గురించి మాట్లాడిన అంశాలు, బూర్జువా, కులీన వర్గాల గురించి మాట్లాడిన అంశాలు ఆయా వర్గాల పురోగమన తిరోగమన ధోరణులను ప్రతిఫలించేవిగా ఉన్నాయి.

కమ్యూనిస్టు ప్రణాళికలో అనేకచోట్ల మార్క్స్ ప్రయోగించిన పరస్పర విరుద్ధ భావనలు వెంటవెంటనే వివరించిన తీరు

సందర్భోచితంగానే కాక మనోరంజకంగా కూడా ఉంటుంది. అటువంటి సందర్భాలు మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం. "బూర్జువా సమాజంలో అహర్నిశలూ పని చేసేవాడికి అంతిమంగా ఏమీ దక్కదు. అన్నీ దక్కించుకునేవాడు పని చేయడు" అని ఓ చోట ప్రస్తావిస్తే 'ఏ దశలోనైనా పాలకవర్గ భావాలే సార్వత్రిక భావాలుగా చలామణి అవుతాయి' అని మరోచోట ప్రస్తావిస్తారు. మరో సందర్భంలో "పార్సన్ భూస్వామితో చెట్టాపట్టాలేసుకుని నడుస్తూ క్లరికల్ సోషలిజం, ఫ్యూడల్ సోషలిజం... క్రిస్టియన్ సోషలిజం వంటి భావనలు పూజారులు కులీన వర్గపు భారాన్ని కొంతైనా తగ్గించటానికి చేసే వ్యవర్థ ప్రయత్నాలే తప్ప మరోటి కాదు." అంటారు. మరోచోట కమ్యూనిజం కార్మికులకు మాతృ దేశం లేకుండా చేస్తుందన్న ఆరోపణలకు సమాధానంగా మార్క్స్ ఏంగెల్స్‌లు "కార్మికులకు సొంత దేశమంటూ ఏమీ లేదు. వాళ్ల దగ్గర లేని దేన్నైనా ఎవరూ తీసుకోలేరు" అని స్పష్టం చేస్తారు.

ఇటువంటి వాక్యాలన్నీ సుదీర్ఘ వివరణలతో కూడిన పేరా గ్రాఫ్‌లకు ముగింపు వాక్యాలుగా ఉండటాన్ని మనం గమనించవచ్చు. శతాబ్దాల తరబడి బూర్జువా వర్గం సాధిస్తున్న సాగిస్తున్న పురోగతి గురించి సమగ్రంగా వివరించిన తర్వాత అంతిమంగా బూర్జువా వర్గం రాజకీయంగా పైచేయి సాధించిం ది అంటారు. ఈ చివరి వాక్యం ఆ పేరాగ్రాఫ్‌లో వివరించిన ప్రతి సందర్భానికీ దర్పం పట్టేదిగా ఉంటుంది. ఈ వివరణకు ముక్తాయింపుగా మార్క్స్ ఏంగెల్స్‌లు "కార్యనిర్వాహక వర్గం అంటే మరేమీ కాదు. మొత్తం బూర్జువా వర్గానికి సంబంధించిన కార్యకలాపాలు చక్కబెట్టే మేనేజింగ్ కమిటీయే" అంటారు.


అటువంటి వాక్యాలకు ముందు ఒక్కోసారి 'ఒక్క మాటలో చెప్పాలంటే' 'క్లుప్తంగా చెప్పాలంటే' అన్న పదాలతో మొదల వటం కూడా గమనించవచ్చు. ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయాలన్న ప్రతిపాదనపై విరుచుకుపడే వారిని ఉద్దేశిస్తూ అసలు ఉత్పత్తి సాధనాల యాజమాన్యమే లేని వారు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాల్సిన అవసరం లేదనీ, వాళ్లు వ్యతిరేకిస్తున్నారు అంటే ఖచ్చితంగా అటువంటి పని వలన వారికి నష్టం జరుగుతుందని తెలిసే వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేస్తూ ఏ వాక్యం ఎవరిని ఉద్దేశించిందో స్పష్టంగా ప్రస్తావిస్తారు. 'ఒక్కమాటగా చెప్పాలంటే మేము మీ ఆస్తులు లాగేసుకోను న్నామని మాపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. నిజానికి మేము చెప్పేది కూడా అదే.' అని ఓ చోట ఉత్పత్తి సాధనాల జాతీయీకరణ విషయంలో బూర్జువా విమర్శలకు ముగింపు పలుకుతారు. మరో చోట బూర్జువా సోషలిజం అంటే నిరంతరం బూర్జువా వర్గ ఆధిపత్య సమాజం కొనసాగింపే తప్ప మరోటి కాదని చెప్తూ దానికోసం బూర్జువా సమాజం నిరంతరం సంస్కరణలకు లోనవుతుందని వివరిస్తూ "కార్మికవర్గం ప్రస్తుత సమాజం పరిధిలోనే ఉండాలి. బూర్జువా వర్గం పట్ల ఉన్న అన్ని రకాల వ్యతిరేకతలను పక్కనపెట్టాలి" అని చెప్తూనే "బూర్జువా వర్గం బూర్జువా వర్గమే... బూర్జువా సోషలిజం కార్మికవర్గానికి మేలు చేస్తుందా?" అని ప్రశ్నిస్తారు. ఓచోట కమ్యూనిస్టులు తమ భావాలను బాహాటంగా వ్యక్తీకరించటానికి మొహమాటపడరు అని హృద్యంగా చెప్పారు. 'తమ లక్ష్యాలను దాచిపెట్టుకోవటం అంటే కమ్యూనిస్టులకు వెగటు కలుగుతుంది. ప్రస్తుత పరిస్థితులను బలవంతంగా మార్చటం ద్వారానే తమ అంతిమ లక్ష్యాన్ని చేరుకోగలమని బాహాటంగానే ప్రకటిస్తున్నారు. కమ్యూనిస్టు విప్లవం గురించి విని పాలకవర్గాల వెన్నులో వణుకు పుట్టనీయండి. పోగొట్టుకోవడానికి కార్మికుల వద్ద ఏమీ లేదు. సంకెళ్లు తప్ప.కానీ జయించటానికో ప్రపంచం ఉంది. ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అని పిలుపునిస్తారు.

కార్మికవర్గానికి దక్కేదేమిటి, పోయేదేమిటో ఇంత తేలికపాటి పదాలతో గుండెలకు హత్తుకునేలా వివరించిన తర్వాత " కార్మిక వర్గానికి పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప" అన్న పదబంధం అర్థం పరిధి కేవలం ఆయా పదాలు విడివిడిగా అందించే అర్థానికి, పరిధికీ మించినవని చెప్పటానికి ఏ మాత్రం సందే హించాల్సిన అవసరం లేదు. పదాల వెనక ఉన్న ఉద్రేకం, ఉద్వే గం మధ్య వాక్య నిర్మాణాన్ని తరచూ మర్చిపోతుంటాము. ఈ వ్యాసం ముగింపులో కమ్యూనిస్టు ప్రణాళికలోని మరో ముఖ్యమైన పేరగ్రాఫ్ గురించి చర్చించుకోవాలి. "కమ్యూనిస్టు లు బాహాటంగా ప్రపంచం ముందు తమ అభిప్రాయాలు, లక్ష్యాలు, ధోరణులు కమ్యూనిస్టు మానిఫెస్టో ద్వారా ప్రకటించి కమ్యూనిస్టుల గురించి జరుగుతున్న దుష్ప్రచారానికి ముగింపు పలకాలి." అంటారు. తద్వారా ఆస్తుల జాతీయీకరణ మొదలు మహిళల జాతీయీకరణ వరకూ కమ్యూనిస్టుల గురించి, కమ్యూనిస్టుల హింసాత్మక చర్యల గురించి, గతకాలపు నాగరిక తలు సాధించిన విజయాలను తుడిచిపెడతారన్న వాదనల గురించి, ప్రచారంలో ఉన్న కాకమ్మ కబుర్లను కొట్టిపారేస్తూ ఇదంతా కమ్యూనిజం అంటే గిట్టని వారు కమ్యూనిజాన్ని ఓ బూచిగా చూపించేందుకు చేస్తున్న ప్రయత్నమేనని స్పష్టం చేస్తారు. అదే సమయంలో కమ్యూనిస్టు ప్రణాళిక ప్రపంచం ముందుంచే లక్ష్యాలు నిజంగానే బూర్జువా వర్గానికి వెన్నులో వణుకు పుట్టిస్తాయని కూడా చెప్తారు. బూర్జువావర్గం మాట్లాడే 'సాంస్కృతిక పతనం' కేవలం బూర్జువా వర్గపు సంస్కృతికి కాలం చెల్లుతుందన్న ఆందోళనే తప్ప మరోటి కాదు. బూర్జువా సంస్కృ తి అంటే విశాల ప్రజానీకాన్ని యంత్రాల్లా పని చేయించటమే. అందుకే ఈ సంస్కృతిని రద్దు చేస్తారు అంటే బూర్జువా వర్గానికి ఆందోళన కలుగుతుంది. ❑ (లాంగ్ ఐలండ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ పాల్ ఎన్ సీగెల్ సైన్స్ అండ్ సొసైటీ, సంపుటి 46, సంచిక 2, 1982లో రాసిన వ్యాసం తెలుగు పాఠకులకోసం.. అనువాదం : కొండూరి వీరయ్య)




లిస్టు రెడీ

గేమ్ ఓవర్









ముసుగు వెనుక


కార్టూన్స్ : సతీష్ ఆచార్య


RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 1 - Issue No : 10 July 2023

## కొత్త పుస్తకాలు స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.